ప్రజలే ప్రభువులు

# జనబలం

జనవరి 2026 | లోక్‌సత్తా ఉద్యమ సంస్థ మాస పత్రిక | రూ.10/-






## ఉద్యోగాల సృష్టి ఎక్కడ? యువత ఎలా సంపాదించుకోవాలి?

## ఇన్సూరెన్స్‌లోకి 100%ఎఫ్.డి.ఐ.తో ప్రజలకు ఆరోగ్యం?

## HMDA మాస్టర్ ప్లాన్- రైతుల ఆందోళన

## సరైన విధానాలు+అధునాతన సాంకేతికతలు= ప్రతిబిడ్డకూ అవకాశాలు






## మైలురాయి: 2026

**మారథాన్ లక్ష్యం:** తెలంగాణ రైజింగ్ - స్వర్ణాంధ్ర - వికసిత్ భారత్ 2047 (21వ శతాబ్దం 2.0)

**సవాళ్లు :** 3 అంకెలు

1) పనిచేసే జనాభాలో 80-90% అసంఘటిత రంగంలో ఉండటం

2) 60-70% ఇప్పటికీ గ్రామాల్లో నివసించటం

3) 46% ప్రజలకు వ్యవసాయమే జీవనాధారమవటం

**పరిష్కారాలు :**

☞ అప్పు చేసి తాత్కాలిక పథకాలు నిషేధం, సంక్షేమం, అభివృద్ధి మధ్య సమతూకం

☞ వివక్ష లేకుండా సమాన అవకాశాల కోసం అందరికీ నాణ్యమైన విద్య, ఆరోగ్యం

☞ గ్రామాల మధ్య చిన్న పట్టణాల అభివృద్ధితో యువతకు ఉపాధి

☞ పెట్టుబడులకు, మహిళలూ రాత్రి షిఫ్టుల్లో పనిచేసేందుకు చట్టబద్ధపాలన

☞ యువతీ యువకులు చట్టసభల్లోకి వెళ్లేలా స్థానిక ప్రభుత్వాల సాధికారత, పార్టీల ప్రజాస్వామీకరణ

☞ జమిలికి బదులు దామాషా ఎన్నికల పద్ధతి

☞ పౌర సేవలు ఆలస్యమైతే పరిహారంతో సిటిజన్స్ చార్టర్ల RTS చట్టం

### పరిష్కారంలో భాగమవుదాం ..
### సమ్మిళిత అభివృద్ధి భారత్‌ను సాధించుకుందాం

-

– డాక్టర్ జయప్రకాష్ నారాయణ్,
ప్రజాస్వామ్య పీఠం (FDR), లోక్‌సత్తా వ్యవస్థాపకులు

# జనబలం

ప్రజలే ప్రభువులు

లోక్‌సత్తా ఉద్యమ సంస్థ మాసపత్రిక

జనవరి 2026

సంపుటి 27 సంచిక 01


**జనబలం చందా రుసుము వివరాలు**

| | | |
|---|---|---|
| సంవత్సర చందా | : | రూ. 100.00 |
| మూడు సంవత్సరాలకు చందా | : | రూ. 290.00 |
| ఐదు సంవత్సరాలకు చందా | : | రూ. 475.00 |
| జీవితకాలపు చందా | : | రూ. 1200.00 |


**సంపాదకవర్గం**

బండారు రామ్మోహనరావు

శిరమని నరేష్

**వర్కింగ్ ఎడిటర్**


దూసనపూడి సోమసుందర్


*జనబలంలో ప్రచురితమవుతున్న వ్యాసాలలో రచయిత(త్రు)లు వెలిబుచ్చే అభిప్రాయాలు కేవలం వారి సొంతం. జనబలం సంపాదకవర్గం ఆ అభిప్రాయాలతో ఏకీభవిస్తున్నట్టు కాదు.*

**చందాదారులకు విజ్ఞప్తి**

చందా మొత్తాలను, ప్రకటనల ధర మొత్తాలను చెక్కుగాని, డి.డి. ద్వారా గాని FOUNDATION FOR DEMOCRATIC REFORMS పేర పంపవచ్చును. NEFT సౌకర్యము ద్వారా పంపదలచినవారు SBI PUNJAGUTTA BRANCHలోని SB A/C. No. 52086568057కి IFSC CODE No. SBIN0020072కు పంపి, Transaction I.D. No. మరియు తారీఖు తప్పనిసరిగా తెలియజేయవలెను. నగదు రూపంలో చెల్లించదలచిన వారు లోక్‌సత్తా సంస్థ కేంద్ర కార్యాలయంలో ఇచ్చి రశీదు పొందవలెను.

**కార్టూన్ కార్నర్**





| | |
|---|---|
| 06 | ఉద్యోగాలు సృష్టి ఎక్కడ? యువత సంపాదించుకోవటం ఎలా? |
| 12 | ఇన్సూరెన్స్ లో 100% ఎఫ్.డి.ఐతో వంద శాతం ప్రజలకు ఆరోగ్యం సాధ్యమా? |
| 15 | తెలంగాణ VS కేరళ పంచాయతీ ఎన్నికలు |
| 20 | జెన్ జడ్, జెన్ ఆల్ఫా |
| 25 | నిపుణుల బృందాన్ని ఏర్పాటు చేద్దాం: జేపీ |
| 29 | విజన్‌కి తగ్గ విధానాలు ప్రశ్నార్థకం |
| 32 | ఇప్పటి సాంకేతికతలతో మానవాళి చరిత్రనే మార్చగలం: జేపీ |
| 34 | అవినీతి సొమ్ముతో సంతోషంగా ఉండలేరు : కలెక్టర్ |



కార్యాలయ చిరునామా : H.NO. 6-3-678, B-106 , పాషా కోర్టు, 71 , సోమాజీగూడ, త్రిభువన్‌దాస్ జ్యూయలరీ వెనుక, హైదరాబాద్-500 082 ఫోన్: 040-23310288, 040-23419949

Email: accountsdept@loksatta.org

సంపాదకీయం

# ఆరోగ్య రంగానికి చికిత్స అవసరం!

దేశంలో వైద్య విద్య విస్తరణకు గట్టి చర్యలు తీసుకోవాలని ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వశాఖ పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ సూచించింది. మొన్న డిసెంబరులో రాజ్యసభకు కమిటీ సమర్పించిన నివేదికలో పలు కీలక అంశాలను ప్రస్తావించింది. వైద్య విద్యను అందుబాటులోనికి తేవడంలో, సీట్ల కేటాయింపులో ప్రాంతీయ అసమానతలు కనిపిస్తున్నాయని ఆ నివేదిక తేల్చి చెప్పింది. వైద్య విద్యకు పెట్టే ఖర్చు అమిత భారంగా తయారయ్యిందని ఆ నివేదిక స్పష్టం చేసింది. మెడికల్ కళాశాలల్లో బోధకుల కొరత తీవ్రంగా ఉందని కూడా ఆందోళన వ్యక్తం చేసింది. ఎయిమ్స్ ప్రాజెక్టులు నత్తనడకన సాగుతున్నాయని ఆ నివేదిక ఎత్తి చూపించింది. ఆరోగ్య సేవలు అందరికీ అందుబాటులోకి తేవాలని, సేవల నాణ్యతను పెంపొందించాలని ఆ నివేదిక సిఫార్సు చేసింది. వీలైనన్ని ఎక్కువ మెడికల్ కళాశాలలను స్థాపించాలని, ప్రాంతీయ అసమానతలను దృష్టిలో ఉంచుకుని స్థానిక అవసరాలకు అనుగుణంగా అర్హతలలో సడలింపులు ఇవ్వాలని ఆ నివేదిక సూచించింది.

మెడికల్ సీట్ల లభ్యతలో జాతీయ సగటు పదిలక్షల జనాభాకు **75**గా ఉంది. కర్ణాటక, తమిళనాడు, తెలంగాణ రాష్ట్రాల్లో ఈ సగటు పదిలక్షల జనాభాకు **150** సీట్లు కాగా, కొన్ని రాష్ట్రాల్లో ఈ సంఖ్య **50** కంటే తక్కువగా ఉంది. బీహార్‌లో ఈ సంఖ్య **21**గా మాత్రమే ఉంది. పాండిచ్చేరిలో మాత్రం ఈ సంఖ్య **2000**గా ఉంది. మెడికల్ సీట్ల లభ్యతలోని అసమానతల ఫలితంగా ఎందరో విద్యార్థులు వైద్య విద్యా అవకాశాలను కోల్పోతున్నారు. వారు చదువుకోసం ఇతర రాష్ట్రాలకు వెళ్లాల్సి వస్తున్నది అంటూ ఆ నివేదిక పేర్కొన్నది.

పదిలక్షల జనాభాకు **100** ఎంబీబీఎస్ సీట్లు తగ్గకుండా అందుబాటులో ఉంచాలని స్టాండింగ్ కమిటీ నివేదిక నేషనల్ మెడికల్ కమిషన్‌కు సిఫార్సు చేసింది. నియమావళి ప్రకారమే మౌలిక సదుపాయాలు, ఫ్యాకల్టీ, ఉన్న కళాశాలలన్నిటికీ.. ప్రభుత్వ, ప్రైవేటు తేడా లేకుండా...మెడికల్ సీట్ల సంఖ్యను **250**కి పెంచడానికి అనుమతి ఇవ్వాలని ఆ నివేదిక సిఫార్సు చేసింది. న్యూఢిల్లీ విద్యార్థులు ఇతర రాష్ట్రాలకు, దేశాలకు వెళ్ళే అవసరం లేకుండా అక్కడే అత్యధిక మెడికల్ కళాశాలలు ఏర్పాటు చేయాలని కూడా నివేదిక సూచించింది.

ఎంబీబీఎస్ పూర్తి చేయడానికి ఒక విద్యార్థికి ప్రస్తుతం **60** లక్షల నుండి కోటి రూపాయల వరకూ ఖర్చవుతోంది. పేద కుటుంబాలకు పెనుభారంగా మారిన వైద్య విద్యా వ్యయాన్ని తగ్గించడానికి చర్యలు తీసుకోవాలని ఆ నివేదిక స్పష్టం చేసింది. ప్రైవేటు మెడికల్ కళాశాలలలో **50** శాతం సీట్లు ప్రభుత్వ ఫీజు చట్రం పరిధిలోకి తేవాలని, మిగిలిన సీట్ల ఫీజును యాజమాన్యాలు, ప్రభుత్వం ఏర్పాటు చేసే కమిటీలు సంప్రదించుకుని క్రమబద్ధీకరించాలని, పేద విద్యార్థుల అవసరాలకు అనువుగా స్కాలర్‌షిప్‌లివ్వాలని ఆ నివేదిక సూచించింది.

డిసెంబర్‌లో రాజ్యసభలో జరిగిన ఒక చర్చ సందర్భంగా కొత్త మెడికల్ కళాశాలల ఏర్పాటు సమస్య కూడా ప్రస్తావనకు వచ్చింది. కొత్త కళాశాలల ఏర్పాటు విషయంలో స్థాయీ సంఘాలు పూర్వం నుండీ చేస్తున్న సిఫార్సులను అమలు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని సభ్యులు పలుమార్లు డిమాండ్ చేశారు.

గత రెండేళ్లలో దేశంలో **118** మెడికల్ కళాశాలల ఏర్పాటుకు నేషనల్ మెడికల్ కమిషన్ ఆమోదం తెలిపినట్లు కేంద్ర ఆరోగ్య శాఖ సహాయమంత్రి ఇటీవల రాజ్యసభలో తెలిపారు. గత సంవత్సరం **74** కళాశాలల ఏర్పాటుకు ఆమోదం తెలపగా **2025**లో మరో **44** కళాశాలలకు ఆమోదం లభించినట్లు మంత్రి వివరించారు. ఇందులో **21** కళాశాలలు ఒక్క ఉత్తరప్రదేశ్ లోనే ఉన్నాయి. మహారాష్ట్రలో **17** కళాశాలలకు, రాజస్థాన్‌లో **14** కళాశాలలకు, తెలంగాణలో **10** కళాశాలలకు, మధ్య ప్రదేశ్‌లో ఎనిమిది, పశ్చిమ బెంగాల్‌లో ఎనిమిది కళాశాలకు అనుమతి లభించిందని గణాంకాలు చెబుతున్నాయి.

ఒడిశా, తమిళనాడు, బీహార్, కర్ణాటక, కేరళ రాష్ట్రాల్లో నాలుగు చొప్పున, హర్యానా, అసోం, గుజరాత్, పంజాబ్, రాష్ట్రాల్లో మూడు చొప్పున, ఆంధ్రప్రదేశ్, ఉత్తరాఖండ్, ఛత్తీస్‌ఘడ్, మేఘాలయ రాష్ట్రాల్లో రెండు చొప్పున , జమ్మూ కాశ్మీర్, న్యూఢిల్లీ, జార్ఖండ్ రాష్ట్రాలకు ఒక్కొక్కటి చొప్పున కళాశాలలు మంజూరయ్యాయి.

మెడికల్ కళాశాలను పబ్లిక్ ప్రైవేట్ భాగస్వామ్యంలో ఏర్పాటు చేయాలని నీతి ఆయోగ్ ప్రతిపాదించింది. ఈ ప్రతిపాదనకు వివిధ రాష్ట్రాల్లో మిశ్రమ స్పందన లభిస్తున్నది. మధ్యప్రదేశ్‌లో థర్, బేతుల్, కట్నీ, పన్నా జిల్లాల్లో పీపీపీ పద్ధతిలో నాలుగు మెడికల్ కళాశాలకు అనుమతి లభించగా మొన్న డిసెంబర్ లో ఆదివాసీ ప్రాంతాలైన థర్, బేతుల్ , పట్టణాల్లో రెండు మెడికల్ కళాశాలల నిర్మాణానికి పునాదిరాయి పడింది. మిగిలిన రెండు మెడికల్ కళాశాలల ఏర్పాటుకు ఆయా పట్టణాల్లో సన్నాహాలు వేగంగా మొదలయ్యాయి. కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్ర, బీహార్ వంటి రాష్ట్రాల్లో పీపీపీ విధానంలో మెడికల్ కళాశాలల స్థాపనకు ప్రైవేట్ సంస్థలు ఉత్సాహంగా ముందుకు వస్తున్నాయి.

ఆంధ్రప్రదేశ్‌లో మాత్రం పీపీపీ విధానం వివాదాస్పదం అయ్యింది. పాలక ప్రతిపక్ష పార్టీలు వేర్వేరు వైఖరులు

తీసుకోవడంతో కొత్త కళాశాలల ఏర్పాటు ప్రక్రియకు ఆరంభంలోనే ఎదురుదెబ్బ తగిలింది. మూడు నాలుగు దశాబ్దాల క్రితం ఆంధ్రప్రదేశ్‌లో ప్రైవేటు మెడికల్ కళాశాలల స్థాపనకు రాజకీయ స్థాయిలో పెద్ద ఎత్తున తీవ్ర వ్యతిరేకత వ్యక్తం అయ్యింది. అయినా అప్పటి ప్రభుత్వం దానిని లెక్కచేయకుండా ప్రైవేటు కళాశాలలకు అనుమతి ఇచ్చింది. రాష్ట్రంలో వైద్య విద్య విస్తరింపచడంలో ప్రభుత్వ కళాశాలలతో పాటు ప్రైవేటు మెడికల్ కళాశాలలు కూడా ముఖ్యపాత్ర పోషించాయని అనుభవం తేల్చింది.

అనంతర కాలంలో తెలుగు సమాజంలో మెడికల్ సీట్లకు డిమాండ్ పెరగడంతో ప్రైవేటు మెడికల్ కళాశాలల స్థాపనపై రాజకీయ వ్యతిరేకత మెల్లిగా చల్లబడింది. నానాటికీ పెరుగుతున్న మెడికల్ సీట్ల డిమాండ్ రీత్యా రాష్ట్రంలో 17కొత్త మెడికల్ కళాశాలల ఏర్పాటుకు గత పదేళ్లుగా ప్రభుత్వాలు వరుస ప్రతిపాదనలు పంపించాయి. దేశంలో మూడు దశలుగా **157** మెడికల్ కళాశాలలు ఏర్పాటు చేయడానికి అప్పట్లోనే నేషనల్ మెడికల్ కమిషన్ ఆమోదం తెలిపింది. మూడో దశలో భాగంగా ఆంధ్రప్రదేశ్‌లో పది ప్రభుత్వ మెడికల్ కళాశాలలు, మూడు ప్రైవేటు మెడికల్ కళాశాలల ఏర్పాటుకు నేషనల్ మెడికల్ కమిషన్ ఆమోదం తెలిపింది. రాష్ట్ర ప్రభుత్వం కూడా దశలవారీగా కళాశాలల ఏర్పాటుకు పూనుకున్నది.

ఏడు కళాశాలల స్థాపనకు 2019 ఆగస్టులో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదనలు పంపించింది. వాటి ఏర్పాటుకు ఆమోదం కూడా లభించింది! ఆయా కళాశాలల స్థాపనకు పునాదిరాయి పడింది. అందులో నాలుగు కళాశాలలు పని చేయడం కూడా ప్రారంభించాయి. నిధుల కొరత కారణంగా మిగిలిన కళాశాలల పనులు వేర్వేరు దశలలో నిలిచిపోయాయి. ప్రస్తుత ప్రభుత్వం వాటిని పీపీపీ పద్ధతిలో నిర్వహించేందుకు నిర్ణయం తీసుకున్నది. కొత్త మెడికల్ కళాశాలల స్థాపనకు పచ్చ జెండా చూపిన గత పాలకపక్షం పీపీపీ విధానాన్ని వ్యతిరేకిస్తోంది. ప్రభుత్వ రంగంలోనే మెడికల్ కళాశాలలను ఏర్పాటు చేయాలని కోరుతూ కోటి సంతకాలను సేకరించి గత నెలలోనే గవర్నర్‌కు సమర్పించింది.

తాను మళ్ళీ అధికారం లోకి వస్తే పీపీపీ విధానాన్ని రద్దు చేస్తానని, ఆ పద్ధతిలో ఆమోదం పొందిన బిడ్‌లను రద్దు చేస్తానని, అవసరమైతే బిడ్డర్లపై కఠినచర్యలు తీసుకుంటానని మాజీ ముఖ్యమంత్రి తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. దాంతో పీపీపీ విధానంలో కళాశాలల ఏర్పాటు కోసం ప్రారంభించిన బిడ్డింగ్ ప్రక్రియ నిలిచిపోయింది. తొలుత ఉత్సాహం చూపిన బిడ్డర్లు వెనుకంజ వేశారు. కేంద్ర, రాష్ట్ర , ప్రభుత్వాల అధినేతలు, అధికారులు ఎంతగా ప్రోత్సహించినా బిడ్‌లో పాల్గొనడానికి ఎవరూ ముందుకు రాలేదు. మాజీ ముఖ్యమంత్రి గారి బెదిరింపు ప్రభావం స్పష్టంగానే కనిపించింది.

ఐదేళ్ల నాడే అనుమతులు వచ్చినా మెడికల్ కాలేజీలను మొత్తంగా ఏర్పాటు చేసుకోలేకపోవడానికి రాష్ట్రానికి తగిన వనరులు లేకపోవడమే కారణం. దాంతో చేతికి అందివచ్చిన మెడికల్ సీట్లను ఆంధ్రప్రదేశ్ కోల్పోయింది. ప్రభుత్వ ప్రైవేటు భాగస్వామ్యంతోనైనా కొన్ని కళాశాలలు ఏర్పాటయితే రాష్ట్రంలో సీట్ల లభ్యత పెరుగుతుందని ప్రస్తుత ప్రభుత్వం భావించింది. పీపీపీ విధానంలో కూడా యాభైశాతం సీట్లు కన్వీనర్ కోటాలో ఉంటాయి. అర్హతగల పేద విద్యార్థులకు సీట్లు లభిస్తాయి. ప్రభుత్వం అనేది ఒక నిరంతర ప్రక్రియ. ఆచరణాత్మక సౌలభ్యం కోసం ఒక ప్రభుత్వం విధానంలో చేసిన మార్పును మరో ప్రభుత్వం రాజకీయ కారణాలతో తిరగతోడటం మొదలు పెడితే దానికి అంతం అంటూ ఉండదు. అంతిమంగా రాష్ట్రం నష్టపోతుంది. పీపీపీ భాగస్వామ్యాన్ని వ్యతిరేకించేవారు చెప్పే కారణాల్లో ఆలోచించాల్సిన అంశాలు ఉన్నాయనేది కూడా నిజమే.

బోధనా ఆస్పత్రులుగా మారబోతున్న ప్రభుత్వ ఆస్పత్రులలో ఇంతవరకూ అందిస్తున్న ఉచిత సేవల గురించి వారు సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. ఎన్టీఆర్ వైద్యసేవ, ఆయుష్మాన్ భారత్, వంటి పథకాలకు ప్రభుత్వ ఆస్పత్రులలో లభిస్తున్న సేవల నాణ్యత అంతంత మాత్రమే. అవి మరింత దిగజారతాయని వారు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వ ఆస్పత్రులలో వసతుల లేమి, సిబ్బంది కొరత, పరికరాల నాణ్యత, మందుల కొరత వంటి సమస్యలు పట్టి పీడిస్తున్నాయి. బోధనా ఆస్పత్రులుగా మార్చిన తర్వాతైనా వాటి స్థితిని మెరుగుపరచుకోవచ్చు. కానీ ఇలాంటి సమస్యల పేరుతో కళాశాలల స్థాపనను నిరవధికంగా వాయిదా వేసుకోవడం వైద్య విద్య విస్తరణను అడ్డుకుంటుంది.

అందరం దృష్టి పెట్టాల్సిన ముఖ్యమైన అంశాలు ఎన్నో ఉన్నాయి. భారతదేశ ఆరోగ్యరంగం కుప్పకూలే అంచుకు చేరింది. వైద్య రంగం బడ్జెట్ నానాటికి కుదించుకు పోతున్నది. వైద్య విద్య లోపాలతో కొనసాగుతున్నది. మెడికల్ కౌన్సిల్ నియమావళిని ఉల్లంఘించే ఆస్పత్రులను పట్టించుకునే సరైన యంత్రాంగం లేదు. దేశంలో జరుగుతున్న మానవ శస్త్రచికిత్సల్లో అవసరం లేనివి 44 శాతం వరకూ ఉన్నాయని ఒక గ్లోబల్ హెల్త్ వాచ్ చేసిన సర్వే వెల్లడించింది. కార్పొరేట్ ఆస్పత్రులలో జరిగే మోసాలకు, వైద్య ఆరోగ్య బీమా సేవలలో లోపాలతో పాటు, వాటి వినియోగంలో మోసాలకు కూడా అంతులేదు. ప్రభుత్వ ఆరోగ్య పథకాల అమలు నాసిగా ఉంటున్నది. ఇవన్నీ కీలక సమస్యలు. వాటి పరిష్కారానికి ఆలోచించాల్సి ఉంది. ప్రభుత్వ, ప్రైవేటు, పీపీపీ, పద్ధతి ఏదైనా వైద్య, ఆరోగ్య రంగంలో సేవల నాణ్యతను, జవాబుదారీతనాన్ని పెంపొందించడం మన ముందున్న తక్షణ కర్తవ్యం.

డి. సోమ సుందర్



# ఉద్యోగాలు సృష్టి ఎక్కడ? యువత సంపాదించుకోవటం ఎలా?

*హైదరాబాద్ వీసీఈ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన టెడెక్స్ టాక్ షోలో ఇంజినీరింగ్ విద్యార్థులనుద్దేశించి ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్.డి.ఆర్), లోక్ సత్తా వ్యవస్థాపకులు డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ చేసిన ప్రసంగంలోని కొన్ని ప్రధానాంశాలు:*

**అందరికీ నమస్కారం!**

ఈరోజు నేనొక పెద్ద వివాదాస్పద అంశం మీద మాట్లాడదలచుకున్నాను. ప్రతి సంవత్సరం, ప్రతి రాజకీయ పార్టీ, ప్రతీ ప్రభుత్వం యువతకు చందమామను హామీ ఇస్తున్నాయి. విద్యార్థి దశ నుండే యువతను మభ్యపెట్టి తప్పుదోవ పట్టిస్తున్నాయి. అసంఖ్యాక యువతకు ప్రభుత్వంలో ఉద్యోగాలిస్తామని నటిస్తున్నాయి. రకరకాల పేర్లతో ప్రభుత్వాలు ఆర్భాటపు ప్రకటనలు చేస్తుంటాయి. మెగా రిక్రూట్‌మెంట్, జాబ్ క్యాలెండర్ వగైరా వగైరా.

యువతీ యువకులైన మీరు ప్రభుత్వంలో చేరటానికి నేనేమీ వ్యతిరేకం కాదు. మనకు ప్రభుత్వంలో అత్యున్నత ప్రతిభాపాటవాలు, సేవాభావం కలవారు చేరటం అవసరం. కానీ నా విన్నపం ఏమిటంటే - ప్రభుత్వోద్యోగమే మీ జీవితాశయం గావించుకోకండి.

ఎందుకో చూడండి.

ప్రభుత్వంలో పోటీపరీక్షలకు హాజరయ్యేవారిలో 300 మందిలో ఒకరు మాత్రమే ఎంపికవుతారు. కానీ లక్షలాది యువత తమ విలువైన సమయాన్ని సంవత్సరాల తరబడి ఈ పరీక్షల కోసం సమర్పిస్తున్నారు. అయిదేళ్లు, 10 ఏళ్లు.. ఇలా. ప్రభుత్వాలు పోటీ పరీక్షలకు అర్హత వయసును పెంచు కుంటూపోతూ అందరిలో ఆశను కొనసాగిస్తున్నాయి. దీంతో సంవత్సరాల తరబడి ప్రభుత్వోద్యోగాల వేటలోనే గడుపుతున్నారు. మీరంతా గణితం విద్యార్థులు. గణాంకాల్ని పరిశీలించండి. 100 కో, 200, 300 కో ఒకే ఒక్కరు ఎంపికైతే, మిగలినవారి సంగతేంటి? మీరు వ్యక్తిగతంగా ఎదగ టానికైనా, దేశానికి ఏదైనా చేయటానికైనా మరింత సునిశితంగా, తెలివిగా, వాస్తవికంగా ఆలోచించాల్సుంది.

మీకు కొన్ని స్లయిడ్లు చూపిస్తాను. మొదటిది - థామస్ పెయిన్ మాటలు. ఆయన ఏమన్నారూ - ప్రభుత్వం ఓ తప్పనిసరిభారం. ఆ ప్రభుత్వం అధ్వాన్నమైనదైతే ఇక చెప్పనక్కర్లేదు.. భరించటం కష్టం. కాబట్టి, మన సమస్యలకు ప్రభుత్వం పరిష్కారం అని పొరపాటున కూడా ఆలోచించవద్దు. కానీ మనకున్న ఉమ్మడి అవసరాలను తీర్చటానికి ప్రభుత్వం అవసరం.

అంటే ప్రభుత్వం ఏం చేయాలీ? నాణ్యమైన విద్య ద్వారా మన సామర్థ్యాన్ని వికసింప చేయాలి..ఆ పని చేస్తోందా?.. మన పిల్లల్లో అత్యధికులకు మంచి చదువు, సమాజానికి పనికొచ్చే నైపుణ్యాలు అబ్బటం లేదు. అదేవిధంగా ఆరోగ్యం! మంచి ఆరోగ్యం లేకుండా బాగా చదవటం, ఎక్కువ ఉత్పత్తి

*ప్రభుత్వోద్యోగం కోసం జీవితాన్ని ధారపోయొద్దు. మీకు నిబద్ధత, తపన ఉంటే ఒక ప్రయత్నం చేయండి. కానీ జీవితంలో అదొక్కటే అని మాత్రం అనుకోకండి. మీరు ఎంపిక కాలేదు కాబట్టి.. ఎంపికైనవారు గొప్పవారని భ్రమపడబోకండి. ఎంపిక కాలేనివారు ఏ రకంగానూ తక్కువ కాదు. మీరొక విషయాన్ని అర్థం చేసుకోవాలి. గత 8 ఏళ్లలో 22 కోట్ల మంది ప్రభుత్వోద్యోగాలకు ఈ దేశంలో దరఖాస్తు చేస్తే, కేవలం 7.2 లక్షల మందే ఎంపికయ్యారు.*




చేయటం ఎలా సాధ్యం?ప్రజలు, మన దేశంలో అయితే ఎక్కువగా యువత, సంపద సృష్టించేలా అభివృద్ధిని పెంచటానికి అవసరమైన ఈ రకమైన మౌలిక పనులు ప్రభుత్వాలు చేయాలి. దీన్నుంచి ఉపాధి అవకాశాలు వస్తాయి. కానీ ప్రభుత్వం వ్యక్తిగత అభివృద్ధిని సృష్టించ లేదు. ఆ అభివృద్ధిని మీరు సృష్టిస్తారు. మీ కుటుంబాలు సృష్టిస్తాయి. మీరు పడే కష్టం, మీ ఆవిష్కరణలు, మీ లక్ష్యశుద్ధి, మీ పొదుపు .. ఇవీ మిమ్మల్ని కష్టాల నుండి గట్టెక్కిస్తాయి. అంతేతప్ప, ప్రభుత్వం కాదు! ఆ భ్రమలో ఉండకండి.

ఇక యూనియన్ సివిల్ సర్వీసుల విషయం తీసుకోండి. సుమారు 15 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారు. వారిలో పది లక్షలు పరీక్షకు హాజరయ్యారు. ఎంతమంది ఎంపికవుతారు? మహా అయితే ఓ వెయ్యిమంది. మీరు ఐఏఎస్ గురించి మాట్లాడితే, 100 మంది!లెక్కలేసి చూసుకోండి. కానీ ఆ కలను నెరవేర్చుకోవటం కోసం లక్షలాది మంది 10 ఏళ్ల పాటు తమ జీవితాల్ని ధారపోస్తున్నారు. ఎంపికైనవారేమో, తాము మానవాళికి దేవుడిచ్చిన వరంగా మురిసిపోతున్నారు. ఉద్యోగాల్లో చేరాక వాళ్లలో చాలామంది తమ బాధ్యతల్ని సక్రమంగా నెరవేర్చటం లేదు. చెయ్యాల్సిన రీతిలో, స్థాయిలో పనిచేయటం లేదు. ఇదెంత చేదు నిజమో మీ అందరికీ తెలుసు, నాకూ తెలుసు.

ఎంపిక కానివారు జీవితంలో కొన్ని విలువైన సంవత్సరాలు కోల్పోయామని నిరాశ నిస్పృహల్లో కూరుకుపోతారు. తమ మీద తాము నమ్మకాన్ని కోల్పోతారు. వారికి ఏం చేయాలో తెలియదు. కాబట్టి, ప్రభుత్వోద్యోగం కోసం జీవితాన్ని ధారపోయొద్దు. మీకు నిబద్ధత, తపన ఉంటే ఒక ప్రయత్నం చేయండి. కానీ జీవితంలో అదొక్కటే అని మాత్రం అనుకోకండి. మీరు ఎంపిక కాలేదు కాబట్టి.. ఎంపికైనవారు గొప్పవారని భ్రమపడబోకండి. ఎంపిక కాలేనివారు ఏ రకంగానూ తక్కువ కాదు. మీరొక విషయాన్ని అర్థం చేసుకోవాలి. గత 8 ఏళ్లలో 22 కోట్ల మంది ప్రభుత్వోద్యోగాలకు ఈ దేశంలో దరఖాస్తు చేస్తే, కేవలం 7.2 లక్షల మందే ఎంపికయ్యారు. అంటే, 146 కోట్ల జనాభా ఉన్న దేశంలో ఏడాదికి ఒక లక్ష మందిని మించి ఎంపిక కాలేదు. ప్రతి 300 మందికి ఒకరన్న మాట. మిగతా 299 మంది పరిస్థితి ఏమిటి? అది గదా ఆలోచించాల్సింది!

ప్రభుత్వం పుష్పక విమానం కాదు. మహా అయితే, ఉద్యోగ మార్కెట్‌లోకి వచ్చేవారిలో 1% మందికి ఉద్యోగాలివ్వగలదు. కేవలం ఒక్క శాతం! కానీ ఉద్యోగ మార్కెట్‌లోకి ఏటా 1 కోటీ 20 లక్షల మంది యువత కొత్తగా వచ్చి చేరుతున్నారు.ఇలాంటప్పుడు ప్రభుత్వోద్యోగం గురించి అతిగా ఆశించటం తెలివైన పని అవుతుందా?

అసలు ప్రభుత్వోద్యోగాలకు ఎందుకంత డిమాండ్ ఏర్పడింది? ఎందుకు కోట్ల మంది అలా ఎగబడుతున్నారు?..అది వలసకాల భావజాల అవశేషం. ప్రభుత్వోద్యోగంలో చేరితే, ప్రజాస్వామ్యంలో మీరో మహారాజు అయినట్లు భావిస్తుంటారు. ప్రజలు మీ దగ్గరికి వచ్చి చేయిజాచి అర్థించేవారుగా ఉంటారని దర్పం ప్రదర్శిస్తుంటారు. మన పెత్తందారీ సమాజంలో ప్రభుత్వం అంటే తల్లీతండ్రీ అనుకుంటాం. మన దేశంలో పిల్లలకు ఎంత వయసొచ్చినా, ఏదైనా సమస్య వస్తే బాగోగుల్ని అమ్మానాన్న చూడటం ఆనవాయితీ.ఈ సామాజిక సంస్కృతి పాలనా యంత్రాంగానికి అలుసుగా మారిపోయింది. ప్రజల్ని ప్రభువులుగా కాకుండా, దిక్కూదివాణంలేని వారుగా, అలగా జనంగా ఎక్కువమంది అధికారులు భావిస్తుంటారు.

కానీ ఒక నాగరిక ప్రజాస్వామ్య సమాజంలో అధికారం

అంటే సేవ. అదో బాధ్యత. భూస్వామ్య సమాజంలో మాత్రమే పదవి అంటే పెత్తనం, ప్రజల్ని వీలైనంత నియంత్రించటం! మీ సొంత డబ్బులైనా సరే, ఏ వ్యాపారం చేయాలన్నా, ఏ పని చేయాలన్నా లైసెన్స్ ఉండాలి. ప్రభుత్వ యంత్రాంగం అనుమతి తీసుకోవాలి. మీరు ఏం చేయాలో అన్నీ సర్కారు వారే నిర్ణయిస్తారు. దీనివల్ల అన్నిటికీ ప్రభుత్వోద్యోగులుంటారుగానీ, ఎవరికీ జవాబుదారీతనం ఉండదు. మీరు పనిచేశారా, లేదా?లంచాలేమైనా తీసుకుంటున్నారా? మీరు సమర్థులా, కాదా?.. అని అధికారులను గురించి పట్టించుకునేవారెవరూ ఉండరు. గుర్రంలా పని చేసినా, గాడిదలా చేసినా, లంచాల కోసమే పనిచేసినా.. మీకు జీవితకాల భరోసా ఉంటుంది. దీనికితోడు, మార్కెట్‌తో పోలిస్తే అధిక జీతాలు అందుతాయనే నమ్మకం. ప్రభుత్వంలో పనిచేసినా, చేయకున్నా.. అదేపనికి ప్రయివేటులో కంటే రెట్టింపు జీతాల్ని ఇవ్వటం భారతదేశంలో ఆనవాయితీగా పాతుకుపోయింది. కొన్ని ఉద్యోగాల్లోనైతే మూడు రెట్లు కూడా ఎక్కువ జీతాలిస్తారు. ఆ డబ్బంతా ఎవరు చెల్లిస్తున్నారు?.. ముఖ్యమంత్రి కాదు, ప్రధానమంత్రి కాదు! మీరు, నేను మన పన్నుల డబ్బు నుండి కడుతున్నాం. అందుకు సరైన ప్రతిఫలం కావాలని మనం డిమాండ్ చేయాలి. కాబట్టి, ప్రభుత్వం చేసే ఖర్చులో ప్రతి రూపాయీ ప్రజాధనం. వ్యక్తుల నుండి వెళ్తోంది, సంస్థల నుండి వెళ్తోంది. ఎందుకూ?.. ప్రభుత్వం మన ఉమ్మడి అవసరాలను తీర్చటం కోసం. జాగ్రత్తగా గుర్తుపెట్టుకోండి -- మనందరి ఉమ్మడి అవసరాలను తీర్చటం కోసం! మీ వ్యక్తిగత అవసరాలు, మీ జీవితం - మీ ఇష్టం. మీ ఎంపికలు, మీరు చేసే నిర్ణయాలు, ప్రయత్నాలు - అన్నీ మీ సొంతం. మీరు ఎక్కడ చదువుతారు, ఏం చదువుతారు, ఎక్కడ నివసిస్తారు, మీ డబ్బు ఎలా ఖర్చు పెడతారు, ఏ వృత్తిని చేపడతారు, ఏ వ్యాపారం చేస్తారు, ఎవరిని పెళ్లి చేసుకుంటారు.. అన్నీ మీ వ్యక్తిగత జీవితం. జీవితంలో 85% పూర్తిగా మీ సొంతమన్నమాట. ఓ 15 లేదా 10 విషయాలు -- మనకు అవసరమైనవి, కానీ వ్యక్తిగతంగా నిర్వహించుకోలేనివి ఉన్నాయి. అవి జరగకపోతే మన జీవితం దుర్భరమయ్యేవి ఉంటాయి. అవి చేయటానికి మాత్రమే ప్రభుత్వం. మన ఉమ్మడి అవసరాలను తీర్చటానికి. రోడ్లు ఎలా నిర్మించాలి, మౌలిక సదుపాయాలు ఎలా కల్పించాలి? వీటితోపాటు.. కనీసం నాణ్యమైన పాఠశాల విద్య, మంచి ప్రమాణాల వైద్య ఆరోగ్య సేవలు ప్రతి ఒక్కరికీ అందుబాటులోకి తేవటం, చట్టబద్ధపాలన, శాంతిభద్రతల పరిరక్షణ కోసం ప్రభుత్వం.

దేశంలో ట్రాఫిక్ ఎంత అస్తవ్యస్తంగా ఉందో మీ అందరికీ తెలుసు. మీలో చాలామంది హైదరాబాద్‌లోనే ఉంటారు. నగరంలోని వివిధ ప్రాంతాల నుండి ఈ కాలేజీకి రావటానికి, అంటే ఒక వైపు ప్రయాణానికి గంటన్నర, రెండు గంటలు పడుతోందని చెబుతున్నారు. ట్రాఫిక్ నిర్వహణ సవ్యంగా, ప్రభుత్వం ద్వారా ఉమ్మడిగా ఏర్పరచుకున్న నిబంధనల ప్రకారం ఉన్నట్లయితే ఇంత సమయం పడుతుందా? ఈ చిన్న పని చేయటంలో ప్రభుత్వ వైఫల్యం వల్ల మనం అనవసర శ్రమకోర్చాల్సి వస్తోంది. ఇలా ఎన్నో ఉదాహరణలు నేను చెప్పగలను.

కాబట్టి, ప్రభుత్వం మన ఉమ్మడి అవసరాలను తీర్చటానికి ఏర్పరచుకున్నది తప్ప ఎక్కడో పైనుంచి దిగిరాలేదు. పాలకులు, ప్రభుత్వ యంత్రాంగం తమ పని సవ్యంగా చేయటం లేదు. కానీ మనం చెల్లిస్తున్న పన్నుల డబ్బును మాత్రం ఎడాపెడా ఖర్చుపెడుతున్నారు. పన్నుల డబ్బుకు తగిన సేవల్ని అందించకపోవటమే రాజ్యాంగబద్ధ దోపిడీ కాగా..అందులో కూడా కొంతడబ్బును నాయకులు సొంతానికి కైంకర్యం చేస్తున్నారు. నిరుద్యోగ సమస్యకు ప్రభుత్వమే పరిష్కారమని మిమ్మల్ని మభ్యపెడుతున్నారు. భ్రమల్లోకి నెడుతున్నారు. ఫలితం - నేను ఇంతకుముందు చెప్పినట్లు, కోట్లాది యువత తెలివితేటలు, సామర్థ్యం సంవత్సరాల తరబడి వృథా అవుతున్నాయి. వారి మనో స్థైర్యం తీవ్రంగా దెబ్బతింటోంది. ఎంపికైనవారేమో.. తాము నిజంగా ప్రత్యేకమైనవారమని, చాలా గొప్పవారమని అనుకుంటున్నారు. ప్రజలకు బాగా సేవ చేస్తున్నవారు చాలా తక్కువమంది! ఈ రకంగా, ప్రభుత్వోద్యోగంలోకి ఎంపికైన వారి వల్ల లాభం తక్కువ, ఎంపికకానివారు ఏళ్ల తరబడి విలువైన కాలాన్ని వృథా చేయటం వల్ల నష్టం చాలా ఎక్కువ పరిస్థితి నెలకొంది.

ఈ నేపథ్యంలో, ప్రభుత్వం బయట ఉద్యోగాలు ఎక్కడ నుంచి వస్తాయి? మనకు ఎలా వస్తాయి?..ఇవీ యువత దృష్టి సారించాల్సిన అసలైన ప్రశ్నలు.

"ప్రజల అవసరాలను తీర్చటం నుండి ఉద్యోగాల సృష్టి జరుగుతుంది".. ఈ ప్రసంగం నుండి ఏమీ నేర్చుకోకున్నా, దయచేసి ఈ ఒక్క అంశాన్నీ మీ మెదళ్లలోకి గ్రహించండి, ఆలోచించండి.

ప్రజల ఉమ్మడి అవసరాలను తీర్చటం ద్వారా వ్యక్తిగత, సమష్టి అవసరాలను వస్తూత్పత్తి, సేవలతో తీర్చటం ద్వారా ఉద్యోగాలు వస్తాయి. వ్యక్తులు పనిచేయటం ద్వారా సమాజం అవసరాలు తీరతాయి. సమాజ అవసరాలను తీర్చకుండా ఉపాధికి అవకాశమే లేదు. మీరు వస్తువుల్ని, సేవల్ని ఉత్పత్తి చేయటం తప్పనిసరి. ఎందుకోగానీ, మన దేశానికి ఈ మౌలిక వాస్తవం పట్టుబడలేదు..ప్రభుత్వమే ఉద్యోగం




సృష్టిస్తుంది, ఉద్యోగం ఇస్తుంది అనే అభిప్రాయంలో, భ్రమలో భారతీయ సమాజం మగ్గుతోంది. ప్రభుత్వంలోని వారికి జీతాలు ఎలా ఇస్తారు, వాళ్లు ఏం చేస్తారు – దేవుడికే ఎరుక. యువత ఉపాధి సమస్యకు ప్రభుత్వం పరిష్కారమన్నది పచ్చి అబద్ధం, అమలులో అసాధ్యం.

ఇంతకుముందు చెప్పినట్లు – ఇతర దేశాలను చూడండి. అమెరికాలో ఒక ఉద్యోగానికి ప్రయివేటు రంగం రూ.100 చెల్లిస్తుంటే, ప్రభుత్వం రూ.104 ఇస్తోంది. బ్రిటన్‌లో ప్రయివేటు రంగం ఇచ్చే రూ.100 కి, ప్రభుత్వంలో రూ.74 చెల్లిస్తున్నారు. ప్రయివేటులోరూ.100 ఇచ్చే ఉపాధికి ప్రభుత్వాలు..జపాన్ లో రూ.113, జర్మనీలో రూ.89, సింగపూర్ లో రూ.83, చైనా 104 చెల్లిస్తున్నాయి. భారత్‌లో ప్రయివేటులో రూ.100 ఇస్తుంటే, ప్రభుత్వం రూ.181 చెల్లిస్తోంది. కొన్ని ఉద్యోగాల్లోనైతే 250 రూపాయలు కూడా చెల్లిస్తున్నారు. అంతకంటే విషాదం.. చాలా సందర్భాలో వాళ్లు సరిగా పనిచేయకపోవటం. ప్రయివేటు రంగంలో ఇలా పనిచేయకపోతే, సమాజం వారిని శిక్షిస్తుంది. ప్రజలు మీ వస్తువులు, సేవల్ని కొనరు.

భారత్ లో మొత్తం పనిచేసేవారు 54 కోట్ల వరకు ఉంటారు. అందులో ప్రభుత్వోద్యోగులు కేవలం 3%. జాతీయ, రాష్ట్ర స్థాయిల్లో, ప్రభుత్వ రంగ సంస్థలన్నిటిలో కలిపి 1.8 కోట్లు మాత్రమే. ఆ మూడు శాతం ప్రభుత్వోద్యోగుల్ని 97% ప్రజలు మన పన్నుల డబ్బుతో, మనం అప్పు తెచ్చిన డబ్బుతో పోషిస్తున్నారు. ప్రతీ వేతన సంఘం వారి జీతాల్ని ఇబ్బడిముబ్బడిగా, మార్కెట్‌తో సంబంధం లేకుండా పెంచేస్తోంది. ప్రభుత్వోద్యోగులు కొద్దిమందే అయినా.. వారు సంఘటితంగా ఉంటారు, గొంతున్నవాళ్లు, తాత్కాలికంగానైనా పాలన స్తంభింప చేయగలవారు కాబట్టి.. మిగతా దేశాన్ని పణంగా పెట్టి వారికి జీతభత్యాలు పెంచు కుంటూ పోతున్నారు. ఈ క్రమంలో కొన్ని పనులు ఎక్కువ, కొన్ని తక్కువ అనే అపోహ ప్రజల్లో ఇంకా ప్రబలుతోంది. సమాజానికి ఉపయోగపడటం ద్వారా మనం సంపాదించు కోవటానికి అవకాశాన్నిచ్చే ప్రతి పనీ విలువైనదే అనే డిగ్నిటీ ఆఫ్ లేబర్.. ఉన్నకొద్దీ మన వద్ద కుంచించుకుపోతోంది.

మరే దేశంలోనైనా, కుళాయిలు బిగించే, బాగుచేసే ప్లంబర్ మిగతా అన్ని వృత్తులవారితో సమానమే. తేడా ఏమీ ఉండదు. ఇప్పుడు ఒక్కసారి మీ ఊహకు పదునుపెట్టి ఆలోచించి చూడండి.

మీ జిల్లా మేజిస్ట్రేట్, కలెక్టర్ లేదా మీ మునిసిపల్ కమిషనర్ ఒక వారం రోజులుపనికి రాలేదనుకోండి. వారి గైర్హాజరీ వల్ల ఏదో జరిగిపోయిందని మీలో ఎంతమంది బాధపడతారు? దేవుడా, నా జీవితం ముగిసిపోయిం దనుకుంటారా? బతకలేమనుకుంటారా?.. నిజాయతీగా చెప్పండి. మా కలెక్టర్ గారు ఇవాళ ఆఫీసుకి రాలేదని మనలో ఒక్కరైనా ఓ రెండుసార్లయినా అనుకుంటామా? కానీ మన బాత్‌రూమ్‌లో తూములు పూడిపోయా యనుకోండి. ప్లంబర్ అందుబాటులో లేరు. బాత్‌రూమ్ గొట్టాల్లో పూడిక తీసేందుకు మీరు చేసిన ప్రయత్నం

ఫలించలేదు. ఒక్కరోజు ఉండగలరా? ఆ దుర్వాసన భరించగలరా? మన జీవితంలో ఎవరు ముఖ్యమో ఇప్పుడు చెప్పండి. మన రోజువారీ జీవితాన్ని సౌకర్యవంతం చేసే ప్లంబరా? లేక ఎక్కడో ఉన్న దొరగారా? సదరు ఉన్నతాధికారి ఉన్నా, లేకున్నా చాలా సందర్భాల్లో మన జీవితాల్లో పెద్ద తేడా ఏమీ కనిపించదు. నిజాల్ని గుర్తిద్దాం. మన ప్రజలకు డిగ్నిటీ ఆఫ్ లేబర్‌ని అందిద్దాం. పనికొచ్చే సేవను అందించేవారు లేదా ఉపయోగపడే వస్తువుల్ని ఉత్పత్తి చేసేవారు ఎవరైనా.. వారు సమాజానికి విలువైన వారు. అంతేతప్ప, వారి హోదా ముఖ్యం కాదు. వాళ్లు చెలాయించే అధికారం, వాళ్లు ఖర్చు పెట్టే డబ్బు ముఖ్యం కాదు. అదంతా ప్రజాధనమే.

సంపన్న దేశాలనే తీసుకోండి. ఓఈసీడీ దేశాల్లో తూములు పూడిక తీసే ఒక ప్లంబర్‌కి ఆకర్షణీయమైన ఆదాయం వస్తుంది. గౌరవప్రదమైన జీవితం గడుపుతుంటారు. అలాంటి దేశాల్లో, ప్రభుత్వమా ప్రయివేటా తేడా లేకుండా మీలాంటివారు వస్తువుల్ని, సేవల్ని ఉత్పత్తి చేస్తున్నారు. సమాజం అవసరాల్ని తీరుస్తున్నారు. ఆర్థికాభివృద్ధి, నాణ్యమైన జీవితం, ఆత్మగౌరవం అన్నీ వారికి సమకూరుతున్నాయి. మీరు గనక ప్రభుత్వోద్యోగమే గొప్ప, గౌరవనీయమైనది అని భావిస్తుంటే, మన జీవితాల్లో నిజమైన నాణ్యతను పెంచుతున్న శ్రామికుల్ని అవమానిస్తుంటే, మన దేశంలో, అంటే మనకు అందే రోజువారీ సేవలు చెత్తగా ఉంటాయి. నిరుద్యోగంలో మగ్గుతాం. పేదరికంలో కొనసాగుతుంటాం. కాబట్టి మనం చేయాల్సింది ఏమిటో సరిగా ఎంచుకోండి.

ముగింపు అంశాలకొస్తాను. స్కూలు నుండి గానీ, కళాశాల నుండి గానీ వచ్చే ప్రతి బిడ్డా మంచి ప్రమాణాల నైపుణ్యాలతో ఉండేలా సానబట్టే విద్యను అందించటంలో ప్రభుత్వం ఘోరంగా విఫలమవటం మన సమస్య. దక్షిణ కొరియాను చూడండి. పాఠశాలల నుండి 96% మంది మార్కెట్‌కి తగిన మంచి నైపుణ్యాలతో వస్తారు. జర్మనీని తీసుకోండి. ఇవన్నీ పాఠశాల స్థాయి వృత్తి విద్యలు. జర్మనీలో 75% మంది పని ద్వారా, ఏదైనా సంస్థలో శిక్షణార్థిగా చేరటం తదితరాల ద్వారా విలువైన నైపుణ్యాలను నేర్చుకుని విద్యాసంస్థల నుండి వస్తారు. అమెరికాలో ఆ సంఖ్య 52%. అదే భారత్‌లో 5% కంటే తక్కువ. మన వద్ద మెకానికల్ ఇంజినీరింగ్‌లో గ్రాడ్యుయేషన్ చేస్తున్న ఇంజినీర్‌ని ఓ స్కూటర్‌కో, కారుకో వచ్చిన సమస్యను చూడమని తల్లిదండ్రులు అడిగితే, బాగుచేయగలరా? చాలామంది దిక్కులు చూస్తారు. నిజాయతీగా మాట్లాడుకుందాం. ఆ యువ ఇంజినీర్ ఏం

*మన వద్ద మెకానికల్ ఇంజినీరింగ్‌లో గ్రాడ్యుయేషన్ చేస్తున్న ఇంజినీర్‌ని ఓ స్కూటర్‌కో, కారుకో వచ్చిన సమస్యను చూడమని తల్లిదండ్రులు అడిగితే, బాగుచేయగలరా? చాలామంది దిక్కులు చూస్తారు. నిజాయతీగా మాట్లాడుకుందాం. ఆ యువ ఇంజినీర్ ఏం చేస్తాడూ? చదువురాని ఓ మెకానిక్ దగ్గరికి వాహనాన్ని తీసుకెళ్తాడు. ఎందుకంటే, అతనికి నైపుణ్యాలున్నాయి. మన ఇంజినీర్ కి ఏ నైపుణ్యమూ లేదు.*

చేస్తాడూ? చదువురాని ఓ మెకానిక్ దగ్గరికి వాహనాన్ని తీసుకెళ్తాడు. ఎందుకంటే, అతనికి నైపుణ్యాలున్నాయి. మన ఇంజినీర్‌కి ఏ నైపుణ్యమూ లేదు. రోజువారీ జీవితంలో ఉపయోగించగలిగిన, ఉపయోగపడే, ఉపాధి నైపుణ్యాల మీద, వారికి ఉపాధి అవకాశాల్ని కల్పించటం మీద ప్రభుత్వం దృష్టి పెట్టాలి.

ఈ నేపథ్యంలో ప్రభుత్వం నుండి మనకు అందాల్సిన ప్రధానమైన సేవలు ఏమిటి? నాణ్యమైన, సమర్థవంతమైన మౌలిక వసతులు, మెరుగైన ప్రమాణాల ఆరోగ్య సంరక్షణ --కనీసం పాఠశాల విద్య, ఉన్నత విద్యలో నాణ్యతకు భరోసా.

మీ కళాశాల అందరికీ గర్వకారణం. రావటానికే గంటన్నర పడుతున్నా, సాయంత్రం ట్రాఫిక్‌లో ఇంకా ఎక్కువ సమయం పడుతున్నా.. మంచి కాలేజీ కాబట్టి తాము ఆ కష్టాన్ని ఓర్చుకుంటున్నట్లు విద్యార్థులు చెప్పారు. కానీ ఎన్ని ఇంజినీరింగ్ కళాశాలలు మంచివి ఉన్నాయి? మన అవసరాలకు, ఎదిగే అవకాశాలకు తగిన చదువును అందిస్తున్న కళాశాలలు ఎన్ని?.. కాబట్టి, మంచి ప్రమాణాల ఆరోగ్యం, విద్య, పారదర్శకమైన, సమర్థవంతమైన అధికార యంత్రాంగం, అందరినీ సమానంగా చూస్తూ సేవల్ని వేగంగా, పెద్ద ఖర్చు లేకుండా అందించటం,వ్యాపార వాణిజ్యాలకు అనవసర నియంత్రణల్ని తొలగించటం అవసరం. భారతదేశంలో ప్రభుత్వోద్యోగంలోకి ఎంపికైనవారిలో చాలా మంది పనితీరుని ఇంతకుముందే చెప్పాను. ఫలితంగా, మనకు పౌర సేవల్లో ఓ పెద్ద సంక్షోభం రాజ్యమేలుతోంది. మీకు ఒక తాజా ట్రెండింగ్ పట్టిక చూపుతాను. జాగ్రత్తగా

గమనించండి.

నేను ఓ 50 పెద్ద ఆర్థిక వ్యవస్థ దేశాలను ఎంచుకున్నాను. సుమారు 200 బిలియన్ డాలర్లు, ఆపైన జీడీపీ కలిగినవి. ప్రపంచమంతా ఆమోదించిన ప్రమాణాల ప్రకారం సేవల స్థాయిని బేరీజు వేశాను. ఆ ఫలితాల్ని బట్టి ర్యాంకుల్ని నమోదు చేశాను. మొదటి పేజీలోని 25-26 దేశాల్లో ఇండియా ఎక్కడా లేదు. ఒక్కటంటే ఒక్క మౌలిక రంగానికి సంబంధించిన సేవలో కూడా! మరి మనం ఎక్కడున్నాం? 50కి దగ్గర్లోని చివరి 10 ర్యాంకుల్లో మన దేశం ఉంది. మనకి తోడున్న దేశాలు నైజీరియా, బంగ్లాదేశ్, పాకిస్థాన్. భారత్‌కి ఉన్న వనరులకి, ప్రజలు, యువతలోని శక్తి సామర్థ్యాలు, కష్టపడేతత్వానికి అలా ఉండనక్కర్లేదు. ఇంకా ఉన్నతస్థానంలో ఉండే అర్హత మనకి ఉంది. మనం మరింత గొప్ప ఫలితాల్ని సాధించగలం. మనం ఆ లక్ష్యాన్ని వదిలేసి, ప్రభుత్వంలో ఉద్యోగం చుట్టూనే తిరుగుతుంటామా? ఈ ప్రభుత్వోద్యోగాల పిచ్చి, ప్రతిదాంట్లో ప్రభుత్వ జోక్యం.. మన దేశాన్ని నాశనం చేస్తున్నాయి.

ప్రభుత్వం అవసరం. నేను ప్రభుత్వంలో పనిచేశాను. సగర్వంగా, హుందాతనంతో. సమర్థతతో కూడా అని నమ్ముతున్నాను. ప్రభుత్వం అనవసరం అని నేను చెప్పటం లేదు. కానీ మీ నమ్మకమంతటినీ ప్రభుత్వంలోనే పెట్టి, ప్రభుత్వమే మీకు ఉద్యోగాన్నిస్తుందనుకోవటం దేశానికి, యువతకీ వినాశకరం. కాబట్టి, ప్రభుత్వం తన జోక్యాన్ని మౌలిక అంశాల బాధ్యతలకు పరిమితం గావించుకోవాలి. వాటిని సవ్యంగా నెరవేర్చాలి.

ఫలితాల్ని, నైపుణ్యాల్ని మెరుగుపరిచేలా విద్యను సమూలంగా మార్చాలి. కొత్త ఉద్యోగాలను అడ్డుకునేలా కాకుండా.. సృష్టించేలా కార్మిక మార్కెట్ సంస్కరణల్ని అమలు చేయాలి. వ్యాపారం చేయటమంటే ఎందుకొచ్చిన హైరానా అనిపించకుండా.. సులభతరంగా ఉండేలా పన్నుల విధానాన్ని సంస్కరించాలి. తక్కువ నైపుణ్యాలు, తక్కువ ఆదాయాలవారికి వేతన భద్రత ఉండేలా చిన్న పట్టణాల్ని అభివృద్ధి చేయాలి. అభివృద్ధికి పర్యాయపదమైన పట్టణీకరణ అంటే మహానగరాలకు పొట్ట చేత పట్టుకొని వలస పోవాల్సిన అవసరం లేకుండా గ్రామాల మధ్యే చిన్న పట్టణాలను ఆర్థిక కేంద్రాలుగా అభివృద్ధి చేయాలి. హైదరాబాద్ తరహాలో అడ్డదిడ్డంగా, ఆక్రమణలతో కాకుండా.. ప్రణాళికతో, ట్రాఫిక్ సమస్యలు లేకుండా, పర్యావరణహితంగా చేయాలి. తయారీ రంగాన్ని ప్రోత్సహించాలి. ఇదేసమయంలో, మన మనసుల్లో పాతుకుపోయిన సాంస్కృతిక జాడ్యాల్ని, అపోహల్ని వదిలించుకోవాలి. మనకు సంపద సృష్టించేవారు కావాలి. సమాజానికి ఉపయోగపడే ఉత్పత్తుల్ని అందించే ప్రతి పనినీ మనం గౌరవించాలి. ఉద్యోగ భద్రత కన్నా.. పోటీకి మనం విలువనివ్వాలి.

> ***మీ నమ్మకమంతటినీ ప్రభుత్వంలోనే పెట్టి, ప్రభుత్వమే మీకు ఉద్యోగాన్నిస్తుందనుకోవటం దేశానికి, యువతకీ వినాశకరం. కాబట్టి, ప్రభుత్వం తన జోక్యాన్ని మౌలిక అంశాల బాధ్యతలకు పరిమితం గావించుకోవాలి. వాటిని సవ్యంగా నెరవేర్చాలి. ఫలితాల్ని, నైపుణ్యాల్ని మెరుగు పరిచేలా విద్యను సమూలంగా మార్చాలి. కొత్త ఉద్యోగాలను అడ్డుకునేలా కాకుండా.. సృష్టించేలా కార్మిక మార్కెట్ సంస్కరణల్ని అమలు చేయాలి.***

థామస్ సోవెల్ చెప్పిన ఈ ఒక్క కొటేషన్ తో ముగిస్తాను. 'ఒకవేళ ప్రభుత్వం లక్షలాది ఉద్యోగాలను సృష్టించినా, అదో భ్రమ మాత్రమే. సర్కారీ ఉద్యోగాల సంఖ్యలో ఏమీ పెరుగుదల ఉండదు. మీ జేబుల్లో నుండి, నా జేబుల్లో నుండి, దేశానికి నిజమైన సంపద సృష్టి చేసేవారి జేబుల్లో నుండి, కంపెనీలు, వ్యవస్థాపకుల నుండి ప్రభుత్వం ఆ సొమ్ము తీసుకుంటుంది'. వ్యాపార కలాపాల్లో రకరకాల సేవలకు డబ్బు చెల్లిస్తుంటాం. ఆ క్రమంలో ప్రభుత్వం ఉద్యోగాలు స ృష్టిస్తున్నట్లు కనిపిస్తుంది. నిజానికి దానివల్ల మనం మార్కెట్‌లో లక్షలాది ఉద్యోగాల్ని కోల్పోయాం. ఉద్యోగాల సృష్టి జరిగేది ఆ మార్కెట్‌లోనే. మళ్లీ చెబుతున్నాను - మన చుట్టూ ఉన్నవారికి అవసరమైన వస్తువుల్ని, సేవల్ని అందించటం ద్వారా మాత్రమే మనందరికీ ఉపాధి వస్తుంది. ఉపాధి సృష్టికి మరో రహస్యం లేదు.

మీరు ప్రభుత్వంలో చేరాలనుకుంటే, ఆ రకమైన ప్రజాసేవ పట్ల మీకు తపన, ఆర్తి ఉంటే.. ఒక ప్రయత్నం చేయండి. కానీ అదేమీ జీవితాశయంగా మార్చుకోకండి. సంవత్సరాలకు సంవత్సరాలు వృథా చేయకండి. నిజమైన పని.. మార్కెట్‌లో, సమాజంలో ఉంది. నిజమైన ఆవిష్కరణ మార్కెట్‌లో ఉంది. మార్కెట్లు సవ్యంగా, సమర్థంగా పనిచేసేలా చేయటంలోనే నిజమైన భవిష్యత్తు ఉంది. సృజనాత్మకత పెంపొందేలా చేయటం, ఉత్పాదకతను పెంచటం, మన ప్రజలందరి అవసరాలనూ తీర్చే వస్తువులు, సేవల్ని ఉత్పత్తి చేయటంలో ఉంది. ప్రజల్ని పేదరికం నుండి బయటపడి ఎదిగేలా చేయటం, అభివృద్ధిని పెంపొందించటంలో ఉంది. దీని గురించి ఆలోచించండి.

**శుభాభినందనలు.** ☆

# ఇన్సూరెన్స్ లో 100% ఎఫ్.డి.ఐతో వంద శాతం ప్రజలకు ఆరోగ్యం సాధ్యమా?

సబ్ కా బీమా, సబ్ కా రక్ష (ఇన్సూరెన్స్ చట్టాల సవరణ) 2025 చట్టానికి పార్లమెంటు ఆమోదం పొందటం శీతాకాల సమావేశాల్లో ఒక కీలక పరిణామం. ఇన్సూరెన్స్ చట్టం 1938, ఐ.ఆర్.డి.ఏ.ఐ చట్టం 1999, ఎల్.ఐ.సి చట్టం 1956 లను సమూలంగా మారుస్తూ, బీమా నిబంధనలను ఈ చట్టం సరళీకరిస్తుంది. ఇన్సూరెన్స్ రంగంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను (ఎఫ్.డి.ఐ) 74 నుండి 100 శాతానికి పెంచారు. దీనివల్ల 2047 నాటికల్లా బీమా దేశంలోని ఇంటింటికీ చేరుతుందని, పోటీ పెరుగుతుందని, పెద్ద సంఖ్యలో ఉపాధి అవకాశాలు వస్తాయని ఆర్థిక మంత్రి లోక్‌సభలో తెలిపారు. ఈ సందర్భంగా తెలంగాణలోని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర రెడ్డి చర్చలో పాల్గొంటూ కొన్ని కీలకాంశాలపై ఆసక్తికర సూచనలు చేశారు. ఇంజినీర్, విదేశాల్లో ఎడ్యుకేటర్, విప్రో, జీఈ సంస్థల్లో సీనియర్ కార్పొరేట్ ఎగ్జిక్యూటివ్, టెక్నాలజీ ఎంట్రప్రెన్యూర్ అయిన ఆయన అపోలో గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ వ్యవహారాల్లో కూడా పరిజ్ఞానం ఉన్న వ్యక్తి. విశ్వేశ్వర రెడ్డి భార్య డాక్టర్ సంగీతా రెడ్డి అపోలో హాస్పిటల్స్ ఎంట్రప్రైజ్ లిమిటెడ్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్.


విశ్వేశ్వర రెడ్డి మాట్లాడుతూ.. ఉక్కు, అల్యూమినియం వంటి లోహాలు, ఇతర పలు రకాల వస్తువులు విదేశాల్లో, మన దేశంలో కాస్త అటూఇటుగా ఒకే రేటు ఉంటాయని, కానీ ఒక్క వైద్య సేవలు మాత్రం విదేశాలతో పోలిస్తే మన దేశంలో అత్యంత చౌకని అన్నారు. అంత చౌకయినా, మన దేశంలో కోట్లాది మంది ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందటం లేదని, కేవలం అనారోగ్య ఖర్చుల వల్ల ఏటా పదుల లక్షల మంది పేదలవుతున్నారని పేర్కొన్నారు. ఆస్పత్రులతో సంబంధం లేకుండా వైద్య బీమా ఉండటం వల్ల ఈ దేశంలో హెల్త్ కేర్ పేరుతో ఒక సిక్ కేర్ పరిశ్రమ నడుస్తోందన్నారు. 'ఆస్పత్రులకేమో ప్రజలు జబ్బుల బారిన పడితేనే లాభం. ఇన్సూరెన్స్ కంపెనీలకేమో ప్రజలు ఆరోగ్యంగా ఉంటే లాభం'.. ఈ మధ్యలో ప్రజలు నలిగిపోతున్నారన్నారు. భారతదేశం గురించి భారతీయుల కంటే విదేశీయులకు ఎక్కువ అవగాహన ఉందని, అందువల్లే వైద్య ఆరోగ్య రంగంలోకి పెట్టుబడులు వెల్లువెత్తుతున్నాయన్నారు. వంద శాతం ఎఫ్.డి.ఐ మంచి దేనని, అయితే ఆస్పత్రులకే ఇన్సూరెన్స్ బాధ్యతలు



అప్పచెప్పటం వల్ల ప్రజలు ఆరోగ్యంగా ఉండాలని హాస్పిటళ్లు కూడా కోరుకుంటాయన్నారు. ప్రజలు ఆరోగ్యంగా ఉండి, ఇన్ పేషెంట్లుగా చేరకుండా ఉంటేనే ఆస్పత్రులకు లాభాలు వస్తాయన్నారు. క్లెయిమ్‌లు పెరగకుండా.. ఆస్పత్రులే స్వయంగా జిమ్, యోగా, ధ్యానం, ప్రివెంటివ్ హెల్త్ చెకప్ లను ప్రోత్సహిస్తాయన్నారు. అప్పుడు మన దేశంలోని 'అనారోగ్య వ్యాపారం' నిజమైన 'ఆరోగ్య వ్యాపారం'గా మారుతుందన్నారు.

విశ్వేశ్వర రెడ్డి లక్ష్యంలో నిజాయతీ ఉంది. భారత ఆరోగ్య రంగంలో ప్రోత్సాహకాల్ని మార్చటమూ ఎంతో అవసరం. కానీ ఆస్పత్రులకే ఇన్సూరెన్స్ అప్పచెప్పటం సమస్యను పరిష్కరిస్తుందా? కొత్త సమస్యల్ని సృష్టిస్తుందా? అన్నది నిపుణులు లోతుగా అంచనా వేయాల్సి ఉంది.

ఒకరకంగా చెప్పాలంటే, వ్యాధి నివారణ, ప్రాథమిక వైద్యానికి ప్రాధాన్యతను కార్పొరేట్ ఆస్పత్రులే ఉచితంగా, సమర్థంగా, నిజాయతీగా అందిస్తే పరమాద్భుతం. ఎందుకో ఆరోగ్యశ్రీ చికిత్సల కోసం ప్రయివేటు, కార్పొరేట్ ఆస్పత్రులకు మొదటి ప్రాధాన్యతనిచ్చే మనకు ప్రత్యేకించి చెప్పనక్కర్లేదు. కానీ పైకి ఎన్ని చెప్పినా ఖరీదైన ఆస్పత్రులు లాభాలు లేకుండా కేవలం భారం మోస్తూ మనుగడ సాగించటం ఆచరణలో కష్టం. ఒక ఆస్పత్రి చికిత్స, ఆపరేషన్ ద్వారా వచ్చే లాభం వారికి ప్రాథమిక స్థాయి వైద్యంలో లభించదు. ఇప్పటికే అపోలో గ్రూప్ ఆస్పత్రులు పాక్షికంగా ఇన్సూరెన్స్ విధానాన్ని అనుసరిస్తున్నాయి. అదేవిధంగా బెంగళూరు తదితర ప్రాంతాల్లో పేదల కోసం డాక్టర్ దేవి షెట్టి లాంటి వారు 'హృదయాలయ' వంటి ఆస్పత్రుల ద్వారా ఇలాంటి ఇన్సూరెన్స్ పథకాల్ని ప్రివెంటివ్



**2025లో ప్రతి అవయవానికీ సంబంధించిన వ్యాధులు 15 నుంచి 20 శాతం పెరిగాయి..**

## ఫ్యామిలీ డాక్టర్ ప్రాథమిక ఆరోగ్య సెంటర్లే మౌలిక పరిష్కారం

*యువతపై జీవనశైలి వ్యాధులు దాడి చేస్తున్నాయని.. గుండెజబ్బులు, బ్రెయిన్ స్ట్రోక్, మధుమేహం, అధిక రక్తపోటు, ఊబకాయం తదితర వ్యాధులతో ఆస్పత్రులలో చేరుతున్నవారిలో 30 ఏళ్లలోపు యువత 20-30% మంది ఉంటున్నారని గణాంకాలు చెబుతున్నాయి. 2025లో అంతకుముందు సంవత్సరం కంటే ప్రతి అవయవానికి సంబంధించిన వ్యాధులు 20 శాతం దాకా పెరిగాయి. హైదరాబాద్ స్టార్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో 'ది 2025 రియాలిటీ చెక్' చర్చా గోష్ఠిలో వైద్య నిపుణులు ఈ విషయాల్ని వెల్లడించారు. ఆరోగ్యశ్రీ, ఆయుష్మాన్ భారత్‌ల వంటి ఇన్సూరెన్స్ పథకాలకు ఎంత ధారిపోసినా ప్రజలకు ఉపశమనం తప్ప ఆరోగ్యం అందదనిబీ యువతలో జీవనశైలి వ్యాధులు పెరుగుతున్నాయంటే నివారణ, నియంత్రణ స్థాయిలో ప్రాథమిక ఆరోగ్య వ్యవస్థ విఫలమవటమే అందుకు కారణమని డాక్టర్ జేపీ చెబుతున్న విషయాల్ని ఈ గణాంకాలు తాజాగా రుజువు చేస్తున్నాయి. చిన్న పట్టణాలను అభివృద్ధి చేసి ఫ్యామిలీ డాక్టర్ ప్రాథమిక వైద్య సెంటర్లను ప్రభుత్వం పోటీ, ఎంపిక స్వేచ్ఛతో ఏర్పాటు చేయటమే ఇందుకు పరిష్కారం.*

కేర్ స్థాయిలో అమలు చేస్తున్నారు. కానీ వారికి లాభాలు ఈ ఇన్సూరెన్స్ ద్వారా రావటం లేదు, లాభాలే కాదు..ఆస్పత్రుల నిర్వహణ ఖర్చు కూడా ఆపరేషన్లు, ఇతర ఆస్పత్రి సేవల ద్వారానే వస్తోంది. అలాంటప్పుడు ఒకవేళ ఇన్ పేషెంట్ సేవల్ని, వైద్య పరీక్షలు, మందులు సహా ఉచితంగా అందించినా నాణ్యత విషయంలో రాజీపడే అవకాశం ఉంది. సీఎస్ఆర్ నిధుల మేర మాత్రమే కొందరు నిజాయతీగా అందించే అవకాశం ఉంది. అన్నిటినీ మించి పెద్ద ప్రమాదం - ఈ క్రమంలో ప్రభుత్వ ఆరోగ్య వ్యవస్థ నామమాత్రం కావచ్చు. అప్పుడు ప్రయివేటు, కార్పొరేట్ వారు చెప్పినట్టల్లా ఇక ప్రభుత్వం ఆడాల్సి ఉంటుంది. ఆరోగ్యం విషయంలో మీనమేషాలు లెక్కపెట్టే అవకాశం ఉండదు కాబట్టి, ప్రజల్లో గగ్గోలు రాకూడదంటే ప్రయివేటు వారు చెప్పిన షరతులకు ప్రభుత్వం అంగీకరించాల్సి వస్తుంది. దీన్ని నివారించటానికి ఒకవేళ ప్రభుత్వం కూడా సమాంతరంగా కార్పొరేట్ తరహా వ్యవస్థను నడిపిస్తే, ఆ దవాఖానాలన్నీ తెల్ల ఏనుగుల్లా మిగిలిపోయే అవకాశం ఉంది. లేదా కార్పొరేట్ ఆస్పత్రులు బలహీనమై కొత్త వ్యాపార వ్యూహాలను అనుసరించే ప్రమాదం ఉంది. కార్పొరేట్ రంగం బలహీనమైతే సమస్య --పరిశోధనలు కుంటుపడటం, కొత్త టెక్నాలజీ, ఔషధాలు అందుబాటులోకి రాకపోవటం. మనిషి చావు లేకుండా బతకాలని, కనీసం 150 ఏళ్లయినా బతకాలని, తిరిగి యవ్వనానికి వయసు మళ్లించాలని చైనా, రష్యా అధ్యక్షులు సీరియస్‌గా చర్చించుకుంటున్న తరుణంలో, ఇతర గ్రహాల మీదకి వెళ్లయినా మానవజాతి అంతరించిపోకుండా కాపాడుకోవాలని ఆలోచిస్తున్న యుగంలో.. ఆరోగ్యకరంగా జీవిత కాలాన్ని అందించే ప్రయివేటు పరిశోధనలు, నూతన సాంకేతికతలు ఎంతో విలువైనవి. కాబట్టి, ఈ అంశాన్ని నిపుణులు లోతుగా చర్చించటం అవసరం.

ఈ నేపథ్యంలో.. సురక్షితమైన, ఆచరణసాధ్యమైన మార్గం ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్.డి.ఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకులు డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ ప్రతిపాదించిన నమూనా. గ్రామాల మధ్య చిన్న పట్టణాలను అభివృద్ధి చేసి నివారణ, ప్రాథమిక వైద్యం వైద్యపరీక్షలు, మందులు సహా ఉచితంగా అందించాలి. ఈ వైద్యం నాణ్యంగా ఉండేందుకు డాక్టర్ల మధ్య పోటీ, రోగులకు ఎంపిక స్వేచ్ఛ ఉండే తరహాలో ఫ్యామిలీ డాక్టర్ వ్యవస్థను ఏర్పాటు చేసి ప్రభుత్వమే సొంతంగా నిర్వహించటం మేలు. జాతీయ ఆరోగ్య మిషన్ రూపశిల్పిగా జేపీ ప్రతిపాదన చాలా లోతైన అధ్యయనంతో రూపొందించిన ఈ నమూనా అమలు కోసం ఇన్సూరెన్స్ బడ్జెట్ డబ్బుని ప్రభుత్వం వెచ్చించవచ్చు, ఎంబీబీఎస్ డాక్టర్లతో నిర్వహించగలిగిన ఫ్యామిలీ డాక్టర్ సెంటర్ల వల్ల సాంకేతికత, రోగుల ఆరోగ్య చరిత్ర, ఆస్పత్రికి రెఫరల్ వంటివి వృత్తినైపుణ్యంతో సాధ్యమవుతాయి. ఇప్పుడు దేశవ్యాప్తంగా పెరుగుతున్న జీవనశైలి వ్యాధుల నియంత్రణ, మితిమీరిన ఔషధాల వాడకం వంటివి ఈ స్థాయిలోనే కట్టడి

చేయవచ్చు. ప్రభుత్వం లాభాలను ఒక సంస్థగా ఆశించకుండా..పౌరుల ఆదాయాలు, దేశ ఆర్థికాభివృద్ధికి అవసరమైన ఉత్పాదక శక్తి, పొదుపు కోణంలో ప్రయోజనం పొందుతుంది కాబట్టి - విశ్వేశ్వర రెడ్డి చెప్పిన ఆరోగ్య కరమైన విధానం అప్పుడు ఆచరణసాధ్యమవుతుంది. చాలా వ్యాధులు నివారణ, నియంత్రణ కావటం వల్ల.. పైన ఆస్పత్రుల మీద ప్రభుత్వానికి భారం తగ్గుతుంది. చికిత్స రెండో దశలో ఇప్పుడున్న ఆరోగ్యశ్రీ, ఆయుష్మాన్ భారత్ పథకాలను యథాతథంగా ఉపయోగించుకోవచ్చు. అంటే ప్రయివేటు నర్సింగ్ హెూంల భాగస్వామ్యాన్నీ తీసుకోవచ్చు. ఇక మూడో దశలో పూర్తిగా ప్రభుత్వమే ఆధునీకరించిన ఆస్పత్రి సేవలను తన పర్యవేక్షణలో వ్యక్తిగతంగా నిపుణులైన డాక్టర్ల సేవలను కొన్ని విభాగాల్లో, కొంత సమయం మేర ఉపయోగించుకోవచ్చు. దీనివల్ల సమాజంలోని అత్యాధునిక వైద్యం తక్కువ ఖర్చుతో ప్రజలకు అందించవచ్చు. బోధన లోనూ ప్రయివేటు నిపుణులకు అవకాశం కల్పించి మెరుగైన యువ డాక్టర్లు తయారయ్యేలా చేయవచ్చు.

విశ్వేశ్వరరెడ్డి చెప్పిన మరో అంశం, మన దేశంలో అత్యాధునిక వైద్య సేవలు అభివృద్ధి చెందిన దేశాలతో పోలిస్తే చాలా చౌక. కాబట్టి, మెడికల్ టూరిజాన్ని అభివృద్ధి చేసి అందులో ప్రయివేటు, కార్పొరేట్ వర్గాలను ప్రోత్స హించి, ప్రతిఫలంగా పరిశోధనల్లో వారి పెట్టుబడులను ప్రభుత్వం కోరవచ్చు. ఈ రకమైన బాధ్యతను, ఆచరణ సాధ్యతను ప్రభుత్వం ప్రదర్శిస్తేనే ప్రభుత్వ-ప్రయివేటు భాగస్వామ్యం సమాజహితానికి, ఆరోగ్య భారతానికి దోహదం చేస్తాయి. ఇందుకయ్యే ఖర్చు కూడా చాలా తక్కువ. అదనంగా జీడీపీలో 0.5 - 1% కేటాయిస్తే చాలు. కావలసిందల్లా రాజకీయ సంకల్పం, ఆయా రంగాల్లో నిపు ణులతో చర్చించి నిజాయతీగా బేరీజు వేసుకునే లక్ష్యశుద్ధి.

**విద్యకు అవసరానికి మించి ఖర్చు..**
**ఆరోగ్యానికి కొద్దిపాటి అదనపు ఖర్చు కేటాయించకపోవటం**
**.. రెండు రంగాల్లోనూ వృథా పద్ధతుల్లో వ్యయం**

రాజకీయ సంకల్పం ఎందుకు కీలకం అంటే, ఇటీవల తెలం గాణ ముఖ్యమంత్రి, విద్యామంత్రి కూడా అయిన రేవంత్ ఢిల్లీ వెళ్లి రూ.30,000 కోట్లు అప్పు తెచ్చుకోవటానికి ఎఫ్.ఆర్.బి.ఎం చట్ట నుండి మినహాయింపు ఇవ్వాలని ఆర్థికమంత్రిని కోరారు. ఆ డబ్బుతో 105 నియోజక వర్గాలలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూళ్లు నిర్మిస్తామని తెలిపారు. ఒక్కో స్కూల్లో 5-12 తరగతుల్లో 2,560 మంది విద్యార్థులు చదవగలుగుతారు. తెలంగాణలో స్కూలు పిల్లలు మొత్తం ప్రభుత్వ, ప్రయివేటులో కలిపి 67 లక్షల దాకా ఉంటారు. పైతరగతులకు వెళ్లేకొద్దీ డ్రాపౌట్లు ఎక్కువగా ఉన్న రాష్ట్రాల్లో తెలంగాణ ఒకటి కాబట్టి.. 5-12 మధ్య ఓ 30 లక్షల మందిని అంచనా వేసుకుందాం. 105 యంగ్ ఇండియా స్కూళ్లలో ప్రపంచ స్థాయి విద్యను అందిస్తే, ఓ 2-3 లక్షల మందికి అందించగలరు. మరి మిగిలినవారి సంగతి? ప్రభుత్వ, ప్రయివేటు తేడా లేకుండా తెలంగాణలో విద్యాప్రమాణాలు అధ్వాన్నంగా ఉన్నాయని తాజా అసర్, పరఖ్ సర్వేక్షణ్ తదితర నివేదికలు గణాంకాలతో సహా తేల్చిచెప్పాయి. ఒక్కో విద్యార్థి మీదా ప్రభుత్వం పాఠశాలల్లో రూ.1,08,000 వెచ్చిస్తోందని, అయినా చదువు రావటం లేదని ముఖ్యమంత్రే స్వయంగా వాపోయారు. అంటే, సుమారు 28 లక్షల మంది విద్యార్థులను గాలికొదిలేసి, డబ్బు మాత్రం ఖర్చు చేస్తుంటారన్న మాట. యూనియన్ విద్యాశాఖ ఇటీవల పార్లమెంటుకు ఇచ్చిన నివేదిక ప్రకారం.. ఒక్క విద్యార్థీలేని స్కూళ్లలో తెలంగాణ దేశంలోనే నెంబర్ వన్. 2024-25లో ఇక్కడ 2,081 పాఠశాలల్లో పిల్లలు ఎవరూ చేరలేదు. ఏటా ఈ తగ్గుదల సంఖ్య పెరుగు తోందే తప్ప తగ్గటం లేదు. మరోవంక, అన్ని స్కూళ్లలో హేతుబద్ధంగా సర్దుబాట్లు చేసినా తెలంగాణలో 10,000 మంది టీచర్లు ఖాళీగా ఉన్నారని రాష్ట్ర విద్యాశాఖే తెలిపింది. ప్రభుత్వం ఒక్కో విద్యార్థి మీదా రూ.1,08,000, పది వేల టీచర్లకు ఏడాదికి రూ.800 కోట్లు వృథాను అలా వదిలేసి.. ఎఫ్.ఆర్.బి.ఎం మినహాయింపుతో తెచ్చిన రూ.30,000 కోట్లకు ఏటా రూ.మరో 1850 కోట్లు వడ్డీ చెల్లిస్తారట. ఇంతా చేసి 2-3 లక్షల మంది పిల్లలకే, ఒకవేళ మంచి చదువు అందితే అందుతుందట. ఏం పరిపాలన ముఖ్య మంత్రి ప్లస్ విద్యామంత్రిసారూ?

విద్యకేమో అనవసరంగా ఎక్కువ కేటాయింపులు, ఆరోగ్య రంగానికేమో కొద్దిపాటి అదనపు కేటాయింపులు కూడా లేవు. తెలంగాణలో వైద్య ఖర్చులు భరించలేక ఏటా 19 లక్ష ల మంది పేదలవుతున్నారు. పలువురు మహిళలు ఖర్చులు భరించలేక, ఆరోగ్య కేంద్రాల్లో సరైన సౌకర్యాలు, సరైన సి బ్బంది లేక రోగాలు ముదరబెట్టుకుంటున్నారు. జేపీ చెప్పిన నమూనాలో అందరికీ ఆరోగ్యం అందించటానికి అదనంగా అవసరమైనది కేవలం రూ.1950 కోట్లు.విద్యలో వృథా అరికడితే చాలు, ఆరోగ్యంలో సరైన విధానాల్ని అమలు చేయగల డబ్బుకి మించి సమకూరుతుంది.

కాబట్టి.. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, భారతదేశం ప్రజలకు సరైన ఆరోగ్యాన్ని వ్యక్తిగత ఆర్థిక భారం లేకుండా అందించే విధానం కోసం ఇన్సూరెన్స్, నివారణ, ప్రాథమిక వైద్యం సహా వివిధ అంశాలపై జేపీ, విశ్వేశ్వరరెడ్డి లాంటి నిపుణు లతో చర్చించి నిర్ణయం తీసుకునే విజ్ఞతను, రాజకీయ సంక ల్పాన్ని ప్రభుత్వాలు ప్రదర్శించాలి. ★

# తెలంగాణ VS కేరళ పంచాయతీ ఎన్నికలు

*"ప్రతి ఒక్కరూ డబ్బు, పేరు ప్రఖ్యాతులు సంపాదించుకుని వాటి ద్వారా తాము కలలు కంటున్న అన్ని పనులూ చేసేయాలని కోరుకుంటున్నాను. ఎందుకంటే, సమాధానం అది కాదని అప్పుడైనా వారికి అర్థమవుతుంది"*
*-జిమ్ క్యారీ*

తెలంగాణ పంచాయతీ ఎన్నికలు 2025 జరిగిన సమయంలోనే కేరళలోనూ స్థానిక ప్రభుత్వాల ఎన్నికలు జరిగాయి. ప్రస్తుతానికి రెండు రాష్ట్రాల్లోనూ రిజర్వేషన్లు ఒకేలా ఉన్నాయి. మొత్తంగా 75% దాకా ఉంటాయి. కానీ కేరళలో రిజర్వేషన్లు ఉండటం వల్ల ఎస్.సి, ఎస్.టి, బి.సి, మహిళలకు ఎంతటి సాధికారత లభిస్తోంది? సర్పంచ్, వార్డు సభ్యుల పదవులు ఉత్సవ విగ్రహాలు మాత్రమే అయిన తెలంగాణలో దళిత, అణగారిన వర్గాలు, మహిళలకు రిజర్వేషన్లు ఉన్నా లేకున్నా ఒకటే అనే పరిస్థితి ఎందుకుంది?.. పోల్చుకుని తేల్చుకోవటానికి ఇదో గొప్ప అవకాశం. ఆ వివరాల్లోకి వెళ్లేముందు, డిసెంబర్‌లో జరిగిన తెలంగాణ పంచాయతీ ఎన్నికల తీరుతెన్నులపై మీడియాలో వచ్చిన కొన్ని ప్రత్యక్ష కవరేజీ వార్తలు చూద్దాం:




✦ పంచాయతీ ఎన్నికల్లో శంకర్‌పల్లిలోని ఓ గ్రామ పంచాయతీ సర్పంచ్ పదవికి చేసిన ఓ అభ్యర్థి 2 ఎకరాల భూమి రూ.6 కోట్లకు అమ్మారు. ఇదే గ్రామంలో మరో అభ్యర్థి తన భూమిని రూ.4 కోట్లకు విక్రయించారు. మరో గ్రామంలో ఓ అభ్యర్థి..తన భూమిని తనఖా పెట్టి రూ.50 లక్షలు అప్పు తీసుకున్నారు. ఆస్తి పోయినా ఫర్వాలేదు..పదవి రావాల్సిందే అని కొందరు పట్టుదలకు పోయారు. ఓటుకు రూ.3 వేలు నుండి 5 వేల వరకు పంచేందుకు కొందరు ఇళ్లమ్ముకున్నారు.

✦ మహబూబాబాద్ మండలం సోమ్లాతండాలో జరిగిన ఈ సంఘటన కొద్దిసేపు ఉద్రిక్తతకు దారితీసింది. ఆ అభ్యర్థి సర్పంచ్ ఎన్నికల్లో ఓటమి చెందారు. విజయం కోసం పెట్టిన సొమ్ము వృథా అయ్యిందని బాధ కలిగింది. అంతే, ఆమె కుటుంబ సభ్యులు ఓటర్ల వద్దకు వెళ్లి 'మాకే ఓటు వేసినట్లు ప్రమాణం చేస్తారా..లేక, మేం ఇచ్చిన డబ్బులు తిరిగి ఇస్తారా?' అంటూ హడావుడి చేశారు. పోలింగ్‌కు ముందు అభ్యర్థిని తరపున ఓటుకు రూ.1500, ఇంటికి ఒక కోడిని పంపిణీ చేశారన్న ప్రచారం జరుగుతోంది.

✦ నల్గొండ జిల్లా నార్కట్‌పల్లి మండలం ఔరావాణి గ్రామ పంచాయతీలో ఓడిపోయిన అభ్యర్థి ఇదే తరహాలో తాను డబ్బులు పంచిన ఇళ్లకు పురుగుమందుల డబ్బాతో వెళ్లి, డబ్బు తిరిగివ్వకపోతే ఆత్మహత్యే శరణ్యమని బెదిరించారు. ఇలాంటి సంఘటనలే రంగారెడ్డి జిల్లా జిల్లేడు చౌదరి గూడెం మండలం ఎదిర గ్రామం వంటి పలుచోట్ల చోటు చేసుకున్నాయి. ఓడిపోయినవారు కొందరు బహిరంగ దూషణలకు దిగి గంపగుత్తగా ఓటర్లందరికీ శాపనార్థాలు పెట్టారు.

✦ రంగారెడ్డి జిల్లా శంకర్ పల్లి మండలంలోని ఓ గ్రామ సర్పంచ్ స్థానానికి పోటీ చేసి ఓడిపోయిన అభ్యర్థి.. తనకు ఓటు వేయనివారు డబ్బులు వెనక్కి ఇవ్వకపోతే అయిదేళ్లపాటు వారి పేర్ల జాబితాను రోజూ వాట్సాప్ స్టేటస్‌లో పెడతానని హెచ్చరిస్తూ పోస్ట్ పెట్టారు. డబ్బులు వెనక్కి పంపినవారికి థ్యాంక్స్ చెప్పారు. తమ 'స్టేటస్'కి భంగం వాటిల్లే పరిస్థితి వచ్చిందంటూ కొందరు ఓటర్లు తలలు పట్టుకున్నారు.

✦ యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం తూప్రాన్ పేట, దండు మల్కాపురం, ఆరెగూడెం గ్రామాల్లో మూడో విడత పోలింగ్ రోజు తెల్లవారుజాము నుంచి పోలింగ్ ముగిసే దాకా ఓటర్లకు డబ్బు పంచారు. ఒక అభ్యర్థి ఓటుకు రూ.15,000 ఇవ్వగా, ప్రత్యర్థి కూడా రూ.10,000 వరకు ఇచ్చారు. కుటుంబంలో ఎక్కువ ఓట్లు ఉంటే రూ.20,000 వరకు ఓటుకు ఇచ్చారు. రెండు వైపులా వచ్చిన నగదుతో ఒక్కో ఓటుకు రూ.25-30,000 దాకా సంపాదించుకున్నవారున్నారు. ఆరెగూడెంలో ఒక వార్డు అభ్యర్థే ఓటుకు రూ.10,000 ఇచ్చారు.

✦ తెలంగాణ పంచాయతీ రెండో దశ ఎన్నికలు జరిగే ప్రాంతాల్లో పోలీసుల తనిఖీల్లో రూ.2,02,84,590 నగదు, రూ.3,46,95,639 విలువైన మద్యం, రూ.12,15,500 విలువైన బంగారం, రూ.69,16,500 ఇతరత్రా సామాగ్రి, ఈమధ్య కాలంలో ఎన్నికలలో హాట్ పంపిణీ సరకుగా మారిన మాదక ద్రవ్యాలు రూ.2,28,27,539 విలువైనవి దొరికాయి. కొందరు ఇవి మొత్తం పంపిణీల్లో 5% లోపే ఉంటాయని విమర్శిస్తుంటే, మరికొందరు పోలీసులే ఆ డబ్బులో ఎక్కువభాగం కొట్టేస్తారని ఊహాగానాలు చేస్తున్నారు. ఈ ఎన్నికల్లో నిఘా వేస్తామన్న ఎలక్షన్ వాచ్ వారికి ఏమీ దొరక్కపోవటం ఇంకో విచిత్రం.

✦పంచాయతీ ఎన్నికల్లో గెలిచి సర్పంచ్ హోదాను పొందటానికి శంషాబాద్, కొత్తూరు మండలాల్లోని కొన్ని గ్రామాల్లో నాయకులు గంపగుత్తగా ఓట్లు కొనేశారు. ఓటుకు రూ.5 వేల నుండి రూ.15 వేల వరకు ఇచ్చారని సమాచారం. ఎవరైతే తమకు ఓటు వేసేందుకు విముఖత వ్యక్తం చేస్తున్నారో ఆ ఓటర్ల ఇళ్లకు వెళ్లి కట్టల కొద్దీ నగదు ఇచ్చినట్లు తెలిసింది. ఇలా

రూ.కోట్లు కుమ్మరించిన వారిలో నలుగురు సర్పంచ్ పదవులను గెల్చుకోగా, ఇద్దరు ఓడిపోయారు.

**రూ.అయిదువేలు మామూలే:** ఇటీవల జూబ్లీహిల్స్ అసెంబ్లీ ఉప ఎన్నికలో రెండు ప్రధాన పార్టీల అభ్యర్థులూ ఓటుకు రూ. వెయ్యి నుంచి రూ. రెండు వేలు ఇచ్చారు. ఈ మండలాల్లోని కొన్ని గ్రామాల్లో మాత్రం ఓటుకు కనీసం రూ.5,000 సాధారణమేనని అభ్యర్థులు భావించారు. గరిష్టంగా రూ.15,000 ఇవ్వాలన్న అంచనాతో పోలింగ్‌కు ముందు నుంచే నగదు సిద్ధంగా ఉంచుకున్నారు. ఓ పంచాయతీలో ఓటర్లు.. ఓటుకు రూ.10, 000తోపాటు టీవీ ఇవ్వాలంటూ కోరగా, ఒక అభ్యర్థి కొనిచ్చారని సమాచారం. ఒకరు రూ.2 కోట్లు అప్పుచేసి మరీ నగదు పంపిణీ చేశారు.

✦ ఇవి కాక వేలంపాటల పేరుతో ఊరుమ్మడి ఓట్లను కొనుగోలు చేశారు. ఇలాంటి పంచాయతీలు వందల్లో ఉన్నాయి. ఇసుక, మద్యం, రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఇలా డబ్బు వెదజల్లినవారిలో ముందున్నారు.

✦ డబ్బు, మద్యం తీసుకోబోమని ఓటర్లు మూకుమ్మడిగా నిలబడిన గ్రామాలూ ఉన్నాయి. వేలం పాట డబ్బును ఊరికి ఉపకారం కోసం వెచ్చించిన పంచాయతీలూ ఉన్నాయి. కానీ వాటి సంఖ్య బాగా తక్కువ. జగిత్యాల జిల్లా బీమారం మండలం మన్నెగూడెం గ్రామ పంచాయతీ ఎన్నికల్లో ఇద్దరు ప్రధాన పార్టీ అభ్యర్థులూ ఈ రాజ్యాంగబద్ధతను పాటించారు.

✦ కొన్ని చోట్ల కోతులు మనుషులకు ఓటు విలువను తెలియచెప్పాయి. 'మాకు ఓటుకు డబ్బులొద్దు, కోతుల బెడద వదిలించండి చాలు' అని ఊరందరూ సమస్యను ఏకరువు పెట్టటంతో, డబ్బులు పంచకుండా ఆ హామీనిచ్చి ఓ అభ్యర్థి సర్పంచ్ అయ్యారు.

✦ కేసీఆర్ హయాంలో 2018లో 1248 తండాలను పంచాయతీలుగా మార్చారు. 'మా తండాలో.. మా పాలన కావాలి' అనే స్థానిక ప్రజల నినాదానికి స్పందించి తెలంగాణ ఉద్యమ సమయంలో ఇచ్చిన హామీకి అనుగుణంగా వాటిని పంచాయతీలు చేశారు. తెలంగాణ ఉద్యమ సమయంలో, రాష్ట్రం ఏర్పడి ఆ ప్రతిపాదన కాగితాల్లో ఉన్నప్పుడే ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్.డి.ఆర్), లోక్‌సత్తా వ్యవ స్థాపకులు డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ అదెంతో నష్టదాయకమో బహిరంగంగా తెలియచేశారు. ఇప్పుడదే అక్కడ దుష్పరిపాలనకు ప్రజల్ని బాధితుల్ని చేస్తోంది. మూడో అంచెలోకి బదిలీ అయ్యే నిధులతోపాటు.. ఉన్నకొద్దీ స్థానిక ప్రభుత్వాలు స్వావలంబన దిశగా వెళ్లాలని 16వ ఆర్థిక సంఘం కూడా చెబుతున్న దశలో, పరిమిత జనాభా ఉన్న ఆ తండా పంచాయతీలు ఇప్పుడు సంకటస్థితిని ఎదుర్కొంటున్నాయి. 2019లో ఎన్నికలు జరిగి పాలనాధికారమైతే చేతికొచ్చిందిగానీ, ఆర్థిక ఇక్కట్లు పెరిగి పోయాయి. ఆర్థిక సంఘం నిధులు వీటికి ఏడాదికి సుమారు రూ.1.50 లక్షలు మాత్రమే వస్తున్నాయి. పన్నుల రూపేణా, ఇతరత్రా ఆదాయాలు రూ.1 లక్ష దాటటం లేదు. దీంతో జీతాలు, అప్పుడప్పుడూ రోడ్ల మరమ్మతులు మినహా ఏ రకమైన అభివృద్ధీ లేదు. చాలాచోట్ల మురుగునీటి కాలువలు లేవు. వ్యక్తిగత మరుగుదొడ్లు లేవు. పారిశుద్ధ్యం అంతంతమాత్రమే. రేషన్ దుకాణానికి, పశు వైద్యశాలకి వెళ్లాలన్నా కొన్ని కిలోమీటర్లు నడిచి వెళ్లాలి. కామారెడ్డి జిల్లా రామారెడ్డి మండలంలోని గొడుగుమర్రి తండా పంచాయతీలో 676 మంది జనాభా. 475 మంది ఓటర్లు. అనేక ఇళ్లు ఇప్పటికీ పూరి గుడిసెలు. కాలిబాట తప్ప వాహనాలు వెళ్లే మార్గం పూర్తిస్థాయిలో లేదు. కొన్ని చోట్ల ఉపాధి హామీ నిధులతో కార్యాలయ భవన నిర్మాణానికి అనుమతులిచ్చినా స్థలాలు లేవు.

..ఇవి 2025లో జరిగిన తెలంగాణ పంచాయతీ ఎన్నికల్లో రిపోర్టింగ్‌కు వెళ్లిన కొందరు జర్నలిస్టులు పేర్కొన్న కొన్ని అంశాలు.

> **సర్పంచ్‌లలో 86.4% ఎస్.సి, ఎస్.టి, బి.సిలే..**
>
> **రిజర్వుడు స్థానాల్లో కంటే ఎక్కువ చోట్ల గెలిచిన మహిళలు**
>
> తెలంగాణలో 2025లో 12,702 పంచాయతీ సర్పంచ్ ఎన్నికలకు మూడు విడతల్లో ఎన్నికలు జరిగాయి. రికార్డు స్థాయిలో 85.30% మంది ఓటు వేశారు. ఇందులో కాంగ్రెస్ మద్దతుదారులు రెబెల్స్ తో కలిపి 8,335, బీఆర్ఎస్ 3511, బీజేపీ 710, మిగిలిన స్థానాల్లో వామపక్షాలు, ఇతరులు గెలిచారు. 1205 సర్పంచ్ పదవులు ఏకగ్రీవం కాగా, వార్డు సభ్యుల్లో 25,848 మంది పోటీ లేకుండా ఎన్నికయ్యారు. 1,11,803 మంది వార్డు సభ్యులుగా గెలిచారు. సర్పంచ్‌లుగా 86.4% ఎస్.సి, ఎస్.టి, బి.సిలే గెలిచారు. రిజర్వుడు స్థానాల్లో కంటే అధికంగా 166 చోట్ల (49.7%) మహిళలు గెలిచారు. బి.సిలు 39%, ఎస్.టి లు 29.3%, ఎస్.సిలు 13.6%, జనరల్ కేటగిరీ సర్పంచ్ లు 13.6% గెలిచారు. చెల్లని ఓట్ల సగటు 22%గా ఉంది. విజేతల సరాసరి వయసు 41.5 సంవత్సరాలు. అత్యంత పిన్న వయసు 21 సంవత్సరాలు కాగా, పెద్ద వయసు 95. సర్పంచ్ లలో నిరక్షరాస్యులు 31%, డిగ్రీ లోపు చదివినవారు 54%, గ్రాడ్యుయేట్లు 12%, పోస్ట్ గ్రాడ్యుయేట్లు 3%.

**హైదరాబాద్ ఖాళీ**

ఇలాంటి ఎన్నికల్లో ఎవరు గెలిచినా జరిగేదేమిటి? బీసీలకు ఎన్ని రిజర్వేషన్లు ఇచ్చి ఏం ప్రయోజనం? పెట్టిన ఖర్చును రాబట్టుకోవటానికి వీలైనంత దోచుకోవటం, కబ్జాలు పెట్టటం సాధారణమైపోయింది. 2019 ఎన్నికల తరహాలోనే తండా పంచాయతీల్లోనూ ఈ ఎన్నికల్లో నోట్లు, మద్యం ప్రవహించాయి. హైదరాబాద్ సమీపంలోనైతే భూములకు పెరిగిన డిమాండ్‌కి అనుగుణంగా ఆ పంపకాలు అనేకరెట్లు పెరిగాయి. కాగితం మీద పార్టీరహిత ఎన్నికలైనా, పార్టీలే వీటి ఫలితాల్ని తమ ఖాతాలుగా చెప్పుకుంటున్నాయి కాబట్టి.. ఎన్నికల్లో ఓడిపోయిన పార్టీ వారు అధికార పార్టీ వారైతే రాజధాని నుండి పైరవీలు చేసుకోవటం, ప్రతిపక్ష పార్టీ వారైతే అధికార పార్టీలోకి ఫిరాయించటమో లేక ప్రతి పక్షంలో పెద్ద హామీ ఏదైనా ఇస్తే వేచి

చూడటమో చేస్తారు. అదేవిధంగా, అనేక గ్రామ, తండా పంచాయతీలు జనాభా పరిమాణం రీత్యా నిధుల కొరతతో అభివృద్ధికి ఏఐ యుగం లోనూ ఎంతో దూరంలో ఉంటాయి. ఆ ఉన్న కాసిని డబ్బుల్లోనూ అవినీతి తప్ప అధికారాలు లేవు (చిన్న పంచాయతీకి రూ.5 లక్షలు, మేజర్ పంచాయతీ అయితే రూ.10 లక్షల చొప్పున ఇస్తాం, పండగ చేసుకోండి అని ముఖ్య మంత్రి తాజాగా ప్రకటించారు). గ్రామాల్లో ఓటు వేయటానికి తప్ప యువత ఎవరూ నివసించరు. తెలంగాణ పంచాయతీ ఎన్నికలు జరుగుతున్నప్పుడు హైదరాబాద్ వీధులు ఖాళీ అయ్యాయి. వారిలో ఎక్కువమంది ఉపాధి కోసం పొట్ట చేత బట్టుకుని హైదరాబాద్ కి వచ్చినవారు. ప్రభుత్వోద్యోగాల కోసం ఇక్కడి వసతి గృహాల్లో, లైబ్రరీల్లో ప్రిపేరవుతూ భ్రమల్లో కాలం వృధా చేసుకుంటున్నవారూ ఉన్నారు. తెలంగాణ ప్రజలంతా హైదరాబాద్ రావాల్సిన అవసరం లేకుండా, పట్టణీకరణకు దగ్గరలో అవకాశాలు లేవా? గ్రామాల మధ్య చిన్న పట్టణాలతో వారి జీవితం ఎంతో సౌకర్యవంతంగా ఉంటుంది, గ్రామాల్లో బతకటం ఏదో ఆదర్శం, అనివార్యం కాకుండా జీవన నాణ్యతలో భాగమవుతుంది. అక్కడ నాయకత్వం పెరిగి నాగరికత విస్తరిస్తుంది. ఇంత పెద్ద సంక్షోభం ఈ వార్తల్లో దాగి వుంది.

**రూ.11,000-12,000 కోట్లు ఖర్చు పెట్టినట్లు అంచనా**

కేరళలో స్థానిక ప్రభుత్వాల ఎన్నికలు ప్రజాస్వామ్యానికి, రాజకీయానికి అర్థం చెప్పేలా జరిగాయి. ఓటర్లు పార్టీలవారీగా చీలిపోయి ఉన్న రాష్ట్రం కేరళ. అయినా కూడా ప్రజా సమస్యలు పరిష్కరించకుంటే, సొంత పార్టీనైనా ఓడించి మంచి అభ్యర్థులను ఎన్నుకుంటామని నిరూపించారు. బీజేపీ అలాగే తిరువనంతపురం మునిసిపాలిటీని కైవశం చేసుకుంది. గ్రామాల్లో మరీ తీవ్రంగా ఉంటాయి ఓటర్ల ప్రశ్నలు. అభ్యర్థులను కూర్చోపెట్టి, వార్డులోని ప్రతి సమస్యా తెలియచేస్తారు. గతంలో హామీ ఇచ్చి చెయ్యని వారిని.. మీరు మా దగ్గరకు రానక్కర్లేదు అని మొహం మీదే చెప్పేస్తారు. సమస్యల్ని, పరిష్కారాల్ని నిర్దిష్టంగా చర్చించి, ఆ అభ్యర్థి మీద నమ్మకం కుదిరాకే ఓటు వేస్తారు. డబ్బు, మద్యం పాత్ర ఎంతో కొంత ఉండొచ్చుగానీ, అవేవీ చెప్పుకోదగిన స్థాయిలో కేరళలో కనిపించవు. బాగా చదువుకున్న యువత ప్రజాసేవ చేయటానికి అత్యుత్తమ మార్గంగా వార్డు, డివిజన్ ప్రతినిధులుగా పోటీ చేయటం సాధారణం. నాయకులు సమస్యల్ని ఆలకిస్తూ, క్రోడీకరిస్తూ, పరిష్కారం చేస్తూ ఎదగటానికే కాదు.. ప్రజలు ప్రజాస్వామ్యాన్ని, రాజకీయాన్ని నేర్చుకోవటానికి కూడా కేరళ స్థానిక ప్రభుత్వాల ఎన్నికలు ఎంతో ఉపయోగపడతాయి.

కేరళలో ఆ విధంగా పంచాయతీలను, మునిసిపాలిటీలను బలోపేతం చేస్తే.. మన తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలో ఏం చేశాం? ఎటువంటి అధికారాలు, నిధులు లేకుండా ఎమ్మెల్యే ఆదుపాజ్ఞలతో ఉండేవారిగా సర్పంచ్‌లను తయారుచేశాం. నిధులు, అధికారాల బదలాయింపు చర్చ జరగకుండా రిజర్వేషన్ల పెంపుపైనే చర్చంతా నడిచేలా చేశారు. ఆ రెండు లేకుండా కేవలం రిజర్వేషన్ల పెంపు వల్ల ఉత్సవ విగ్రహ పదవులు తప్ప




లాభం ఏమిటన్న ప్రశ్నను పట్టించుకోకుండా పోలో మంటూ అన్ని పార్టీలు, నేతలు, మీడియా, సమాజం నానాయాగీ చేశారు. చివరికి తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2047 పేరుతో ఈవెంట్ మేనేజ్ మెంట్ హడావుడి చేసి బీసీ రిజర్వేషన్ పెంపు హామీ అమలు ఆందోళనలను, సాధికారత విషయంలో చేదునిజాల్ని కూడా మరుగున పడేశారు. కేరళ పంచాయతీ ఎన్నికల్లో చట్టవిరుద్ధ ఖర్చు గురించిన సమాచారం పెద్దగా కనిపించని పరిస్థితి ఉంటే, తెలంగాణలో పంచాయతీ ఎన్నికలకు రూ.11,000-12,000 కోట్లు ఖర్చు పెట్టినట్లు అంచనా. చాలామంది అభ్యర్థులు రూ.1-2 కోట్ల రూపాయలు వెచ్చించినట్లు సమాచారం. కేరళ స్థానిక ప్రభుత్వాల సాధికారతతో, అక్కడి ఎన్నికల నిర్వహణతో, ఓటర్ల విధానాలు చర్చించిన తీరుతో పోలిస్తే.. తెలంగాణలో అత్యధిక పంచాయతీల్లో ఏ ఒక్కటీ లేవు. కేరళలోస్థానిక రాజకీయం ప్రజల స్వపరిపాలన, ఎన్నికలు ప్రజాసేవ కోసం జరిగితే.. మన వద్ద రాజకీయ ఆధిపత్యం, పెత్తనం కోసం, ఎమ్మెల్యే రాజ్యం కోసం, ముఖ్యమంత్రి పదవిని కాపాడుకోవటం కోసం జరిగాయి.

**వీటిని పరిష్కరించకుండా,**

**గెలుపోటముల లెక్కలు రాసుకుంటే, అదేమి ప్రజాస్వామ్యం?**

పరిష్కారాలు లేవా? ఉన్నాయి, ఆచరణసాధ్యంగా అందుబాటులో ఉన్నాయి. రాజకీయ నాయకులకు సంకల్పం, మనకు వాటి కోసం డిమాండ్ చేసే చైతన్యమే కావాలి. ఓట్ల కొనుగోలు అవసరం లేకుండా, సమర్థులు, ప్రజాసేవకులైన యువత సంస్కరణలు, చిన్న పంచాయతీలను విలీనం చేసి కేరళ తరహాలో కనీసం రూ.30,000-40,000 జనాభా ఉన్న గ్రామాలను పంచాయతీలుగా ఏర్పాటు చేయటం(అంటే ఇప్పుడు తెలంగాణలో ఉన్న 12,700కు పైగా పంచాయతీలు 1200-2000 సంఖ్యకు మారతాయి), కనీసం కేరళ తరహాలో స్థానిక ప్రభుత్వాలకు నిధుల్ని, అధికారాల్ని వికేంద్రీకరించి జవాబుదారీతనంతో పర్యవేక్షించటం, హైదరాబాద్‌కి నిస్సహాయ వలసలు అక్కర్లేకుండా స్థానికంగా ఉపాధి అవకాశాలకు గ్రా మాల మధ్య చిన్న పట్టణాలను పర్యావరణహిత సాంకేతికతలతో ఆర్థిక కేంద్రాలుగా అభివృద్ధి చేయటం, ఆస్తులు తాకట్టు పెట్టి మరీ ఎన్నికల్లో పోటీ చేసేంత అధికార పిచ్చి లేకుండా సామాజిక చైతన్య కార్యక్రమాలను నిర్వహించటం మొదలైనవి. ❖

# జుగాడ్ ఓటర్ల ఉద్యమం

ప్లాట్ నం: బి- 64, రోడ్ నం. 10, హుడా కాలనీ,
సరూర్‌నగర్, హైదరాబాద్ - 500 035
ఈమెయిల్: mpstexer@gmail.com



ఎం. పార్థసారథి
(ఫౌండర్ ప్రెసిడెంట్)

## Jugaad Bharat United Voters January 2026

Simplifying Democracy - Strengthening Unity among voters

**ఓటు మనది. పార్టీ మనది. డబ్బు మనది. అధికారం మనది.**
**పనిచేయని ప్రభుత్వాన్ని గద్దె దింపే అధికారం కూడా మన చేతుల్లోనే ఉంది!**
**అదే జుగాడ్ 50:50 రాజనీతి (Model Political System)**

**మనది సనాతన మత-ధర్మమా లేక అధునాతన మత-ధర్మమా అన్నది కాదు ముఖ్యం**
**హింసపూరిత ఉగ్రవాదమత-ధర్మప్రచారార్థం యుద్ధం జరిగితే**
**యావత్ ప్రపంచ జనావళికి "ఓం శాంతి" మంత్రం మాత్రం తథ్యం**

Proposed jugaad Votersµ party celebrates every year 25th January as Jugaad Voters peaceful-day (విశ్వశాంతి కోసం)

ధనమూలమిదం జగత్. ఎవ్వరికీ ఏదీ ఉచితంగారాదు అని మీకూ తెలుసు. నాకూ తెలుసు.కానీ మనం డాక్టర్ అంబేద్కర్ విరచిత రాజ్యాంగంలోని రహస్య ఓటింగ్ విధానాన్ని మనసా వాచా కర్మణా ఆచరించలేక పోతున్నాం! అన్ని పార్టీలూ ప్రజలే ప్రభువులు అంటున్నాయి! పురుషులైనా స్త్రీలైనా, నిజాయితీగల పౌరులుగా బాధ్యతతో సమాజంలో తమ కష్టార్జితంతో జీవిస్తున్న మంచి ఓటర్లే మంచి ప్రభువులు కాగలరు. అటువంటి మంచి ఓటర్లే జుగాడ్ ఓటర్లు!

జుగాడ్ ఓటర్ల ఉద్యమం ప్రారంభించిన కొత్తలో ఇదే జనబలం April, May, June 2017 సంచికలలో ప్రకటించిన విధంగా, ప్రస్తుత-రాజకీయం రెండు పరస్పర వ్యతిరేక భావజాలాల మధ్య జరిగే "తెలుపు-నలుపు చదరంగపు క్రీడ" వంటిది. ఆర్థికపరంగా (1) అవినీతి-రహిత-చట్టబద్ధ పాలనలో న్యాయపరమైన సంపాదనాపరుల తెల్లడబ్బు (2) అవినీతి-సహిత-చట్టబద్ధపాలనలో అధర్మపు సంపాదనాపరుల నల్లడబ్బు.

మనచే ఎన్నుకోబడిన కొంతమంది స్వార్థపూరిత పెద్దమనుషులు తమజీవితాన్ని మెరుగుపరుచుకుంటూ, అడ్డదారిలో డబ్బుసంపాదించడంతోపాటు, అధికారంలో పాతుకుపోతున్నారు తప్ప ప్రజల కష్టసుఖాలు పట్టించుకోలేకపోతున్నారు. ప్రస్తుత రాజకీయాలకు ప్రత్యామ్నాయంగా మంచి ఉత్సాహవంతులైన దమ్మున్న ఓటర్లే, అంతర్గతప్రజా స్వామ్యంతో ఈ ద్విపక్ష - పార్టీ ద్వారా రాజ్యాధికారం సాధించి సామాజిక న్యాయాన్ని సుపరిపాలన ద్వారా ప్రతిష్టించగలరు!

25 మంది జుగాడ్ ఓటర్లతో, డిసెంబర్ 2021 జనబలం మాసపత్రికలో ప్రతిపాదించిన వివరణాత్మక ద్విపక్ష పార్టీయొక్క మౌలిక-రాజ్యాంగ సూత్రాలు నేడు 50 మందికి నచ్చాయి! 25 నుండి 60 సంవత్సరముల వయస్సు కలిగిన యువతీ-యువకులందరికీ ఇదే మా ఆహ్వానం! Cooperation based on mutual trust (నమ్మకంపై ఆధారపడిన పరస్పర సహకారం) అనే ధ్యేయంతో మనకోసం, మనపిల్లల భవిష్యత్తు కోసం ఒక ప్రయత్నం చేద్దాం రండి!

# జుగాడ్ ఓటర్ల ఉద్యమం

ప్లాట్ నం: బి- 64, రోడ్ నం. 10, హుడా కాలనీ,
సరూర్‌నగర్, హైదరాబాద్ - 500 035
ఈమెయిల్: mpstexer@gmail.com



ఎం. పార్థసారథి
(ఫౌండర్ ప్రెసిడెంట్)

Jugaad పార్టీ కార్యకర్తగా నమోదు చేసుకోవాలంటే జీవితంలో ఒకేసారి తనకష్టార్జితమైన రూ.10,000/ విరాళమివ్వగలిగి ఉండాలి. అంత స్తోమతులేనివారు జుగాడ్ ఓటరుగా ఒకేసారి రూ. 5,000 కానీ రూ. 2,000 కానీ ఇచ్చి, మీవంతు బాధ్యత మీరు స్వీకరించండి. మిగతా విషయాలు అత్యంత పారదర్శకంగా మన నమ్మకస్తులైన కార్యకర్తలే చూసుకుంటారు. నిరుద్యోగ సమస్యలేని ప్రణాళిక, శాశ్వత దారిద్ర్య నిర్మూలన పథకాలు సిద్ధంగా ఉన్నాయి!

అత్యధిక జుగాడ్ ఓటర్ల సమాంతర ఆలోచనలతో మన కష్టార్జితమైన డబ్బుని ఖర్చుల నిమిత్తం (50: 25:15:10 నిష్పత్తిలో) మనమే సమకూర్చుకొని దేశ సంపదను సమగ్రంగా పరిరక్షించుకుంటూ వివరణాత్మక నిర్వచనాలతో “నమ్మకంపై ఆధారపడిన పరస్పర సహకారం” ప్రాతిపదికగా అవినీతిరహిత-ఉగ్రవాదరహిత, లొసుగులులేని చట్టబద్ధ-పాలనా వ్యవస్థ నిర్మాణమే జుగాడ్ ద్విపక్ష-పార్టీ ఏకైక లక్ష్యం! **Let's build a unique society with POLITICAL SOCIAL RESPONSIBILITY!**


**Contact: Jugaad Parthasarathy (9866416798) with (1) your MLA Constituency name (2) your name and gender (3) your age (4) your. Cell No:**

**జుగాడ్ భావి భారత భాగ్య విధాతలు :** (Rs/-10,000 donors)

**Sarvasri: (1) M.PARTHASARATHY (2) K.SUBRAHMANYAM (3) Col.P.V.RAMANA RAO (4) U.SUBBA RAO (5) Prof.C.K.MURTHY (6) SYED ANSARI (7) Smt. D.KASTURI (8) K.SRINIVAS MURTHY (Rajahmundry AP) (9) Dr. VAMSI RAJ (Kakinada AP) (10) Dr.G.ABBAIAH (Kakinada AP)(11)KOTIKALAPUDI TARAKESH**

**జుగాడ్ ఓటర్లు : Sarvasri (1) JVL. NARAYANA (Nellore AP) (2) S.D.BABU (Tamilnadu) (3) T.SURYANARAYANA (Vizag AP) (4)Smt.D. SUBHADRA (5) M.RANGA RAO (6) M.SAI SUBBARAO (7) Smt.D.JANAKI (8) J.VENKATA RAO (Vijayawada AP) (9) P.NARASIMHA RAO (10) SAI SURYANARAYANA (Karnataka) (11) MSS KUMAR (12) Dr.U.V.KRISHNA MURTHY (13) M.RAMA RAO (14) NANDAN SRIDHAR (15) Smt.K.RAJESWARI (16) Smt.K.LAKSHMI (17) Justice CHANDRAKUMAR (18) K. VASUDEVA RAO (19) NARAGONI (20) D.KONDALA RAO (21) M.S. Narayana Rao (22) Sriram (Amalapuram AP) (23) P.Sunil (Bhimavaram AP) (24) Amaranath (25) B.Poorna Kumar Das (26) KHS Sarma (27) Metta Ramarao (Vizag, AP) (28) IR Rao (29) S Madhavarao (30) DRK Rao (31) Smt.P Amulya (32) pallela Devaraju (33) YSN MURTY (Kakinada, AP) (34) DV KOTESWARA RAO (35) Santosh Eeraveni (36)Somanchi Radhakrishna 37) C.V.Ratnam 38) Smt Jayanti Vijaya**

advt




# జాతీయ యువజన దినోత్సవం..

# జెన్ జెడ్, జెన్ ఆల్ఫా



కొన్నేళ్ల క్రితం బీబీసీ ఒక అధ్యయనాన్ని వార్తల్లోకి తెచ్చింది. ఎరికా చెనోవెత్, మేరియా జె.స్టెఫాన్ 2011 ప్రాంతంలో రాసిన ఓ పుస్తక సారాంశమది. ఆ తర్వాత అది 2013లో ప్రసంగం రూపంలో వెలువడింది. 3.5% ప్రజల మద్దతు నిలకడగా ఏ ఉద్యమ విజయానికైనా అవసరమని, అలాంటి మద్దతు హింసాయుత ఉద్యమాల కంటే అహింసాయుత ఉద్యమాలకే ఎక్కువగా లభిస్తుందని అందులో వారు తెలిపారు. 1900 నుంచి 2006 సంవత్సరం వరకు వివిధ దేశాలలో సుమారు 300 ఉద్యమాలను పరిశీలించి వారు ఈ అంచనాకు వచ్చారు. ఈ కారణంగానే హింసా ఆందోళనల కంటే సహాయ నిరాకరణ, సత్యాగ్రహం వంటి అహింసా పోరాటాల సక్సెస్ రేటు రెట్టింపు స్థాయిలో ఉందని తేల్చారు.

చెనోవెత్, స్టెఫాన్ చెప్పిన గణాంకాలు, 3.5% ప్రజామద్దతు, అహింసాయుత పోరాటాలు ఎక్కువ విజయం సాధిస్తాయనే సూత్రీకరణపై బలమైన విమర్శలు కూడా వచ్చాయి. అంత శాతం ప్రజల మద్దతు లేకుండానే కొద్దిమంది బృందంతో విజయం సాధించిన అహింసాయుత పోరాటాల్ని, అదే విధంగా కొన్ని హింసాయుత పోరాటాల్నీ కొందరు విశ్లేషకులు ఉటంకించారు. ఒక ఉద్యమానికి ఎంతమంది మద్దతు ఉంటే సమూల మార్పు సాధ్యం అనే అంశంపై చెనోవెత్, మేరియా కంటే ముందు 1960-1980లలో థామస్ షెల్లింగ్, మార్క్ గ్రానోవెటర్ లాంటి వారు కొన్ని పరిశోధనలు చేశారు. వారు 5% దాకా క్రిటికల్ మాస్ ఉంటే మార్పు తేవచ్చని అభిప్రాయపడ్డారు. అదేవిధంగా 1896లో వచ్చిన పెరిటోస్ లా గురించి మనలో చాలా మందికి తెలుసు. ఏ అంశాన్నయినా ఓ 20% కదిలిస్తే, తదనుగుణంగా మిగతా 80 శాతాన్నీ ప్రభావితం చేయచ్చని ఆ సూత్రం సారాంశం. అయితే మిగిలిన వాటన్నిటికన్నా.. ఎక్కువ నమూనాల్ని, సుమారు శతాబ్దకాలంపాటు అధ్యయనం చేసి రూపొందించినది 3.5% సూత్రం.

మొత్తం ఓ 100 మిలియన్ల ప్రజలు ఉన్నారనుకుంటే, వారిలో 3.5 మిలియన్ల మంది మద్దతు ఉంటే, అహింసాయుత పోరాటం ద్వారా విజయం సాధించే అవకాశాలు ఉన్నాయని చెనోవెత్, స్టెఫాన్ సూత్రం పేర్కొంటుంది. హింసాయుత పోరాటాల్లో కంటే అహింసాయుత పోరాటాల్లో ఎక్కువమంది ప్రభావశీలురు చేరి మద్దతిచ్చే అవకాశంతో పాటు.. పోలీసులు, సైన్యం వంటి రాజ్యం చేతిలోని అణచివేత సాధనాలు కూడా వీరి వైపు మొగ్గే అవకాశ ముందని సూత్రీకరిస్తుంది. గత వందేళ్లలో హింసాయుత ఉద్యమాలు 26% విజయం సాధించగా, అహింసాయుత పోరాటాలు 53%పైగా విజయవంతమైనట్లు 3.5% రూల్ అధ్యయనంలో తేలింది. అయితే ఇదేదో గోల్డెన్ రూల్ అని వారు కూడా భరోసా ఇవ్వటం లేదు. సరైన లక్ష్యం, ప్రణాళిక, స్పష్టత గల నాయకత్వం ఉంటేనే ఇది సాధ్యమవుతుందని, ఇవి లేకుంటే 7-8% మద్దతున్నా విఫలమయ్యే అవకాశముందని వారు ఓ హెచ్చరికా చెబుతున్నారు. 3.5% సక్సెస్ రూల్ మీద 2020 లో 'జనబలం' కవర్ స్టోరీని ప్రచురించింది. ఈ అధ్యయనంలో గాంధీ అహింసాయుత, నైతిక పోరాటం కూడా భాగంగా ఉన్నా, దీనికి సంబంధించిన చర్చ మన దేశంలో పెద్దగా వినిపించలేదుగానీ, అమెరికాలో ఇప్పుడు ట్రంప్ 2.0 జమానాలో జరుగుతున్న 'నో కింగ్స్' ఆందోళనల సందర్భంగా ఈ సూత్రం మీద పలు రకాల చర్చలు జరుగుతున్నాయి. గాంధీని మన దేశంలో కొల్లాయి, కర్ర, కళ్ల జోడు, విగ్రహం అనే కోణంలోనే ఎక్కువమంది అర్థం చేసుకుంటే.. ఆయన తాత్విక చింతనను పాశ్చాత్యులే ఎక్కువగా అర్థం చేసుకున్నారనిపిస్తుంది.

**అదే బీబీసీ ఇప్పుడు భారతీయ యువతను రెచ్చగొట్టే ధోరణిలో..**

ఇదే 3.5% రూల్ వ్యాసాన్ని 2019లో తన 'ఫ్యూచర్' కాలమ్‌లో ప్రచురించిన బీబీసీ.. ఇటీవల బంగ్లాదేశ్, నేపాల్, ఫిలిప్పిన్స్, మడగాస్కర్ వంటి దేశాల్లో ప్రభుత్వాల్ని గంటల వ్యవధిలో గద్దె దించిన, ఇండొనేషియాలో తమ డిమాండ్లను సాధించుకున్న జెన్ జడ్ ఆందోళనలు ప్రపంచంలోనే అత్యధిక యువ జనాభా ఉన్న భారత్‌లో ఎందుకు సంభవించటం లేదు?.. అని యువతను రెచ్చగొట్టేరీతిలో ఒక వ్యాసాన్ని ప్రచురించింది. సుమారు 37 కోట్ల వరకు ఉన్న భారతీయ కొత్త తరం వీధుల్లోకి ఎందుకు రావటం లేదు? అని ఆ వ్యాసం రాసిన సౌతిక్ బిశ్వాస్, అంత్రిక్ష పథానియా ప్రశ్నించారు. భారత్‌లోని చాలామంది సీనియర్ జర్నలిస్టులు

బీబీసీ ధోరణికి అంతే ముతకగా తక్షణం నిరసించారు. ఆ రకమైన దెబ్బకి దెబ్బ ధోరణిని మనం ఆమోదించక లేకపోయినా.. బీబీసీ తన సంస్థాగత విలువలు, జర్నలిజం ప్రమాణాల్ని ఉల్లంఘించిందని మాత్రం చెప్పాల్సిందే.

నిర్భయ ఉదంతం సమయలో కూడా ఇదే రీతిలో భారత్ ప్రపంచ రేప్‌ల రాజధాని అని ఎటువంటి సాక్ష్యాధారాల్నీ పరిశీలించకుండా బీబీసీ దుమ్మెత్తిపోసింది. ఈవేళ మావోయిస్టులు సైతం తమ హింసాత్మక ఉద్యమాన్ని వీడి ఆయుధాల్ని ప్రభుత్వానికి స్వాధీనం చేసి భారత రాజ్యాంగం ప్రకారం ప్రజాప్రయోజనాలకు పోరాటాలు చేస్తామని చెబుతున్నారు. కొంతమంది నక్సల్స్ కుటుంబ సభ్యులు, బంధువులు కూడా లొంగిపోవాలని బహిరంగంగా విజ్ఞప్తి చేస్తున్నారు. ఇలాంటి సమయంలో ఇలా రెచ్చగొట్టే వ్యాసం రాయటం ఎలాంటి వృత్తి ధర్మం అనే ప్రశ్నను వారి విజ్ఞతకే వదిలేద్దాం. అయితే ఇందులోని అంశాలను, భారత్ పరిస్థితులను, ప్రధానంగా యువ జనాభా పాత్ర ఉండే 2047 లక్ష్యసాధన రీత్యానూ కొంత చర్చించటం అవసరం.

**సోషల్ మీడియా యుగంలో 3.5% సూత్రం**

సోషల్ మీడియా వ్యాప్తి పెద్దగా లేనప్పటి ఉద్యమాలకు సంబంధించి 2011లో విడుదలైన 3.5% రూల్ పుస్తకం ఉందనేది గమనార్హం. అయితే, తాము ఉద్యమాలను పరిగణలోకి తీసుకున్న 2006 సంవత్సరం తర్వాత వచ్చిన ప్రజాస్వామ్య ఆందోళనలను పరిశీలించినా, అహింసాయుత పోరాటాలే ఎక్కువ పైచేయి సాధిస్తున్నాయని చెనోవెత్ తాజాగా ఓ పాడ్ కాస్ట్‌లో వివరణ ఇచ్చారు. ఇటీవలి పరిణామాలు కూడా వీరి వాదనను సమర్థిస్తున్నాయి. ఉదాహరణకు, దక్షిణ కొరియాలో ఎమర్జెన్సీ విధించిన అధ్యక్షుడు యూన్ సుక్ యోల్ ఇలాంటి పరిస్థితుల్లోనే గంటల వ్యవధిలో ఆ ప్రకటన ఉపసంహరించుకోవాల్సి వచ్చింది. తమ చేతుల్లోని తుపాకుల్ని ప్రజలు లాక్కుంటున్నా సైనికులు మౌనం వహించారు. చివరికి అధ్యక్షుడు రాజీనామా చేసి జైలుకు వెళ్లాల్సి వచ్చింది. నేపాల్ లోనూ ఇలాంటి పరిస్థితిని కొంతమేర గమనించవచ్చు. అధికారంలో బలమైన నియంతృత్వ నాయకత్వం ఉంటే, 3.5% సూత్రం పనిచేయకపోవచ్చు. ఉన్నకొద్దీ మొగ్గ ప్రజాస్వామ్యం, అహింసా యుత పద్ధతుల వైపే సాగుతోంది కాబట్టి 3.5% సక్సెస్ ఫార్ములా పట్ల మనం ఎక్కువ ఆశావాదంతో వ్యవ హరించవచ్చు.

**వికేంద్రీకృతానికి బీబీసీ భాష్యం**

ఇక 'వై జెన్ జడ్ రైజింగ్? వై యంగ్ ఇండియన్స్ ఆర్ నాట్ టేకింగ్ టు ది స్ట్రీట్స్' అనే శీర్షికతో బీబీసీ రాసిన ఆ వ్యాసంలో కెళ్దాం. అందులో బీబీసీ జర్నలిస్టులు కొన్ని ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేశారు.

మన ప్రజాస్వామ్యం బలమైనదే, క్రియాశీలమైనదే అయినప్పటికీ.. ప్రపంచంలోనే అత్యంత కేంద్రీకృతమైనది అనటంలో

> **అధికారంలో బలమైన నియంతృత్వ నాయకత్వం ఉంటే, 3.5% సూత్రం పనిచేయకపోవచ్చు. ఉన్నకొద్దీ మొగ్గ ప్రజాస్వామ్యం, అహింసా యుత పద్ధతుల వైపే సాగుతోంది కాబట్టి 3.5% సక్సెస్ ఫార్ములా పట్ల మనం ఎక్కువ ఆశావాదంతో వ్యవహరించవచ్చు.**

సందేహం లేదు. పొరుగున ఉన్న చైనా నియంతృత్వ దేశమైనా 50 శాతానికిపైగా నిధుల్ని స్థానిక ప్రభుత్వాలకు బదిలీ చేస్తుంది. కానీ భారత్‌లో అది కేవలం 3%. ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్.డి.ఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకులు జేపీ చాలా రచనల్లో, వీడియోల్లో ఈ విషయాన్ని తెలియ చేశారు. స్థానిక ప్రభుత్వాల సాధికారతకు అవకాశాలు తృటిలో తప్పిపోవటం, తిరిగి ఏదోక రూపంలో ఆ మార్పు సాధించాల్సిన అవసరం గురించి చెబుతుంటారు. కానీ బీబీసీ వ్యాసం వికేంద్రీకరణకు కొత్త వ్యాఖ్యానం చెప్పింది.. ప్రజలు కులాలు, మతాలు, ప్రాంతాలు, భాషలుగా తమ ప్రత్యేకతను కాపాడుకోవటం వికేంద్రీకృతమట. ఈ వికేంద్రీకరణే జెన్ జడ్ విప్లవానికి అవరోధంగా మారిందట.

దీనివల్ల భారత్‌లో యువత ఆందోళనలు మూడు పాయ లుగా చీలిపోయి, వ్యవస్థను కదిలించటంలో బలహీన పడ్డాయని బీబీసీ కథనం వాదన.

“పట్టణ ప్రాంత యువత నగరాల్లోని మౌలిక వసతుల గురించి, అప్పుడప్పుడూ శాంతిభద్రతల గురించి ఆందోళన చేస్తుంటారు. తమిళనాడు వంటి చోట భాష గురించి జెన్ జడ్ ఆందోళనలు కనిపిస్తాయి. ఇవి దాటి జాతీయ స్థాయిలో ఆందోళనలు కనిపించవు. మహా అయితే జల్లికట్టు వంటి స్థానిక అంశాల గురించి కొన్ని రోజులపాటు ఆందోళనలు జరుగుతుంటాయి. ఏ ఆందోళన చేస్తే ఎక్కడ దేశద్రోహి అంటారోనన్న భయం విశ్వవిద్యాలయాల్లో వ్యాపించిందం టున్నారు. అందుకే ఢిల్లీ జే.ఎన్.యూ వంటి విద్యాసంస్థలు ఇప్పుడు నిశ్శబ్ద నిలయాలయ్యాయి” అని బీబీసీ పేర్కొంది.


ప్రతిపక్షాల పైనే, ఎంపిక చేసుకున్న రీతిలోనే అయినా అక్రమార్జనలపై ఈడీ దాడులు, మావోయిస్టు హింసాత్మక ఉద్యమంపై 'ఆపరేషన్ కగార్', అర్బన్ నక్సల్స్‌పై తీవ్ర చట్టాల ప్రయోగం, జమ్మూకశ్మీర్‌లో 370 ఆర్టికల్ రద్దు సహా ఏ అంశం మీదా ప్రభుత్వాన్ని గద్దె దింపే స్థాయి పోరాటాలు జెన్ జడ్ నుంచి జరగలేదన్నది వాస్తవం. ఇటీవల లధక్‌కు రాష్ట్ర ప్రతిపత్తి కల్పించాలని సోను వాంగ్ చుక్ చేసిన ఆందోళన కొంత హింసాత్మకంగా మారినా, చట్టం కఠినంగా

వ్యవహరించటంతో సద్దుమణిగింది. అన్నా హజారే లోక్ పాల్ ఆందోళన, నిర్భయ ఉదంతంలో నిరసనలు, వ్యవసాయ చట్టాల నేపథ్యంలో రైతులు చేసిన ఆందోళనలు కూడా ప్రభుత్వం చేయిదాటిపోలేదు. అయితే, ఇంత సంక్లిష్ట భిన్నత్వం ఉండటం భారత్‌లో అరాచక అంతర్యుద్ధాలు రాకుండా, వికేంద్రీకరణలా పనిచేస్తోందన్న భాష్యం విచిత్రంగా అనిపిస్తుంది. అదో బలహీనతగా బీబీసీ చిత్రించే ప్రయత్నం నిరుత్సాహం కలిగిస్తుంది. కాకపోతే, ఇందుకు సంబంధించి ఒక కోణాన్ని అంగీకరించాలి. ఇంతటి వైవి ధ్యం వల్లే అనివార్యంగా భారత్‌లో ప్రజాస్వామ్యాన్ని కొనసా గించటం ఎంత నిరంకుశ పాలకులకైనా తప్పటం లేదు. వారు ఒక పరిధి దాటకుండా ఈ సంక్లిష్ట భిన్నత్వం నిరో ధిస్తోంది.

ప్రజాస్వామ్యం అర్థమయ్యో, ఇప్పటి వరకూ ఉన్న అన్ని రాజకీయ పద్ధతుల్లోకీ ప్రజాస్వామ్యం మెరుగైనది కాబట్టో మనం ఆ రాజకీయ పద్ధతిని కొనసాగిస్తుండకపోవచ్చు. జనాభా, నాగరికత పరంగా మనతో పోల్చదగిన చైనాలో కూడా ఒకే భాష, ఒకే రకం మనుషులు. కానీ మన దేశంలో ఆ ఏకరూపం ఏ విషయం లోనూ కనిపించదు. అలాంటి దేశాన్ని ఏకం చేసి, ఏకత్వం అంటే ఏకరూపం కానక్కర్లేదు అని నిరూపించిన గాంధీ, పటేల్, అంబేద్కర్, ఇతర జాతీయోద్యమకాల నేతలకు, రాజ్యాంగ రచ యితలకు మనం ఎంతో రుణపడి ఉంటామని ఒప్పుకోవాలి. దీనికితోడు, ప్రజాస్వామ్యం సవ్యంగా పనిచేయటానికి, శాంతి భద్రతలు నియంత్రణలో ఉండటానికి అవసరమైన ఆర్థికాభివృద్ధి మన దేశంలో ఉంది. సాటి మనిషిని ఆదుకునే ధర్మనిరతి మన సంస్కృతిలో వేళ్లూనుకుని, ఎన్ని వైరుధ్యాలున్నా సమా జాన్ని సామరస్యంగా కలిపి ఉంచుతోంది. కాబట్టి, బీబీసీ వారు అక్కసు తోనే, ప్రమాణాలు పాటించకుండానే రాసినా..వారి విశ్లేషణలో కొంత అర్థాన్ని మనం అంగీకరించటానికి భేషజాలు అక్క ర్లేదు.

ఇదేసమయంలో, బీబీసీ తాజా కథనంలో మనకు కొన్ని హెచ్చరికలున్నాయని కూడా మనం ఒప్పుకోవాలి.

ఎన్ని రకాల ప్రజాస్వామిక అనివార్యతలు, బలాలు ఉన్నా.. చుట్టుపక్కల దేశాల్లో జెన్ జడ్ ఆందోళనలకు దారితీసిన పరిస్థితులు మన దేశంలోనూ పొంచి ఉన్నాయని విస్మరించ కూడదు. అవినీతి పుష్కలంగా ఉంది, బంధుప్రీతి ఉంది, కుల వివక్ష బహిరంగంగానో, అంతర్గతంగానో, అంతరంగం లోనో కొనసాగుతోంది. విధాన నిర్ణయాల్లో కోట్లాది సామాన్యుల ఆకాంక్షలు ప్రతిఫలించటం లేదు. ఎన్నికల మధ్యకాలంలో ప్రభుత్వం చేత ఒక పనిచేయించుకోవాలంటే పలుకుబడి ఉన్నవారు కూడా డస్సిపోతున్నారు. పోలీస్ స్టేషన్‌కి వెళ్లి ఫిర్యాదు చేయాలంటే 80% మందికి ఇప్పటికీ వణుకు. కోర్టుకెళ్లాలంటే ఎప్పటికి తెములుతుందో తెలియని నిర్వేదం.




పట్టణీకరణ అంటే రాష్ట్ర, దేశ రాజధానులకు వెళ్లటమే అనుకునే పరిస్థితి. యువతలో చదువుకు తగ్గ ఉద్యోగం దొరక్కపోవటం, దొరికినా అందుకునే శక్తిలేకపోవటం. ఇలాంటి మౌలిక సంక్షోభాలు మన దేశాన్ని పట్టిపీడిస్తున్నా పాలకులు చిత్తశుద్ధితో పట్టించుకోవటం లేదు. రైతుల ఆదాయాలకు గండికొట్టి ఉచిత ఆహారం, పైఖర్చులకు నగదు బదిలీ వంటి వాటితో నెట్టుకొస్తున్నారు తప్ప.. మౌలికంగా సమస్యల్ని పరిష్కరించటం లేదు. ఎంత ఎక్కువ చదువుకుంటే అంత ఎక్కువ నిరుద్యోగం ఉన్న దేశంగా భారత్ పేరుమోసింది. దేశ పట్ట భద్రుల్లో ఉద్యోగ నైపుణ్యాలున్నవారు 56.35%గా ఏఐసీటీఐ, సీఐఐ సహకారంతో వీబాక్స్ సంస్థ సర్వే ద్వారా రూపొందించిన భారత నైపుణ్యాల నివేదిక – 2026 పేర్కొం ది. ఇందులో హైదరాబాద్ 9వ స్థానంలో ఉంది. లక్నో మొదట ి స్థానంలో నిలిచింది. గణాంకాలు సరైనవే అను కుంటే.. 2022లో ఈ శాతం 46.20% అన్నదే కాస్త ఊరట. వీటిని సరిచేసుకోవటం 2047 వికసిత్ భారత్ లక్ష్యాన్ని చేరుకోవటానికి జెన్ జడ్ విషయంలో అవసరం. దీంతోపాటు.. అక్కడ్నుంచి ఆ ఫలితాలను అనుభవిం చటంతోపాటు, ఆ అభివృద్ధిని సుస్థిరంగా తమ తర్వాతి జెన్ బీటా తరానికి అందించాల్సిన బాధ్యత జెన్‌జడ్ అనంతర తరమైన, ఇప్పుడు పాఠశాలల్లో ఉన్న జెన్ ఆల్ఫా తరానిది.

జెన్ ఆల్ఫా తరంలోని వారంటే 2010 – 2024లో పుట్టిన వారు. వీరిలో అత్యధికులు ప్రస్తుతం పాఠశాల విద్యలో ఉన్నారు. స్కూళ్లలో చదువుతున్న జెన్ ఆల్ఫా సంఖ్య ప్రస్తుతం 25 కోట్ల పైచిలుకు ఉంటుందని అంచనా. వీరుకాక అనధికారిక ప్రీస్కూల్ దశలో కొందరు, డ్రాపౌట్లు ఇంకొందరు ఉంటారు.

ఈ అంశాలన్నిటినీ అలా ఉంచితే.. ప్రస్తుతం పనిచేసే వయ సున్నవారు, అంటే 15–64 సంవత్సరాల మధ్య ఉన్నవారు మన దేశంలో 90 కోట్ల పైగా ఉంటారని అంచనా. వీరిలో కాలేజీలు, ఉన్నత విద్యాసంస్థల్లో చదువుకుంటున్నవారు, తమ

సర్టిఫికెట్లకు తగిన ఉద్యోగం రాలేదని ఎదురు చూస్తున్నవారు, ప్రభుత్వోద్యోగం సాధించాలని వరుస ప్రయత్నాలు చేస్తున్నవారు, ఆరోగ్య సమస్యలున్నవారిని మినహాయిస్తే.. సుమారు 54 కోట్ల మంది నికరంగా పని చేస్తున్నారు. ఇందులో 3% ప్రభుత్వోద్యోగుల్ని, కొద్దిశాతం ప్రయివేటు ఉద్యోగుల్ని మినహాయిస్తే.. 80-90% మంది అసంఘటిత రంగంలోనే ఉన్నారు. అందులోనూ తక్కువ ఆదాయమిచ్చే వ్యవసాయ రంగంలో ఉన్నారు. అంటే, గ్రామీణ ప్రాంతాల్లో. వీరికి మొబైల్ ఫోన్, టీవీ, ప్రజారవాణా, సొంత మోటారు వాహనాలు వంటి సదుపాయాలున్నా.. నైపుణ్యాలు, మార్కెట్ అనుసంధానానికి అవసరమైన మౌలిక వసతులు తక్కువ. కార్మిక శక్తిలో మహిళల పాత్ర కొవిడ్ ఉధృతి కాలంలో కంటే కొంత మెరుగుపడినా, వీరిలో అత్యధికులూ వ్యవసాయంలోనే ఉన్నారు. ఈ 80-90% మందికి నాణ్యమైన, సంఘటిత రంగ ఉపాధి అవకాశాల్ని అందించటం ఓ పెనుసవాలుగా ఉంది. ఇక వీరిలో సుమారు 36 కోట్ల మంది 2047 నాటికి సీనియర్ సిటిజన్లు అవుతారు. ప్రస్తుత వైద్య సాంకేతికతల వల్ల వీరి ఆయుర్దాయం ఇంకా పెరుగుతుంది కాబట్టి.. ఏదోక పనిలో వీరు క్రియాశీలంగా ఉన్నా, పూర్తిస్థాయి ఉపాధిలో వీరిని భాగస్వాములుగా లెక్కించలేం. వీరిని మినహాయించినా, పనిచేసే వయసులో ఉన్న మిగిలిన జనాభా భారత్‌లో 2047 నాటికి 100 కోట్లు ఉంటుందని అంచనా. వీరిలో కీలకమైనవారు ప్రస్తుతం స్కూళ్లలో చదువుతున్న 25 కోట్లు ప్లస్ సంఖ్యలోని జెన్ ఆల్ఫా

వీరు 2030-35 నుండి మొదలుపెట్టి, 2047, ఆ తర్వాతి దశాబ్దాల్లో జెన్ బీటాతో కలిసి ఉత్పాదక శక్తులుగా భారత్ ను అభివృద్ధి చెందిన దేశంగా కొనసాగించాలంటే.. రెండు కోణాల్లో ఈవేళ మనం సర్వశక్తులూ ఒడ్డాలి.

మొదటిది, మిలీనియల్, జెన్ జెడ్‌లకు నాణ్యమైన ఉపాధి అవకాశాలను, వారి వినూత్న ఆలోచనలు, సామర్థ్యాలు ఆచరణలోకి వచ్చేలా రాజకీయ నాయకత్వంలో అవకాశాలను అందించటం.

2047 వరకు భారత్ ఏటా 8-10% వృద్ధిరేటును నిరంతరాయంగా వీరి ద్వారా సాధించాలి. ఇందుకు గ్రామాలు-పట్టణాల మధ్య అంతరాన్ని తగ్గించటం, నైపుణ్యాలను పెంచటం, ఉపాధి అవకాశాలను పెంచటం, కార్మిక కోడ్‌లను సమర్థంగా అమలు చేయటం, వ్యవసాయం నుండి వీలున్నంత ఎక్కువమందిని తయారీరంగానికి మళ్లించటం కీలకం. దీనికి ఒకటే మెరుగైన పరిష్కారం- గ్రామాల మధ్య నూతన, పర్యావరణహిత ఆర్థిక రంగ కేంద్రాలుగా చిన్న పట్టణాలను సాంకేతికతతో అభివృద్ధి చేయటం. అక్కడే వీరి ఉత్పాదకత పెరగటానికి వీలుగా ప్రతి కుటుంబానికీ మంచి ప్రమాణాల ఆరోగ్యాన్ని అందించటం. అదేవిధంగా, ప్రజాస్వామ్యానికి పాఠశాలల్లాంటి స్థానిక ప్రభుత్వాలకు నిధుల్ని, అధికారాల్ని వీలైనంత ఎక్కువ బదిలీ చేయటం, పన్నుల ఆదాయంతో స్వావలంబన సాధించుకునేలా చేయటం, ప్రతి రూపాయికీ జవాబుదారీగా ఉండే ఏర్పాట్లు చేయటం, వార్డు స్థాయి వరకూ ప్రజలు ఎన్నుకున్న కమిటీలను ఏర్పాటు చేసి స్థానిక ప్రజాప్రతినిధి (కార్పొరేటర్ లేదా కౌన్సిలర్) నేతృత్వంలో పనిచేసే పద్ధతి అమలు చేయటం, తద్వారా ఎన్నికల మధ్యకాలంలోనూ ఎక్కడికక్కడ ప్రజల్ని పాలనలో, నిర్ణయాధికారంలో భాగస్వాముల్ని చేయటం. ఈ ప్రయత్నం అంత సంతృప్తికరంగా జరగటం లేదు. ట్రయల్ అండ్ ఎర్రర్ రీతిలో వ్యవహరించటం, పట్టణీకరణ అంటే మహా నగరా లనే ఇంకా విస్తరించటం, అక్కడికే అందరూ వలసలు పోవటం అనే కాన్సెప్ట్ నుండి ఇంకా ప్రభుత్వాలు, ఎలీట్ వర్గాలు, పౌర ఆలోచనా పరుల్లో ఎక్కువమంది బయట పడలేదు.

**నాయకత్వ శిక్షణను స్థానిక స్థాయి వరకూ విస్తరించాలి**

ఇక రాజకీయ నాయకత్వ బాధ్యతలకు సంబంధించి కొత్త తరాన్ని తీసుకురావటానికి ప్రభుత్వం తరపున, కొన్ని పార్టీల తరపున చేస్తున్న ప్రయత్నాలు ఇంకా ముమ్మరం కావాలి. యువ టతకు, రాబోయేకాలంలో చట్టసభల్లో 33% రిజర్వేషన్లను సద్వినియోగం గావించుకోవటానికి ఇప్పటినుంచే అమ్మాయిలకు నాయకత్వ శిక్షణనివ్వటానికి జాతీయ యువ జన దినోత్సవం రోజు మాత్రమే ప్రత్యేకించి కార్యక్రమాలు చేస్తున్నారు. అది కూడా కేంద్రీకృతంగా జరుగుతోంది. అలా కాకుండా, రాష్ట, జిల్లా, స్థానిక స్థాయి వరకూ ఇదే రీతిలో యువజన దినోత్సవం జరపాలి. అసహనానికి, ఆదర్శానికి మధ్య తేడాని తెలియచెప్పాలి. నాయకత్వ లక్షణాలను, ప్రజా సేవా భావాన్ని ప్రదర్శించినవారికి ఆ తర్వాతి కాలంలో కూడా శిక్షణనిస్తూ కెరీర్ తోపాటు, పాలనలో, రాజకీయంలో భాగస్వాములవటాన్ని సంధానించుకునేలా అవకాశాల్ని కల్పించాలి. స్థానిక ప్రభుత్వాలు బలంగా ఉంటే, అసలీ సమస్యే తలెత్తేది కాదు. కానీ ఇప్పుడు ప్రత్యేకంగా, ప్రణాళి కాబద్ధంగా పనిగట్టుకుని ప్రయత్నం చేయాలి.

డబ్బు ఖర్చు, అందులోనూ చట్టవిరుద్ధ డబ్బు ఖర్చు అవసరం లేకుండా మన దేశ పరిస్థితులకనుగుణంగా దామాషా పద్ధతి వంటి ఎన్నికల సంస్కరణల్ని తీసుకురావాలి. పార్టీల్లో సామర్థ్యానికనుగుణంగా ఎదిగేందుకు ప్రజాస్వామ్యబద్ధ విధానాలనూ 'చట్టబద్ధంగా' ఏర్పాటు చేయాలి. సామాజిక సేవ పట్ల మొగ్గు చూపినవారికి ఎక్కువ ప్రోత్సాహం అందించాలి. సామాజిక సంస్కరణోద్యమాలకు ప్రభుత్వం మద్దతునివ్వాలి. సేవ, సంక్షేమ కార్యక్రమాల్లో స్వచ్ఛంద సేవలు అందించిన యువతకు విద్య, ఉపాధి నుండి పెన్షన్ వరకు కొన్ని అదనపు పాయింట్ల ప్రాధాన్యతనివ్వాలి. ఈ ఏర్పాట్లు రాష్ట్రాల్లో, జాతీయ స్థాయిలోనూ ఆర్థిక క్రమశిక్షణకు కూడా అవకాశాల్ని కల్పిస్తాయి పెట్టుబడులు, ఉపాధి అవకాశాల్ని పెంచుతాయి. తాత్కాలిక సంక్షేమ పథకాలు,

అభివృద్ధి మధ్య సమతూకంతో 2047లో వికసిత్ భారత్ సాధించటానికి కావలసిన వృద్ధి రేటును సమ్మిళితంగా అందిస్తాయి.

**చదువు అప్పటికప్పుడు రాదు**

రెండవది, జెన్ ఆల్ఫాను కూడా ఇదే సమయంలో సన్నద్ధం చేయటానికి పాఠశాల విద్యను బాగు చేయాలి. 2047 గురించి ఆలోచించటమే గొప్ప, ఆ తర్వాత సంగతి అప్పుడు చూసుకోవచ్చు అనుకోవటానికి వీల్లేదు. ఎందుకంటే, ఆ తర్వాతి తరానికి పునాది కూడా ఇప్పటి నుంచే ఉండాలి. ఆ పునాది కొరవడబట్టే.. 2047 లక్ష్యం మనకు ఈవేళ పెద్ద సవాలుగా మారింది. కాబట్టి ప్రీస్కూల్, స్కూల్ స్థాయిలో ఈవేళున్న 25 కోట్ల మంది పైచిలుకు జెన్ ఆల్ఫా పిల్లల్ని తీర్చిదిద్దటం కూడా ఈతరం బాధ్యతే. వారంతా ఒక దేశమైతే ప్రపంచంలో పదో స్థానంలో ఉంటారు. కానీ జెన్ ఆల్ఫా స్కూలు విద్య పట్ల మన కృషి ఆర్థికాభివృద్ధిలో కన్నా ఘోరంగా ఉంది.

**క్లాస్ రూమ్ పరిజ్ఞానం లేని,**
**మార్కెట్ కి పనికిరాని చదువులు**

ప్రాథమిక స్థాయి నుండి స్కూల్‌లో ఏ తరగతిని తీసుకున్నా, 90 శాతానికిపైగా పాస్ అవుతున్నారు. చాలామందికి 80 శాతానికిపైగా మార్కులు వస్తున్నాయి. కొందరికి 98% దాకా వస్తున్నాయి. కానీ అసర్ వంటి ప్రయివేటు సర్వేలతోపాటు ప్రభుత్వం వారు చేస్తున్న రకరకాల సర్వేల్లో కూడా ఆ తరగతికి సంబంధించిన పరిజ్ఞానం కేవలం 10-15 శాతం మందికే ఉంటోంది. అంటే, మిగతా 70-80 శాతం మంది ఎలా పాసవుతున్నారు, ఫస్ట్ క్లాస్ మార్కుల్ని ఏ రకంగా సాధిస్తున్నారు? పరీక్షలు పెడుతున్నదీ ప్రభుత్వంవారే, సర్వే చేస్తున్నదీ ప్రభుత్వం వారే. అయినా ఇంత అంతరం ఎందుకంటే, అదొక అడగకూడని మిస్టరీ. 5వ తరగతి పిల్లవాడు 1వ తరగతి పాఠ్యపుస్తకంలో ఒక పేరా చదవలేడు అనే పరిస్థితి 50శాతం మంది విద్యార్థుల దాకా ఉంది. అదేవిధంగా 8వ తరగతి పిల్లల్లో అత్యధికులు ఏక అంకె భాగాహారం చేయలేరు. డబ్బు ఖర్చు చేయటం తప్ప, పిల్లల అభ్యసన సామర్థ్యాల్ని కనీసం తరగతిస్థాయికి పెంచటానికి ఏం చేయాలో తెలియక, తెలుసుకోవాలనే సంకల్పంలేక ప్రభుత్వాలు కొట్టుమిట్టాడుతున్నాయి. చదువంటే ఏమిటో తెలియకపోవటం వల్ల తల్లిదండ్రులు ప్రభు త్వానికి పన్నులు కట్టటంతోపాటు ప్రయివేటు విద్యా సంస్థలకు భారీ ఫీజులు కట్టి మరీ చదువొస్తుందనే ఆశతో పంపుతున్నారు. అక్కడా పెద్దగా మెరుగైన పరిస్థితి లేదు. అయి తే 21వ శతాబ్దం 3.0లో తమ పాత్రను జెన్ ఆల్ఫా సవ్యంగా పోషించాలంటే, అభ్యసన సామర్థ్యాలు మెరుగవటం మాత్రమే చాలవని నిపుణులు హెచ్చరిస్తున్నారు. నిజ జీవితంలో, మార్కెట్‌లో సమస్యల్ని ఆ పరిజ్ఞానంతో పరిష్క రించగలిగేలా అన్వయించగలిగి ఉండాలని స్పష్టం చేస్తు న్నారు.

ఉదాహరణకు, 7వ తరగతిలో పిల్లవాడు స్థానిక మార్కెట్ లో డిమాండ్-సప్లయ్ ని బట్టి ఏ వస్తువు ధర ఎంత పెరిగే, తగ్గే అవకాశముందో చెప్పగలగాలి. అది కూరగాయలు కావచ్చు, కిరాణా సరకు కావచ్చు. 8వ తరగతి బాలిక తన స్కూలు వద్ద తాగునీటి నాణ్యతను పరీక్షించి తెలుసుకోగలిగి ఉండాలి. ఆ నీరు బాగాలేకపోతే, ఏం చేయాలో ఆ పరిష్కారాలకు చుట్టూ ఉన్నవారిని ఒప్పించగలగాలి. 9వ తరగతి పిల్లవాడు ప్రజాస్వామ్యం, స్థానిక సమస్యల పరిష్కారంపై రాజ్యాం గబద్ధంగా స్పష్టతతో రాయగలగాలి. చరిత్ర, పౌర శాస్త్రం, భాషను ఉపయోగించి వినూత్న పరిష్కార ఆలో చనలను చెప్పగలగాలి.

ఈ క్రమంలో ఆయా తరగతుల విద్యార్థులు మార్కెట్‌లో వర్తకులను ఇంటర్వ్యూలు చేయటం, ధరల్ని లెక్కించటం, రాయితీ విలువను తగ్గించి ఎంత డబ్బు చెల్లించాలో చెప్పటం, వార్తలు రూపొందించటం మొదలైనవన్నీ చేయ గలగాలి. కానీ క్లాస్ రూమ్ పరిజ్ఞానమే అగమ్యంగా ఉంటే, ఇక జీవితంలో ఆ విషయ జ్ఞానాన్ని ఏ మేరకు అన్వయించగలరు? ఎంతమంది అన్వయించగలరు? 2047 నాటి పోటీని ఎలా తట్టుకోగలరు?

**తరగతి గదినే ప్రపంచంగా మార్చాలి**

జెన్ ఆల్ఫా పిల్లల్లో సగం మంది గ్రామాల్లో చదువుతున్నారు. వీరి తల్లిదండ్రుల చదువులు, వీరికి ప్రపంచస్థాయి విద్యనం దించే బోధనావకాశాలు ఏ మేరకు ఉంటాయో ప్రత్యేకించి చెప్పనక్కర్లేదు. కాబట్టి జెన్ జెడ్‌కి ఉపాధి అవకాశాలను, నాయకత్వ శిక్షణను అందించేందుకు మాత్రమే కాకుండా.. జెన్ ఆల్ఫాకి కనీసం 1 నుండి 12వ తరగతి వరకు నాణ్యమైన విద్యను, తరగతి గదినే ప్రపంచంగా మార్చి చదువు చెప్పగలిగే పాఠశాల వ్యవస్థను అందించేందుకు విద్య, ఆరోగ్యం వంటి మౌలికాంశాలకు బాధ్యత వహించే స్థానిక సాధికారత గల చిన్న పట్టణాలను గ్రామాల మధ్య అభివృద్ధి చేయటం అవసరం. సాంకేతికత, పట్టణీకరణ ప్రభావం పిల్లల మానసిక పరిస్థితిపై ప్రతికూల ప్రభావం చూపకుండా, ఏఐ చూసి సమాధానాలు కాపీ కొట్టకుండా, సానుకూల అవకాశాలుగా మార్చుకోగలిగేందుకు అవసరమైన సామాజిక, ఆర్థిక, పాలనా, రాజకీయ, పౌరసత్వ అవగాహనను పెంపొందించే అంశాలను కూడా రోజువారీ చదువులో భాగం చేయాలి. ఆ రకంగా సామర్థ్యాల్ని పరీక్షించే ఏర్పాట్లు ఉండేలా పరీక్షల విధానాన్ని సమగ్రంగా, సృజనాత్మకంగా మార్చాలి.

కాబట్టి, జాతీయ యువజన దినోత్సవం 2026 నుండి ప్రస్తుత యువత గురించే కాకుండా.. ఇప్పుడు పాఠశాలల్లో చదువుతున్న పిల్లల్ని కూడా పరిగణలోకి తీసుకుని ప్రణాళికలు, కార్యక్రమాలు రూపొందించటం అవసరం.

❖

### 'హెచ్.ఎం.డి.ఏ మాస్టర్ ప్లాన్ - రైతుల సమస్యలు - హైదరాబాద్ విస్తరణ'పై

# నిపుణుల బృందాన్ని ఏర్పాటు చేద్దాం: జేపీ

హెచ్.ఎం.డి.ఏ (హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్ మెంట్ అథారిటీ) మాస్టర్ ప్లాన్‌లో భూ సేకరణ, వినియోగం, రైతుల సమస్యలపై సోమాజీగూడ ప్రెస్‌క్లబ్ లో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఇందులో ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్.డి.ఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకులు డాక్టర్ జయప్రకాష్ నారాయణ్, ఎంపీ కొండా విశ్వేశ్వరరెడ్డి, మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, మాజీ ఎంపీ డాక్టర్ బూర నర్సయ్య గౌడ్, ఆదర్శ రైతు పద్మశ్రీ చింతల వెంకట్‌రెడ్డి, మాజీ సర్పంచ్ డాక్టర్ ఎస్. మల్లారెడ్డి, మాజీ ఎమ్మెల్యే కె.ఎస్ రత్నం, విశ్రాంత ఐఏఎస్ గోనెల, ఫ్యూచరిస్టిక్ సిటీస్ వ్యవస్థాపకురాలు కరుణా గోపాల్, హెచ్.ఎం.డి.ఏ పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన రైతులు పాల్గొన్నారు. రైతులు, హైదరాబాద్ ప్రజలు, ప్రభుత్వ పాలనకు సంబంధించి కీలక పరిష్కారాలతో డాక్టర్ జేపీ ప్రసంగంలోని కొన్ని ముఖ్యాంశాలు:

'ప్రపంచంలో ఎక్కడా కూడా సాంప్రదాయంగా ప్రజలకున్న హక్కుల్ని తొలగించే అధికారం (ఈజ్ మెంట్ రైట్స్) ప్రభుత్వాలకు లేదు. ఒక రోడ్డు కావచ్చు, యాక్సెస్ కావచ్చు, మరోటి కావచ్చు. చట్టం స్పష్టంగా ఆ అధికారాన్నిచ్చింది. మీ జిల్లా కలెక్టర్ గానీ, జేసీ గానీ, ఆర్డీవో గానీ చట్టబద్ధంగా అందుకు చర్యలు తీసుకోవచ్చు. సి.ఆర్.పి.సి, కొత్త పేరుతో వచ్చిన స్మృతులు వగైరాల్లో ఆ నిబంధనలున్నాయి. వాటి కింద ఒక రోడ్డును ఆపే హక్కు ఎవరికీ లేదు. ప్రభుత్వానికి సైతం లేదు. అలాగే నీరు మళ్లించేది ఆపే హక్కు ఎవరికీ లేదు. మన అధికార యంత్రాంగమంతా పైవాడికి జీహుజూర్ అనటమే తప్ప, చట్టాన్ని ఉపయోగించటం లేదు. బ్రిటిష్ కాలం నుండి వస్తున్న , ఇప్పుడున్న చట్టం సరిపోతుంది.

మన రాజకీయం, పరిపాలన, లంచాలు మొత్తం భూమి చుట్టూ తిరుగుతున్నాయి. రెండోది, ఈ భూముల విషయంలో కోల్పోయేవాడు – నష్టపోయేవాడు ఒకడు, బాగా లాభపడేవాడు మరొకడు. పరాజితులు, విజేతలు. నగరం పెరగొద్దని మనం అనటం లేదు. అలా అంటే, రేపొద్దున అంతా మనల్ని అభివృద్ధి నిరోధకులంటారు. మేం హైదరాబాద్ అభివృద్ధి కోసం బాటలు వేస్తుంటే, వీళ్లంతా అపటానికి ప్లాన్ చేస్తున్నారు అని నిందలేస్తారు. కానీ, అభివృద్ధి వద్దు అని మనం అనటం లేదు. అభివృద్ధి పేరుతో కొందరు నష్టపోయేవారిని, కొందరు లాభపడేవారిని



చేయటం అధర్మం అంటున్నాం. ఇద్దరికీ న్యాయం చేయటం ఎలా అని ఆలోచించకపోతే, అంతకంటే దుర్మార్గం లేదు.

మనకు తెలియక వ్యవసాయ భూముల్ని అమ్ముకునేటప్పుడు బ్లాక్ లో డబ్బు తీసుకుంటుంటాం. కానీ ఆ అవసరం లేదు. వ్యవ సాయ భూముల్ని ఎంత రేటుకి అమ్ముకున్నా ట్యాక్స్ లేదు. వ్యవసాయేతర భూమి అయితే, పట్టణాల్లో ఉన్న భూమికి క్యాపిటల్ గెయిన్స్ పన్ను అని ఉంటుంది. అది తెలియక రూ.10 లక్షలు అదనంగా వస్తుందని లెక్కలు చూపని క్యాష్ రూపంలో అమ్ముకుంటున్నాం. రికార్డులలో తక్కువగా ఉంది కాబట్టి, భూసేకరణ చేస్తే.. ప్రభుత్వం లోనివారు దాన్నే చూపెట్టి ఆ లెక్క ప్రకారమే పరిహారం ఇస్తున్నారు. ఇలా రకరకాల సమస్యలు న్నాయి. ఈ నేపథ్యంలో, నేను కొన్ని నిర్దిష్ట సూచనలు చేస్తు న్నాను. ఆలోచించండి ఏం చేద్దామో. మనమంతా కూర్చుని ఒక ప్రయత్నం చేద్దాం.

అభివృద్ధికి మనం వ్యతిరేకం కాదు. అయితే, భూమిని మార్చి ఏమి చేసినా కూడా పారదర్శకంగా ఉండాలి. ఇవాళ ఆ పారదర్శకత లేదు. ఎవడి దగ్గరో డబ్బులు తీసుకుని వాడికి జోన్ మార్చేస్తారు. మనందరికీ తెలుసు. బెంగళూరు నగరమంతా, అక్కడి రాజకీయమంతా ఇదే. మన రాష్ట్రమనే కాదు. మహానగరాలు ఎక్కడున్నా కూడా అభివృద్ధి జరుగుతోందంటే, ఇదే తరహా. బెంగళూరు రాజకీయం మొత్తం జోన్లు, మాస్టర్ ప్లాన్ మార్చటమే. పారదర్శకత లేదు. రెండోది, ధర్మం లేదు. నష్టపోయేవారు రైతులు. లాభపడేవారు ఎక్కడి నుంచో వచ్చి వేలకోట్లు పెట్టుబడి పెట్టే డబ్బులున్నవాడు. కాబట్టి మనకు ఆ పారదర్శకత కావాలి, ధర్మంగా, న్యాయంగా ఉండాలి. ఆచరణ సాధ్యం కావాలి. కొన్ని మనం ఇప్పుడు చెప్పినా జరిగే పనులు కాదు. వాటిని




దీర్ఘకాలంలో చేయాలి. ఇప్పుడు ఏం చేయాలనే దాని వరకు కొన్ని అంశాల గురించి నిర్దిష్టంగా ఆలోచిద్దాం. నాకేమీ రియల్ ఎస్టేట్ గొడవలు తెలియవు. నాకు ఇక్కడెక్కడా మీరు చెప్పే ప్రాంతంలో ఒక్క గజం భూమి కూడా లేదు. కాబట్టి నాకు వ్యక్తిగతంగా దీంట్లో ఏమీ లేదు.

**జోనింగ్, భూ సేకరణ, రుణ సదుపాయం**

ఆ దృష్ట్యా మొట్టమొదటిది. జోనింగ్ విషయం ఏమి చేయాలి? ఒక మాస్టర్ ప్లాన్ ఏర్పాటు చేశారు. మీకు గుర్తుండి వుంటుంది, మొన్ననే పారిశ్రామికవాడల్లో కొన్ని వేల ఎకరాలను వారి దగ్గర్నుంచి కొంత డబ్బు తీసుకుని జోనింగ్ మార్చేస్తామన్నారు. దాన్లో ఏమన్నారూ – మల్టీ పర్పస్ ల్యాండ్ యూజ్ అన్నారు. మీరు అయిదారువేల ఎకరాలకు ఆ పని చేసినప్పుడు– ఒక్కొక్క ఇండస్ట్రియల్ ఎస్టేట్ 20, 50 ఎకరాలు కూడా ఉన్నాయి, పెద్దది 2000 ఎకరాల దాకా ఉంది, ఎక్కువశాతం 50–100 ఎకరాల్లో ఉన్నాయి– అలాంటప్పుడు అదే విధానాన్ని గ్రామాల్లో ఎందుకు చేయలేరు? ఒక గ్రామానికి 1000–2000 ఎకరాలున్నాయి. ఈమధ్య నోటిఫై చేసిన హైదరాబాద్‌ను కలుపుకుంటే విస్తీర్ణం 7300 చదరపు కిలోమీటర్లు. కొత్తగా చేర్చినవి ప్రస్తుతానికి వదిలేసినా 5300 చ.కిమీ. అంటే దాదాపు 13 లక్షల ఎకరాలు. అందులో 1000–2000 గ్రామాలున్నాయి. గ్రామానికున్న 1200 ఎకరాలను ఒక పూల్‌గా భావించి, దాన్లో కావాలంటే జోనింగ్ 10–20% పెట్టండి. రైతులందరినీ పూల్ చేసు కోమనండి. అంతేగానీ ఈ ఏరియా అంతా ఒక జోనులో పెట్టే శాం, మీరేం చేయటానికి వీల్లేదని ఇక్కడి రైతుల్ని అనటం, మరో ఏరియాలో మీ ఇష్టమొచ్చినట్లు కట్టుకోవచ్చు అని అక్కడి భూయాజమానులకు చెప్పటం.. అదేం పరిపాలన? మీరే గదా మొన్న చేసింది పారిశ్రామిక వాడల్లో మల్టీ పర్పస్ జోన్లు అని. మరి అక్కడ చేసింది ఇక్కడెందుకు వర్తించదు? ఇది సులభమైన పరిష్కారం. ప్రభుత్వం కూడా – గ్రీన్ బెల్ట్ వద్దా, రోడ్లు వద్దా? అని వాదిస్తుంది. మనల్ని అభివృద్ధి నిరోధకులని బ్రాండ్ వేస్తారు. కాబట్టి, పారిశ్రామికవాడల్లోలా ఇక్కడ కూడా బహుళ ప్రయోజనకర భూ వినియోగంతో జోనింగ్ ఏర్పాటు చేయాలి. దీనివల్ల ప్రభుత్వానికి, నగరాభివృద్ధికీ ఇబ్బంది ఉండదు, మనందరికీ న్యాయం జరుగుతుంది. కొంతమంది ఖరీదైనవాళ్లు, పలుకుబడి ఉన్నవాళ్లు, లంచాలిచ్చినవాళ్లు లాభపడటం కాకుండా– ఈ ఏర్పాటు వల్ల నగరం అభివృద్ధి ఫలాలు రైతులు, ఈ ప్రాంతంలో ఉంటున్న అందరికీ వర్తిస్తాయి. ఆలోచించండి.

రెండోది, భూసేకరణ ప్రస్తావన... సాగునీటి ప్రాజెక్టుల కోసం భూసేకరణ అంటే అది చాలా సంక్లిష్టం. ఎందుకంటే, భూమి కోల్పోవటం అనివార్యం. మనమేం చేయలేం. భూమి కోల్పోయిన వాడికి లాభం లేదు, వేరేవాడు లాభపడతాడు. దాని సంగతి తర్వాత చూద్దాం. కానీ పట్టణీకరణ, ఇలాంటి భూసేకరణ సందర్భంలో నా ప్రతిపాదన – ఒక ఎకరం భూమికి రెండు ఎకరాలు సేకరించండి. సేకరించి, ఆ ప్రాజెక్టుకి ఎంతకావాలో అంత భూమి ఇచ్చేశాక, మిగిలిన సగం భూమి ఆ భూమిని కోల్పోయినవారికి ఇచ్చేద్దాం. ఎకరం పోతే, అరెకరం ఇవ్వాలి. 'ఎయిమ్స్' వస్తుందనేసరికి చుట్టుపక్కల భూముల విలువలు అమాంతం పెరిగినట్లు క్రమంగా ప్రాజెక్టు వల్ల భూమి విలువ పెరుగుతుంది. కనీసం కొంతభూమి పోవటం అనివార్యం. లేకుంటే అభివృద్ధి సాధ్యం కాదు. కానీ పోయినవాడు కన్నీరు కారుస్తుంటే, రోడ్డు పక్కన మిగిలినవాడి భూములు కోట్లు అయిపోతున్నాయి. ఎకరాకి రెండెకరాలు, వంద ఎకరాలకు రెండొందల ఎకరాలు సేకరించి, అందులో సగం భూయజమానులకే ఇచ్చేస్తే భూములిచ్చినవారికీ లాభం కనిపిస్తుంది. ఇది చాలా హేతుబద్ధమైనది. పెద్ద కష్టమైనదేమీ లేదు. దోచేసు కోవాలి, లే అవుట్లను, ఎలైన్ మెంట్లను మార్చేయాలి అను కోకపోతే.. ఇది పూర్తిగా సాధ్యం. నిజంగా ప్రజలకు న్యాయం చేయాలి, అభివృద్ధి జరగాలి అని మనసుంటే, నాకు ఏ రకమైన సమస్యా ఈ పరిష్కారం అమలులో కనిపించటం లేదు.

**ఐడీపీఎల్, ఐడీఎల్ వంటి సంస్థల భూములు**

ఇది నగరం అభివృద్ధితో ముడిపడిన అంశం కాబట్టి, కొంత విషయాన్ని విస్తరిస్తున్నాను. ఐడీపీఎల్ భూములున్నాయి. ఆ కర్మాగారం చాలావరకు మూతపడింది గదా. దానివల్ల వచ్చిందేమిటంటే, అందులో పనిచేసినవారిలో కొందరు హైదరాబాద్‌లో ఔషధ కంపెనీలు పెట్టారు. అదేవిధంగా ఐడీఎల్. ఒకప్పుడు నగరం బయట అనుకున్నవి ఇప్పుడు ఊరి నడిబొడ్డులో ఉన్నాయి. ఐడిపీఎల్, డిటొనేటర్ల కంపెనీ నగరం మధ్యలో ఉండాల్సిన అవసరమేముంది? వాటికి కొన్ని వందల ఎకరాలున్నాయి. ఆ భూములు నిరుపయోగంగా పడివున్నాయి. ప్రతి 100 ఎకరాల కన్వర్షన్‌కి 50 ఎకరాలు రాష్ట్ర ప్రభుత్వానికి ఇవ్వటం అనే షరతు మీద కన్వర్షన్‌కి ఇచ్చేయమని ప్రభుత్వానికి మనం చెబుదాం. మీరు పారిశ్రామికవాడల్లో లంచం కింద 30% అడుగుతున్న ప్పుడు, వాళ్లకేముంటుంది సమస్య. వారికి కన్వర్షన్ కోసం ఇచ్చేస్తున్నాం గదా. మీ వాటా భూమిని గ్రీన్ బెల్ట్ గా, నగరంలో మౌలిక సదుపాయాల కోసం వాడండి. డబ్బులు రావటం కోసం కొంత వాణిజ్య అవసరాలకు ఉపయో గించండి. అన్ని రకాలుగా ప్రయోజనం ఉంటుంది. కొంచెం సృజనాత్మకంగా, న్యాయంగా ఆలోచించండి. లంచాల ద్వారా కన్వర్షన్ కాకుండా, సమాజానికి ప్రయోజనం చేకూర్చే కన్వర్షన్ గురించి ఆలోచించండి.

**నిషేధిత భూముల పేరుతో వేధింపులు**

ఇంకోటి నిషేధిత భూములు. కొన్ని సందర్భాల్లో లిటిగేషన్ ఉన్నప్పుడు ప్రొహిబిటెడ్ భూములు అనివార్యం. కానీ నిషేధిత భూముల పేరుతో.. ఏ రకంగా అనుమానం లేని, రైతులు మ్యూటేషన్లు చేయించుకున్న, భవన నిర్మాణ అనుమతులు పొందిన, లే అవుట్ అప్రూవల్, ప్రభుత్వ అనుమతులన్నీ ఉన్న భూములకు కూడా కొర్రీలు పెట్టటం అన్యాయం. అధికారులను అడిగితే, మాకు కేబినెట్‌లో చెప్పారు అనధికారికంగా ఆపివేయమని అంటారు. వీలుంటే కోర్టుకెళ్లమని సలహా ఇస్తారు. కోర్టులకెళితే ఈ దేశంలో ఎన్ని లక్షలు ఖర్చవుతాయి? ఎన్నేళ్లు పడుతుంది? ఇంతకంటే దారుణం ఇంకోటి లేదు. నిజంగా చెబుతున్నా – అధికార యంత్రాంగం ఏం చేస్తున్నారో నాకు అర్థం కావటం లేదు. చట్టం స్పష్టంగా చెబుతుంటే, వాడెవడో చెప్పేదేమిటయ్యా? ఏ చట్టం కింద వాడు చెబుతున్నాడు? న్యాయం చేయటానికి దమ్ముల్లేని అధికారులెందుకున్నారు? పరుషంగా మాట్లాడు తున్నాను. కానీ దీని మీద మనం గొంతెత్తాలి. నిజంగా నగరాభివృద్ధికి అవసరమైన భూముల్ని నిర్దిష్టంగా లిటిగేషన్ ఉంటే ఆపండి. కానీ ఎక్కడో లిటిగేషనలో ఉందని ఇక్కడి భూముల మీద జులుం చెలాయించటం తగదు. ఉదా హర ణకు, స్పేస్ ఎంప్లాయిస్ రెసిడెంట్స్ అసోసియేషన్. వాళ్లు అంతరిక్ష సాంకేతికత గురించి పనిచేసిన అధికారులు, శాస్త్రవేత్తలు. 45 ఏళ్ల క్రితం వారు భూములు సొంతంగా కొనుక్కొని, ఇళ్లు, కాలనీ కట్టుకున్నారు. లే అవుట్ అప్రూవల్ అయింది. మ్యుటేషన్ పూర్తయింది. ఉత్తర్వుల ద్వారా ప్రభుత్వం అన్నీ అప్రూవ్ చేసింది. నాలుగున్నర దశాబ్దాల తర్వాత ఆక్యు పెన్సీ సర్టిఫికెట్ ఇవ్వం, అమ్మటం నిషేధం, రిజిస్ట్రేషన్‌కి అవకాశం లేదు అని ప్రభుత్వం అంటోంది. ఇదెక్కడి అన్యాయం అని కాలనీవాసులు అడిగితే –కరెక్టే, అన్యాయమే, మమ్మల్నేం చేయమంటారు, కోర్టుకెళ్లండి అని ప్రభుత్వాధికారులు దులిపేసు కుంటున్నారు. ఇది మన కళ్ల ముందు కనిపిస్తున్న ఉదాహరణ. ఇది ఒక్క భారతదేశంలోనే సాధ్యం. విజ్ఞత గల ఏ దేశంలో కూడా ప్రజల హక్కుల్ని ఇంత దారుణంగా హరించివేసి, దమ్ముంటే కోర్టుకెళ్లవయ్యా, నాకు చెప్పద్దు అనటం సాధ్యం కాదు. వలస పాలనలో కూడా ఒక అధికారి ప్రజలతో 'నువ్వు కోర్టుకెళ్లు' అంటే అవమానంగా భావించేవారు. ప్రజల హక్కుల్ని కాపాడలేని యంత్రాంగం ఎందుకండీ? ఆ రకంగా స్పష్టమైన హక్కులున్నవారి కోసం మనం గొంతెత్తాలి. నిషేధిత భూములు చాలా ఉన్నాయి. వాటిని మనం అడ్డుకోవటం లేదు. కాబట్టి, మనం పకడ్బందీగా పరిష్కారం సూచించాలి, గొంతు విప్పాలి.

**ట్రాఫిక్, కాలుష్యంలోనా**
**బెంగళూరు, ఢిల్లీతో పోటీ పడాల్సింది?**

హైదరాబాద్ నగరం గురించి ఇంకొంచెం ఆలోచించాల్సుంది. ఈవేళ కాకతాళీయంగా ఇండియన్ ఎక్స్‌ప్రెస్ పత్రిక మొదటి పేజీ వార్త – ఢిల్లీ తరహాలో హైదరాబాద్ కాలుష్య నగరంగా మారుతోందా? అని. హైదరాబాద్ పెరగాలి. నేను పుట్టింది ఇక్కడ కాకపోయినా, 36 ఏళ్లుగా ఇది నా నగరం. నా నగరం పట్ల గర్వపడతాను. ఎందుకంటే, ప్రభుత్వాలు ఈ పార్టీ, ఆ పార్టీ అనికాకుండా ఔటర్ రింగ్ రోడ్డు, ఎయిర్ పోర్టు, హైటెక్ సిటీ.. ఇలా అభివృద్ధి చేశారు. హైటెక్ సిటీకి తొలుత పునాది వేసింది నేను. ఆ తర్వాత అద్భుతంగా అభివృద్ధి చేశారు. అదేవిధంగా ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్. కొన్ని సమస్యలున్నా కూడా. వీటన్నిటికీ మనందరి పూర్తి మద్దతు ఉంటుంది. హైదరాబాద్ కచ్చితంగా పెరగాలి. ఇప్పుడు బెంగళూరుకి దీటుగా వస్తున్నాం. కానీ బెంగళూరుతో ట్రాఫిక్ రద్దీలోనా మనం పోటీపడాల్సింది? ఢిల్లీతో కాలుష్యంలోనా పోటీపడేది మనం? ఈ పరిస్థితిని తేలిగ్గా మార్చవచ్చు. హైదరాబాద్ కంటే ఢిల్లీ జనాభా మూడు రెట్లు. కానీ ఢిల్లీ కంటే హైదరాబాద్‌లో వ్యక్తిగత వాహనాలు ఎక్కువ. ఎందుకంటే, ఇక్కడ ప్రజారవాణా వ్యవస్థ పూర్తిస్థాయిలో లేదు కాబట్టి. ముంబయి కంటే కూడా ఎక్కువ వాహనాలు హైదరాబాద్‌లో ఉన్నాయి. అంతకంటే పెద్ద నగరమా మనది? ముంబయిలో రోజూ 64 లక్షల మంది మెట్రోలో వెళుతుంటే, హైదరాబాద్ లో 4 లక్షల మంది ప్రయాణిస్తున్నారు. ఇన్ని వేల కోట్లు ఖర్చు

పెట్టి మెట్రో ఏర్పాటు చేసినా, ప్రజల సంఖ్యకు తగ్గ కోచ్‌లను పెంచటానికి కేవలం రూ.300 కోట్లు కేటాయించక పోవటం వల్ల వ్యక్తిగత వాహనాలు పెరుగుతున్నాయి. పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ ఇంత అధ్వాన్నంగా ఉన్నప్పుడు కాలుష్యం గాక ఏమవుతుంది? హైదరాబాద్‌లో రద్దీ, కాలుష్యం ఇలాగే కొనసాగితే నగరం నరకమైపోతుంది. దానికి మన వద్ద పరిష్కారం ఉంది. మౌలిక వసతులున్నాయి. మనసుం డాలేగానీ, పెద్ద ఇబ్బంది లేకుండా హైదరాబాద్‌లో ట్రాఫిక్ సమస్యను సరిచేయవచ్చు. ప్రజారవాణాను విస్తరించి, సింగిల్ ట్రాఫిక్ అథారిటీని ఏర్పాటు చేయాలి. మెట్రో–ఎంఎంటీఎస్–ఆర్.టి.సి మూడిటికీ ఒకటే టికెట్. ప్రపంచమంతా ఇలా ఒకే అథారిటీ టికెట్ ఉంటుంది. మన వద్ద ఇందుకోసం 'ఉన్టా' ఏర్పాటు చేశారట. అందులో ఎవరున్నారో, ఏం చేస్తుంటారో దేవుడికే ఎరుక. ఆ సంస్థ ఏర్పాటు చేయకపోతే యూనియన్ ప్రభుత్వం డబ్బులివ్వం అని చెప్పింది కాబట్టి.. 'ఇస్తినమ్మ వాయనం, పుచ్చుకుంటినమ్మ వాయనం' అన్నట్టుగా మొక్కుబడిగా ఏర్పాటు చేశారు. ఈ సింగిల్ అథారిటీ ప్రజారవాణా కోసం మనం గట్టిగా కృషి చేయాలి. అది మాత్రమే చాలదు. చివరి గమ్యానికి కనెక్టివిటీ కావాలి. సమయం కావచ్చు, డబ్బు కావచ్చు 60–65% ఆ లాస్ట్ మినిట్ కనెక్టివిటీ కోసమే, ఆ సదుపాయాలు కొరవడటం వల్లే పోతున్నాయి.

మూడోది, ట్రాఫిక్ నిబంధనల్ని సరిగా అమలు చేయాలి. వేల సీసీ కెమెరాలున్నాయని చెప్పుకుంటాం. నెట్‌వర్క్, కమాండ్ కంట్రోల్ సెంటర్‌ల గురించి బ్రహ్మాండంగా చాటుకుంటాం. కానీ ట్రాఫిక్ నిబంధనల్ని ఎడాపెడా ఉల్లంఘించటం మామూలై పోయింది. ఇది చాలా తీవ్రంగా పట్టించు కోవాల్సిన, సరి చేయాల్సిన సమస్య.


**లండన్ తరహా వికేంద్రీకరణ,**
**నగర పాలనను అనుసరించండి**

ఇంకొక్క అంశంతో ముగిస్తాను. ఈ మధ్య 2000 చదరపు కిలోమీటర్లను జి.హెచ్.ఎం.సికి కలపటంతో హైదరాబాద్ జనాభా 2 కోట్ల దాకా చేరిందని చెబుతున్నారు. దీన్లో కొంత మేలుంది, కొంత నష్టముంది. ప్రభుత్వ విధానాల గురించి నేను మాట్లాడటం లేదు. ప్రభుత్వం చట్టబద్ధంగా నిర్ణయాలు తీసుకుంటే వ్యతిరేకించను. పాలకులు ఏం చేసినా వ్యతిరేకిస్తాననటం కరెక్ట్ కాదు. కానీ చేసేది కొంచెం హేతుబద్ధంగా చేయండని కోరుతున్నాను. ఉదాహరణకు, లండన్ నగరం జనాభా 90 లక్షలు. హైదరాబాద్‌లో సగం కంటే తక్కువ. అయినా లండన్‌లో 32 బర్రోస్, అంటే మునిసిపాలిటీలు ఉన్నాయి. 90 లక్షల జనాభా అవసరాలూ ఆ 32 మునిసిపాలిటీల పరిధిలో పూర్తవుతాయి. అన్ని పనులకీ మునిసి పాలిటీయే తప్ప ఎక్కడికీ వెళ్లనవసరం లేదు. కేంద్రీకరించటం ఉండదు. మరి లండన్ నగరం స్థాయిలో చేసేదేమిటి? నగర మేయర్, మిగిలినవాళ్లు ఏం చేస్తారు? వాళ్లు మూడే పనులు చేస్తారు. ప్రజారవాణా ఇంటిగ్రేషన్ టికెట్ వ్యవస్థ సమర్థంగా పనిచేసేలా పర్యవేక్షించటం, అగ్నిమాపక సేవలు, పోలీసులు. ఇవికాక ప్రాంతీయ ప్రణాళికల రూపకల్పన చేస్తారు. అంతే. హైదరాబాద్‌లో 2 కోట్ల జనాభా ఉంటే, ఒకేచోట నుండి పర్యవేక్షించటం సాధ్యమా? అంత ఓపిక ఎవరికి ఉంటుంది, ఎవరు వింటారు? కాబట్టి లండన్ నగరాన్ని అనుకరించి వికేంద్రీకరించండి. జోనల్‌గా ఉన్నవాటిని పూర్తిస్థాయి మునిసిపాలిటీలుగా మార్చేయండి. పరస్పర సంధానంతో సమర్థంగా పనిచేసేలా చేయండి. అంతేగానీ, 2–3 కోట్లు జనాభా అంతటికీ ఒకేచోట స్థానిక ప్రభుత్వం అంటే ఎలా? ప్రపంచంలో ఇంత జనాభా ఉన్న దేశాలు 20 కూడా ఉండవేమో. మరి ఏమి స్థానిక ప్రభుత్వం? ఇది పాలనా బాధ్యతల విషయంలో దారుణమైన బాధ్యతారాహిత్యం. పరిష్కారాలు చాలా తేలికైనవి ఉన్నాయి. ఎంతసేపూ రియల్ ఎస్టేట్‌లో డబ్బులు సంపాదించటం, ఎన్నికల్లో ఓట్ల కొనుగోలు తప్ప ఇవి పట్టించుకోకుంటే రోజువారీ ప్రజాజీవితం దుర్భర మవుతుంది. ఎన్నికల్లో ఓట్ల కొనుగోలు, ప్రలోభాలు, తాత్కాలిక తాయిలాలు వేరే సమస్య. ఆ సంక్షోభ పరిష్కారానికి ఎలాంటి సంస్కరణలు తేవాలో తర్వాత ఆలోచిద్దాం. కానీ నగరం నరకం కాకుండా కాపాడటానికి ప్రభుత్వం చేయగలిగినవి, సులభమైనవి, అందుబాటులో ఉన్నవి, ఖర్చు లేనివి, సామాన్యులకు న్యాయం జరిగేవి –వాటికి ప్రస్తుతానికి పరిమితమవుదాం.

కాబట్టి నేను కోరేది ఒకటే – ఒక నిపుణుల బృందాన్ని ఏర్పాటు చేద్దాం. ఈ అంశాల్లోకి లోతుగా వెళ్లి పార్టీల కతీతంగా నగర అభివృద్ధి, రైతులకు న్యాయం, ప్రజలకు సౌకర్యం కోసం పరిష్కారాలను ప్రభుత్వానికి తెలియచేద్దాం. మనం నిర్దిష్టంగా కొన్ని అంశాల్ని గుర్తించి, విశ్వసనీయంగా గొంతు విప్పినట్లయితే, కచ్చితంగా మార్పు వస్తుంది. నేను ఆశావాదిని. గ్రామంలో పెరిగినవాడిని. కాబట్టి భూమి పట్ల రైతు మమకారం, సొంత భూమిని సొంతంగా ఉపయోగించుకునే అవకాశం లేకుంటే పడే బాధ నాకు తెలుసు. లోతుగా చర్చించి, ప్రభుత్వంతో కూర్చుని అమలుపై చర్యల్ని నిర్దిష్టంగా సూచిస్తే కొన్నయినా చేస్తారనే నమ్మకం నాకు ఉంది. ఎందుకంటే, మనం వాళ్లకి అన్యాయం తలపెట్టటంలా. వాళ్లని లంచాలు కూడా అడగటంలా. కానీ ఉన్నంతలో మంచి చేయండని అడుగుతున్నాం. అది కూడా చేయకపోతే, ఆలోచిద్దాం ఏం చేయాలని'. ❖

## 22 ఏళ్లలో 15 రెట్లు ఆదాయం లక్ష్యంగా తెలంగాణ రైజింగ్ దార్శనిక పత్రం ..

# విజన్‌కి తగ్గ విధానాలు ప్రశ్నార్థకం




వచ్చే దశాబ్దం (2036) నాటికి ట్రిలియన్ డాలర్ ఎకానమీకి, 2047కి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థకు చేరుకోవటం లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం దార్శనిక పత్రాన్ని ఆవిష్కరించింది. తెలంగాణ రైజింగ్-2047 పేరుతో ప్రభుత్వం రెండు రోజులపాటు హైదరాబాద్ ఫ్యూచర్ సిటీలో నిర్వహించిన గ్లోబల్ సమ్మిట్ ముగింపు సందర్భంగా విజన్ డాక్యుమెంట్‌ని ముఖ్యమంత్రి రేవంత్ ఆవిష్కరించారు. ఈ ఆర్థిక లక్ష్యసాధనకు వివిధ రంగాలలో చేపట్టాల్సిన అభివృద్ధి, ప్రజల జీవన ప్రమాణాల పెంపు, రాష్ట్రమంతా సమతుల అభివృద్ధి తదితర దశలవారీ లక్ష్యా లను అమలు చేయనున్నట్లు తెలిపారు.

**కోర్..ప్యూర్..రేర్ లక్ష్యంగా**
**త్రీ ట్రిలియన్ డాలర్ ఆర్థిక వ్యవస్థ**

రాబోయే రెండు దశాబ్దాలలో సమగ్ర, సమ్మిళిత, సుస్థిర అభివృద్ధికి త్రిముఖ వ్యూహంతో తెలంగాణ విజన్ డాక్యుమెంట్‌ను రూపొందించారు. కోర్ అర్బన్ రీజియన్ (కోర్), పెరి అర్బన్ రీజియన్ (ప్యూర్), రూరల్ అగ్రి రీజియన్ (రేర్) లక్ష్యంగా ఏయే రంగాల్లో ఏమి చేయాలో స్థూలంగా పత్రంలో పేర్కొన్నారు. ఇందుకోసం ప్రజల అభిప్రాయాలను కోరగా, నాలుగు లక్షల మంది స్పందించి నట్లు తెలిపారు. వీరిలో ఎక్కువ శాతం యువతగా చెబు తున్నారు. భారత్ ఫ్యూచర్ సిటీ, మూసీ పునరుజ్జీవనం, డ్రైపోర్టు, బందరు పోర్టు వరకు గ్రీన్ ఫీల్డ్ హైవే, రీజినల్ రింగ్ రోడ్డు, రింగ్ రైలు, బుల్లెట్ రైలు కారిడార్ల వంటి ప్రాజెక్టులు గేమ్ ఛేంజర్‌గా మారతాయని ప్రభుత్వం అభివర్ణిం చింది. డిజిటల్ గవర్నమెంట్, టీ-ఫైబర్, స్పీడ్ వంటి కార్యక్రమాలతో పాలనా సామర్థ్యాన్ని పెంచటం, ప్రపంచ స్థాయి విద్య, పరిశోధన సంస్థలను ఆకర్షించటం, మహిళలు, రైతులు, యువతపై ప్రత్యేక దృష్టి, ఆరోగ్యం, విద్య, జీవనోపాధి, అందరికీ సమానావకాశాలతో సుస్థిర సంక్షేమం, మౌలిక సదుపాయాల ప్రాజెక్టులలో ప్రపంచ పెట్టుబడులను ఆకర్షించి ప్రత్యేక నిధి ఏర్పాటు చేయటం, పాలనలో ప్రజల భాగస్వామ్యాన్ని పెంచటం ఇలా అనేక కార్యక్ర మాలను ప్రాధాన్యతగా పేర్కొంది. మొత్తం 83 పేజీల డాక్యుమెంట్లో పర్యావరణం, సుస్థిరత, రివర్ కారి డార్ల అభివృద్ధి, పర్యాటకాభివృద్ధి తదితర అంశాల గురించి విశ్లేషించారు. ప్రధానంగా 'ఆర్థికాభివృద్ధి లక్ష్యంగా' సాగిన ఈ సదస్సులో సుమారు రూ.5.75 లక్షల కోట్ల పెట్టుబడులకు వివిధ కంపెనీలతో ఎంఓయూలు కుదిరాయి. కొన్ని కీలకాంశాలు:

✦ యూనియన్ ప్రభుత్వ వికసిత్ భారత్ 30 ట్రిలియన్ డాలర్లలో 10% తెలంగాణ అందించాలని దార్శనిక పత్రంలో లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇందుకు ప్రస్తుతమున్న 37% పెట్టు బడుల రేటును 52%కి పెంచాలి. పొదుపు, విదేశీ ప్రత్యక్ష పెట్టు బడులను ఆకర్షించటం, దీర్ఘకాలిక సావరిన్ వెల్త్ ఫండ్ ను సమీ కరించటం, మునిసిపల్ బాండ్లు జారీ, ఆర్థిక వ్యవస్థ కార్యకలా పాలను విస్తరించటం (ప్రస్తుతం జి.ఎస్.వి.ఎ లో బీమా,

బ్యాంకింగ్ తదితర రంగాల వాటా కేవలం 5.6% ఉంది. ఇతర రాష్ట్రాల్లో 11.5% దాకా ఉంది), ప్రత్యామ్నాయ పెట్టుబడి ఫండ్స్ సేకరణ, పీపీపీ విధానాలను సరళీకరించటం ఇందుకు మార్గాలుగా భావిస్తున్నారు.

✦ తెలంగాణ జి.ఎస్.డి.పి 2024–25లో రూ.16.41 లక్షల కోట్లు. దేశ జీడీపీలో 5% వాటా. ప్రస్తుత వృద్ధి ఇలాగే కొనసాగితే, 2046–47 నాటికి రాష్ట్ర జి.ఎస్.డి.పి 6.3 రెట్లు పెరిగి 1.21 ట్రిలియన్ డాలర్లకు చేరుతుంది. తలసరి ఆదాయం 5.6 రెట్లు పెరిగి, రూ.25.8 లక్షలకు చేరుతుంది. మూడు ట్రిలియన్ డాలర్లకు పెరగాలంటే తెలంగాణ జి.ఎస్.డి.పి 15 రెట్లు పెరగాలి.

✦ 3 ట్రిలియన్ డాలర్ల (సుమారు రూ.270 లక్షల కోట్ల) ఆర్థికాభివృద్ధి సాధనకు 3 సెక్టార్లుగా విజన్ ను డాక్యుమెంట్ లో విభజించారు.

✦ ప్రాథమిక సెక్టార్‌లో వ్యవసాయాన్ని సాంప్రదాయ పద్ధతుల నుండి అధికోత్పత్తి వైపు, గ్రామీణ జీవనోపాధికి గ్యారంటీ ఇచ్చే వ్యవసాయ–ఆహార ఆర్థికాభివృద్ధి వైపు మళ్లాలని పత్రం సూచించింది. తృణ ధాన్యాలు, నూనె గింజలు, పండ్ల తోటల పెంపకం, ఏఐ సహా అత్యాధునిక సాంకేతికత వినియోగంతో అధికాదాయం ఆర్జించాలి. రైతు సహకార సంఘాల ద్వారా పంట ఉత్పత్తులను ప్రాసెస్ చేసుకోవటం, అమ్ముకోవటానికి ప్రాధాన్యం. ఇందుకోసం శీతల గిడ్డంగులు, ఆధునిక మార్కెట్ల నిర్మాణం.

✦ సెకండరీ సెక్టార్‌లో పారిశ్రామికాభివృద్ధి రోడ్ మ్యాప్‌కి ప్రాధాన్యతనిచ్చారు. అంతర్జాతీయ స్థాయిలో పోటీపడేలా మాన్యుఫ్యాక్చరింగ్ హబ్‌లు, లైఫ్ సైన్సెస్ లో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, ఏరోస్పేస్, సెమికండక్టర్లు, గ్రీన్ హైడ్రోజన్ హబ్స్, రేడియల్ హైవేలు, విద్యుత్తు వాహనాల తయారీ, ఓడరేవుల అనుసంధానం మొదలైన వాటిపై పూర్తిస్థాయిలో దృష్టి పెట్టటంతో పాటు అన్ని జిల్లాల మధ్య సమతౌల్య అభివృద్ధి ఉండేలా చూడటం.

✦ తృతీయ స్థాయి సెక్టార్‌లో, మానవ పెట్టుబడి, డిజిటల్ పబ్లిక్ ఇన్ ఫ్రాస్ట్రక్చర్, ఐటీలో ఉన్నత స్థాయి ఉద్యోగాలకు యువతను సన్నద్ధం చేయటంతోపాటు ప్రతి సెక్టార్‌లో అభివృద్ధిని వ్యూహాత్మకంగా ముందుకు తీసుకెళ్తామని విజన్ డాక్యుమెంట్ స్పష్టం చేసింది.

✦ పాఠశాల స్థాయి నుండి నైపుణ్యాల కోసం యూనివర్సల్ లెర్నర్ యాక్సెస్ మిషన్. 2035 నాటికి 10 యూనికార్న్‌లు. ఏఐ, క్వాంటమ్ టెక్నాలజీలు, క్లీన్ ఎనర్జీ, అంతరిక్ష రంగాల్లో పరిశోధనలకు యూనివర్సిటీల్లో పరిశోధనా పార్కులు, అడ్వాన్స్‌డ్ లేబొరేటరీలు. ఒకే సిటిజన్ యాప్ ద్వారా పౌర సేవలు. ఆవిష్కరణలు, సాంకేతికత డిస్ట్రిక్‌గా, జీసీసీలకు వ్యూహాత్మక హబ్ గా హైదరాబాద్ అభివృద్ధి.

✦ డేటా సెంటర్ పార్కుల నిర్మాణానికి 'డయల్ బిఫోర్ డిగ్' విధానం. వాతావరణానుకూల స్మార్ట్ వ్యవసాయం, సర్క్యులర్ తయారీ రంగం, గ్రీన్ డేటా శాండ్ బాక్స్, రాష్ట్రవ్యాప్త సైబర్ సెక్యూరిటీ గ్రిడ్, పారిశ్రామిక–అకడమిక్ భాగస్వామ్యం కోసం 'సెంటర్ ఆఫ్ ఎక్స్ లెన్స్' ఏర్పాటు.

✦ 10 గ్రీన్ ఫీల్డ్ టౌన్ షిప్ లు. మురుగునీటి శుద్ధి ప్రాజెక్టుల్లో పెట్టుబడులకు ప్రోత్సాహం.

✦ విద్యుత్ డిమాండ్ ప్రస్తుతం 1.9 వేల మెగావాట్లు ఉండగా, 2047కి 1.39 లక్షల మెగావాట్లకు పెరుగుతుందని అంచనా. ఇందులో పునరుత్పాదక ఇంధనం ద్వారానే 90% అందుబాటులోకి తేవటం.

✦ మెట్రో, ఎంఎంటీఎస్, ఆర్.టి.సి ప్రజారవాణాలకు ఒకే టికెట్. నైట్ ఎకానమీ, పర్యాటక రంగాలకి ప్రోత్సాహం.

✦ రీజినల్ క్లస్టర్ యాక్సెలరేషన్ ప్రోగ్రాం (రీకాప్) కింద తెలంగాణలోని టయర్–2,3 పట్టణాల్లో రీజినల్ అర్బన్ క్లస్టర్ల ఏర్పాటు. లక్షకు పైగా జనాభా కలిగిన పట్టణాల్లో ఐఆర్ఆర్, ఓఆర్ఆర్, ఆర్ఆర్ రోడ్ల నిర్మాణం చేపడతారు. తెలంగాణ స్టేట్ అర్బన్ మిషన్‌లో భాగంగా నగరాల్లో కాలుష్యాన్ని నియంత్రించేలా మైక్రో గ్రిడ్‌లు, నీటి శుద్ధి ప్లాంట్లను ఏర్పాటు చేస్తారు. ఉపాధి కల్పనే లక్ష్యంగా ఇండస్ట్రియల్, ఫుడ్ ప్రాసెసింగ్ జోన్లతో కూడిన 6 భారీ, 19 మధ్యస్థాయి భారత ఇండస్ట్రియల్ పార్కుల నిర్మాణం చేపడతారు.

✦ 79 మునిసిపాలిటీల్లో స్థానిక పరిస్థితులకనుగుణంగా పరిశ్రమల ఏర్పాటుకు ప్రణాళికలను రూపొందిస్తారు. ప్రతి మండల కేంద్రంలో వ్యవసాయ ఉత్పత్తుల శుద్ధి, నిల్వకు అగ్రో ఇండస్ట్రియల్, లాజిస్టిక్ హబ్ లను అభివృద్ధి చేస్తారు. వాటిని సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు, స్వయం సహాయక సంఘాలతో అనుసంధానిస్తారు.

✦ ఆరోగ్య పరిరక్షణకు 'హెల్త్ నెట్'లో భాగంగా ప్రతి మండల కేంద్రంలో డిజిటల్ డయాగ్నొస్టిక్స్ సెంటర్. ఈ–రికార్డులు, టెలీ వైద్యం, మాతాశిశు సంరక్షణ, దీర్ఘకాలిక రోగాల పర్యవేక్షణ, ఇంటి వద్దకే వైద్యం వంటి సదుపాయాలతో సంచార ఆరోగ్య యూనిట్లు.

✦ డిజిటల్ గవర్నెన్స్ కోసం 'జన్ సేవ' పేరుతో ఈ–కామర్స్ యాక్సెస్ సెంటర్లు. ప్రతి ఇంట్లో డిజిటల్ అక్షరాస్యత. అన్ని గ్రామాలలో రక్షిత మంచినీరు, పారిశుద్ధ్యం, రహదార్లు, విద్యుత్ సరఫరాకి సోలార్ మైక్రోగ్రిడ్‌లు, బయో గ్యాస్/కంపోస్ట్, గ్రేవాటర్ రెస్యూ వ్యవస్థలకు 'గ్రామ్ 2.0'.

✦ తరగతికి–పరిశ్రమలకు అనుసంధానంతో జర్మన్ తరహా విద్యావ్యవస్థ. విదేశాలకు నిపుణులను పంపేందుకు టామ్ కామ్ బలోపేతం. క్యాండిడేట్ సెంట్రిక్ కెరీర్ డెవలప్‌మెంట్ అండ్ ఎంప్లాయ్‌మెంట్ పోర్టల్, ఉద్యోగ ట్రెండ్‌లను అంచనా వేసేందుకు డిజిటల్ స్కిల్లింగ్ పోర్టల్ లో లేబర్ మార్కెట్ ఇంటెలిజెన్స్ వ్యవస్థ ఏర్పాటు.

✦ రెండు కేటగిరీలుగా విశ్వవిద్యాలయాలు. ఒక రకం ఉద్యోగ, ఉపాధికి దోహదం చేసేవి కాగా, మరో రకం డీప్ టెక్, ఇన్నోవేషన్ పరిశోధనలకు ప్రాధాన్యత ఇస్తాయి. పరిశ్రమల నిపుణులు కూడా 40–50% బోధనా బాధ్యతల్లో భాగమవుతారు.

✦ రాష్ట్రంలో హ్యూమన్ రిసోర్స్ ఫర్ హెల్త్ డెన్సిటీని 10 నుండి

## గ్వాంగ్ డాంగ్‌లోని స్థానిక ప్రభుత్వాల సాధికారత తెలంగాణ విజన్ డాక్యుమెంట్‌లో ఎక్కడ?

తెలంగాణ రైజింగ్ డాక్యుమెంట్‌లో ఆర్థికాభివృద్ధిని ప్రధాన లక్ష్యంగావించుకున్నారు. అందుకు చైనాలోని గ్వాంగ్ డాంగ్ ప్రావిన్స్ నమూనాను తీసుకున్నానమని చెప్పారు. అయితే పెట్టుబడుల ఎంఓయూలు మినహాయించి, ఆ స్థాయి ఆర్థికాభివృద్ధికి గ్వాంగ్ డాంగ్ అమలు చేసిన పలు కీలక సంస్కరణలు, విధానాలు తెలంగాణ దార్శనిక పత్రంలో కొరవడ్డాయి. ఒక అద్భుత ఆర్థికాభివృద్ధికి ప్రాంతీయ నమూనా గ్వాంగ్ డాంగ్. చైనాలోని ఈ ప్రావిన్స్, 'ఎగుమతి ఆధారిత, మార్కెట్ అనుసంధానిత, ఆవిష్కరణలను ఎప్పటికప్పుడు ఆధునీకరించే' నమూనాలో ప్రపంచస్థాయిలోనే ఆదర్శప్రాయ విజయాన్ని సాధించింది. నాలుగు అంశాలు గ్రోత్ ఇంజిన్లుగా పనిచేశాయి: స్వేచ్ఛా మార్కెట్, ప్రయివేటు ఎంటర్‌ప్రెన్యూర్ షిప్, విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు, స్వతంత్ర ప్రతిపత్తితో కూడిన బలమైన మద్దతు ప్రభుత్వం అందించటం. ఒకప్పుడు వ్యవసాయాధారిత ప్రాంతంగా ఉన్న గ్వాంగ్ డాంగ్ ఈవేళ చైనాలోనే అత్యంత సంపన్న ప్రావిన్స్‌గా మారింది. 1980లో డెంగ్ జియోవో పెంగ్ నాయకత్వంలో గ్వాంగ్ డాంగ్ పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థ ప్రయోగాన్ని చేసింది. 'సెజ్'ల ఏర్పాటు వల్ల ఒక మత్స్యకార గ్రామం షెన్ జెన్ గ్లోబల్ టెక్నాలజీ హబ్ గా మారింది. విదేశీ పెట్టుబడులకు సులభ అనుమతులు, తక్కువ పన్నులు, చౌక భూములు, సరళమైన కార్మిక చట్టాలతో ఈ ప్రావిన్స్ 'ప్రపంచ కర్మాగారం'గా పేరుగాంచింది. ఎలక్ట్రానిక్స్, వస్త్రాలు, బొమ్మలు, వస్తువులు, మొబైల్ విడిభాగాలు మొదలైనవి ఇక్కడ్నుంచి ఇబ్బడిముబ్బడిగా ఎగుమతులు అవుతుంటాయి. 'మేడిన్ చైనా'ను 'డిజైన్డ్ ఇన్ చైనా'గా ఈ ప్రావిన్స్ మార్చింది. హువాయ్, టెన్సెంట్, బీవైడీ, డ్రోన్లతో చైనా సిలికాన్ వేలీగా పేరొందిన గ్వాంగ్ డాంగ్ ఇప్పుడు ఏఐ, సెమీ కండక్టర్లు, ఈవీలు, బయోటెక్, రోబోటిక్స్ మీద డీప్ టెక్ ఆవిష్కరణలు చేస్తోంది. పైన పేర్కొన్న తెలంగాణ రైజింగ్ దార్శనిక పత్రంలో గ్వాంగ్ డాంగ్ నమూనాలోని పలు అంశాలను ఉటంకించారుగానీ, అక్కడి భూ, కార్మిక సంస్కరణలు, బలమైన స్థానిక ప్రభుత్వం గురించి మాత్రం మాట్లాడలేదు. సుమారు 51% దాకా గ్వాంగ్ డాంగ్ స్థానిక ప్రభుత్వ వ్యయాన్ని చైనా కేంద్ర ప్రభుత్వం భరిస్తుంది. అది కూడా షరతులు లేకుండా. కేవలం స్థానిక ప్రభుత్వాల జవాబుదారీతనానికి అవసరమైన పర్యవేక్షణకు పరిమితమవటం ద్వారా. మరి తెలంగాణలో పంచాయతీలు, మునిసిపాలిటీలు, చివరికి జి.హెచ్.ఎం.సికి ఎన్ని నిధులిస్తున్నారు. యూనియన్ ప్రభుత్వం నుంచి వచ్చిన నిధుల్ని కూడా పక్కకు మళ్లిస్తూ రాష్ట్ర ప్రభుత్వం 'జీరో' నిధులనిస్తోంది. ఈసారి నిధులను ఇస్తాం అని చెబుతున్నారుగానీ.. ఓ పక్క పంచాయతీలకు ఎన్నికలు పూర్తయినా, పాత సర్పంచ్‌లు అప్పులు తెచ్చి చేసిన అభివృద్ధి పనుల బకాయిలు ఇంకా తీర్చలేదు. నిధుల సమీకరణకు మునిసిపల్ బాండ్లు సేకరిస్తామని చెప్పారు. స్థానికంగా ఉత్సవ విగ్రహాల లాంటి మేయర్లు, చైర్మన్లు ఉన్న మునిసిపాలిటీలు, కార్పొరేషన్లకు ఎవరు అప్పులిస్తారు? భారతదేశం మొత్తం మీదా అత్యధిక ఆదాయమున్న ఓ మహానగరానికి ఇప్పటివరకూ వచ్చిన అత్యధిక మునిసిపల్ బాండ్ నిధులు కేవలం రూ.2–3,000 కోట్లు. అదే కాలిఫోర్నియా లాంటి నగరాలకు బిలియన్ డాలర్లలో వస్తుంటాయి. కాబట్టి, స్థానిక ప్రభుత్వాల సాధికారత సహా పలు దిద్దుబాట్లు తెలంగాణ రైజింగ్ విజన్ డాక్యుమెంట్‌లో అవసరం.

40కి చేర్చటం. హెల్త్ కేర్ రంగాన్ని బలోపేతం చేయటం, వైద్యవిద్య విస్తరణ, డిజిటల్ హెల్త్‌లో, కమ్యూనిటీ ఆరోగ్యం కోసం అపోలో ఆస్పత్రుల గ్రూప్ తో ఒప్పందం.

✦ తెలంగాణను గ్లోబల్ నాలెడ్జి హబ్‌గా మార్చటానికి యూనివర్సిటీ ఆఫ్ లండన్ తో ఒప్పందం. అదే విధంగా డిజిటల్ మౌలిక సదుపాయాలు, మీడియా టెక్నాలజీకి ట్రంప్ మీడియా, టెక్నాలజీ గ్రూప్ తో ఒప్పందం.

✦ త్వరలో లైఫ్ సైన్సెస్ పాలసీ 2.0. హైదరాబాద్‌ను గ్రీన్ ఏరోస్పేస్ రాజధానిగా మార్చటం. ఐ.ఎస్.బి తరహాలో ప్రతి రంగానికీ ఒక్కో ఇండియన్ స్కూల్.

***..మొదలైన అంశాలను విజన్ డాక్యుమెంట్ లో పొందుపరిచారు.***

దేశ చరిత్రలో ఏ రాష్ట్రమూ ఇంతవరకు రెండు దశాబ్దాల్లో 15 రెట్లు అభివృద్ధి చెందిన దాఖలాలు లేవు. చైనాలోని గ్వాంగ్ డాంగ్ ప్రావిన్స్ నమూనాలో ఆ స్థాయి అభివృద్ధిని సాధిస్తామని ప్రభుత్వం చెబుతోంది. లక్ష్యసాధన అసాధ్యం కాదుగానీ, అందుకుతగ్గ విధానాలు లేవని కొందరు నిపుణులు పరోక్షంగా హెచ్చరించారు. మీడియా కూడా మొదట సాంకేతికత వింతలు, విశేషాలు, ప్రముఖుల ప్రసంగాలకే ప్రాధాన్యతనిచ్చి అసలైన విజన్ డాక్యుమెంట్ వివరాల్ని మొక్కుబడిగా ప్రస్తావించింది. ఈ సమ్మిట్‌లో పాల్గొన్న వారిలో కాస్త ఆచరణసాధ్యంగా మాట్లాడిన వారిలో, అమెరికాలో ప్రొఫెషనల్ ఉద్యోగం చేసి వచ్చిన పరశు రాం తెలంగాణలోని యూనివర్సిటీల పరిస్థితి పట్ల తీవ్ర అసం తృప్తి వ్యక్తం చేశారు. ఇక్కడి యూనివర్సిటీల్లో పరిశోధనలే లేవ న్నారు. ఆర్‌బీఐ మాజీ గవర్నర్ రఘురాం రాజన్ మాట్లాడుతూ, మన దేశంలో ప్రస్తుతం ఉద్యోగాల కల్పనే అతిపెద్ద సవాలన్నారు. ఇందుకోసం విద్య, వైద్యం, నైపుణ్యాభివృద్ధి మీద దృష్టి సారించాలన్నారు. ప్రణాళికలను యథాతథంగా అమలు చేయకుండా, ప్రభావాన్ని బేరీజు వేస్తూ లోటుపాట్లను సరిదిద్దు కోవాలన్నారు. స్కూలు విద్యలో నాణ్యతా ప్రమాణాలను పెం చటం గురించి ఆర్థిక నోబెల్ విజేత అభిజిత్ బెనర్జీ ప్రస్తావిం చారు. ప్రతి అడుగూ పరిశీలించి, ఆలోచించి వేయటం ద్వారా అనుకున్న లక్ష్యాలను సాధించగలమని, తెలంగాణ రైజింగ్ గొప్ప ప్రారంభంగా భావించాలన్నారు. విజన్‌కు తగ్గట్లు విధానాలను సరిదిద్దుకుని, నిర్ణీత సమయంలోగా ప్రతి స్వల్ప, మధ్యకాలిక లక్ష్యాన్నీ సమర్థంగా సాధిస్తూ, సమీక్షించుకుంటూ సాగటమే లక్ష్యాన్ని చేరుకోవటానికి ఆచరణసాధ్య మార్గం. ❖

## సౌరశక్తితో ఖర్చులేని ఇంధనం .. సరైన విధానాలుంటే

# ఇప్పటి సాంకేతికతలతో మానవాళి చరిత్రనే మార్చగలం: జేపీ




వేగంగా పెరుగుతున్న సాంకేతికతల వల్ల మనకున్న పరిమిత వనరుల్లో 99 శాతాన్ని సమర్థంగా వినియోగించుకున్నా చిట్టచివరి కుటుంబంలోని బిడ్డలకు సైతం అద్భుతావకాశాల్ని అందించవచ్చని, మానవజాతి చరిత్రలో ఇదో అపూర్వ కాలమని ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్.డి.ఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకులు డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ అన్నారు. అయితే ఈరీతిలో వ్యక్తులుగా, సమాజంగా ఎదగాలంటే నిర్దిష్ట రోడ్ మ్యాప్ ఉండాలన్నారు. నాణ్యమైన విద్య, ఆవిష్కరణలు, సమ్మిళిత అభివృద్ధికి తగిన నమూనాలో మౌలిక వసతుల నిర్మాణం అవసరమన్నారు. పునరుత్పాదక ఇంధన రంగంలో, ముఖ్యంగా సౌరశక్తిలో ఊహించని అవకాశాలున్నాయని.. స్టోరేజీ, కన్వర్షన్ వంటి సమస్యల్ని పరిష్కరించుకోగలిగితే భవిష్యత్తులో రూపాయి ఖర్చు లేకుండా ఇంధనం అందుబాటులోకి వచ్చినా ఆశ్చర్యపోనక్కర్లేదన్నారు. దేశ విదేశాల ఆవిష్కరణలు ఈవేళ్టి మానవాళి జీవితాల్ని గణనీయంగా మెరుగుపరుస్తున్నాయన్నారు. అయితే వీటిని వేగవంతం చేయాల్సిన రాజకీయం ఇంకా బూజుపట్టిన పద్ధతుల్లోనే కొనసాగటం సమస్యగా ఉందన్నారు.

హైదరాబాద్ ఉస్మానియా విశ్వవిద్యాలయం కాలేజ్ ఆఫ్ టెక్నాలజీలో నిర్వహించిన అలుమ్నీ అసోసియేషన్ మీట్ 2025లో జేపీ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. విశిష్ట అతిథిగా జాతీయ చిన్న పరిశ్రమల కార్పొరేషన్ జోనల్ జనరల్ మేనేజర్ సురేష్ బాబు హాజరయ్యారు. పూర్వ విద్యార్థుల సంఘం తరపున అధ్యక్షుడు రాజా మహేందర్ రెడ్డి, కార్యదర్శి సి.పి రాములు గత ఎనిమిదేళ్లుగా సంస్థ చేపట్టిన కార్యకలాపాలను వివరించారు.

సామాజిక రంగంలో మార్పుల గురించి ప్రస్తావిస్తూ, తాము మెడిసిన్ చదువుకునే రోజుల్లో వైద్య విద్యలో అమ్మాయిలకు 33% రిజర్వేషన్లు ఇవ్వాల్సి వచ్చేదని, ఇప్పుడు మగపిల్లలకు కోటా కల్పించాల్సి వస్తోందని జేపీ అన్నారు. అంతలా మహిళా విద్య పురోగమించిందన్నారు. వైద్య రంగంలో అసాధారణ నైపుణ్యాలకు తెలుగు రాష్ట్రాలు, భారత్ నెలవుగా ఉన్నా.. కోట్లాది మంది సామాన్యులకు సరైన వైద్యం అందని దుస్థితి నెలకొందన్నారు. కేవలం అనారోగ్య ఖర్చుల వల్ల ఏటా 5.5 కోట్ల మంది పేదలవుతున్నారని, అనేకమంది ఉత్పాదక శక్తి తగ్గటం వల్ల వచ్చే ఆర్థిక నష్టం ఇందుకు అదనమన్నారు. సంపదసృష్టిలో మహిళల భాగస్వామ్యం పెరగటం వల్ల పేదరికాన్ని తొలగించగలమన్నారు. జాతీయ విద్యావిధానం (ఎన్.ఈ.పి) వల్ల కొంత మార్పు మొదలైందని, విద్యా ప్రమాణాలు మెరుగుపడటానికి రాజకీయం, సమాజంలో ఇంకా సరైన అవగాహన అవసరమని అన్నారు. ఐఐటీలు, ఐఐఎంలలో చదువుకున్నవారు భారత ఉన్నతవిద్యను బలోపేతం చేస్తూ విదేశాల్లోనూ ఆవిష్కరణలు, వ్యవస్థాపనలు చేయగలుగుతున్నా, చాలా ఇంజినీరింగ్ కళాశాలల్లో నాసిరకం విద్య అందుతోందన్నారు. 80 శాతం మంది ఇంజినీరింగ్ విద్యార్థులు నిరుద్యోగులుగా ఉండటం జాతి విలువైన సంపదను నష్టపోవటమన్నారు. వృత్తివిద్యా నైపుణ్యాలు, పటిష్టమైన ఆరోగ్య వ్యవస్థ, స్థానికంగానే ఉపాధి అవకాశాలు, పాలనలో ఎక్కడికక్కడ ప్రజల, ముఖ్యంగా యువత విస్తృత భాగస్వామ్యం వంటి పద్ధతులతో సమ్మిళిత అభివృద్ధి ద్వారా భారత్ ఒకప్పటి చైనాలాగా 8-10% వృద్ధి రేటుతో అభివృద్ధి చెందిన దేశాలకు దీటుగా ఎదగగలదని జేపీ పేర్కొన్నారు.

ఓయూ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ కుమార్ మొలుగరం మాట్లాడుతూ.. బోధన, పరిశోధన, ఆవిష్కరణ, మౌలిక సదుపాయాలు అనే నాలుగు అంశాలపై దృష్టి సారించామన్నారు. గ్లోబల్ ర్యాంకింగ్‌లలో 1000 అత్యుత్తమ సంస్థల్లో ఒకటిగా విరాజిల్లటమే తమ లక్ష్యమన్నారు. ఉన్నతస్థాయికి ఎదిగినవారు తాము చదువుకున్న విద్యా సంస్థలకు, సమాజానికి కొంత ఉత్పాదకంగా తిరిగివ్వటం నాణ్యమైన విద్యా సంస్కృతిలో భాగమన్నారు. టెక్నాలజీ కాలేజీ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ రమేష్ కుమార్, పూర్వ విద్యార్థుల సంఘం మాజీ అధ్యక్షులు ఆచార్య ఎస్.వెంకటేశ్వర్లు, రిటైర్డ్ ఐఏఎస్ పురుషోత్తంరెడ్డి, ఎ.భాస్కరరెడ్డి, శంకర్, సేతు రామన్, ప్రొఫెసర్లు శ్యామ్‌సుందర్, సంకర్షణ, రాజం, కిరణ్‌కుమార్, విద్యాభూషణ్, డాక్టర్ పవన్‌కుమార్, విజయలక్ష్మి, యాదగిరి, ఐలయ్య, అజిత్‌కుమార్, కె.శ్రీనివాసులు పాల్గొన్నా రు. బీటెక్ కెమికల్ ఇంజినీరింగ్, ఫుడ్ టెక్నాలజీ, వస్త్ర సాంకేతికత, ఫార్మసీ విద్యార్థులకు ఉత్తమ విద్యార్థి అవార్డులను ప్రదానం చేశారు. ❖

# టార్చ్ బేరర్ 'పరీక్షల్లో విజయానికి 18 సూత్రాలు'

బట్టీ, కాపీ పద్ధతి పరీక్షల్లో ర్యాంకులు, మార్కులు విద్యార్థుల ప్రతిభకు గీటురాళ్లు కాదని ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్.డి.ఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకులు డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ అన్నారు. ఒత్తిడి లేకుండా విద్యార్థుల సృజనాత్మకత, సమస్యల పరిష్కార సామర్థ్యం, మార్కెట్ అవసరాలకు అన్వయించే శక్తిని బేరీజు వేసేలా పరీక్షల పద్ధతిని అమలు చేయాలన్నారు. ప్రముఖ పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ గుండ్లూరు సురేంద్రబాబు రచించిన 'పరీక్షల్లో విజయానికి 18 సూత్రాలు' పుస్తకాన్ని హైదరాబాద్ బుక్ ఫెయిర్ లో జేపీ ఆవిష్కరించారు. విద్య వ్యక్తిగత వ్యవహారం కాదని, ప్రతి బిడ్డ నాణ్యమైన చదువునూ మొత్తం సమాజం పట్టించుకుంటేనే ప్రతి ఒక్కరి అభివృద్ధీ సాధ్యమవుతుందన్నారు. పేద కుటుంబంలో పుట్టిన తాను ఉన్నత స్థాయికి ఎదగటానికి పుస్తకాలు ఎంతో దోహదం చేశాయని, ఈవేళ టెక్నాలజీ వల్ల పుస్తక పఠనం తాత్కాలికంగా తగ్గినా కంటెంట్ విలువ మాత్రం తగ్గలేదని సురేంద్రబాబు అన్నారు.



మహాత్మా జ్యోతిరావు పూలే గురుకుల విద్యాలయాల జేసీ, అదనపు కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ లాల్, సామాజిక సమరసతా వేదిక కన్వీనర్ అప్పాల ప్రసాద్ జీ, ప్రముఖ సినీ రచయిత డాక్టర్ పెద్దింటి అశోక్ కుమార్, బెంగళూరుకు చెందిన ప్రముఖ పేరెంటింగ్ కోచ్ విజయలక్ష్మి, జయవారాహి గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## గాంధీ పోయి రాముడు వస్తే ఉపాధి పెరగదు..

## ఇంకా ఎక్కువ నిరుద్యోగమున్న పట్టణ యువతకు ఉపాధి ఎలా అందిస్తారు?

పేరులో గాంధీ పోయి రాముడు వస్తే యువతకు ఉపాధి పెరగదని, ఎప్పుడో బ్రిటిష్ వలసకాలంలో కరవు కాలంలో ఆపద్ధర్మంగా మొదలుపెట్టిన కార్యక్రమాన్ని ఉపాధి హామీ పథకాన్ని 21వ శతాబ్దం 2.0లో, భారత్ ప్రపంచంలో మూడో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించబోతున్న తరుణంలో సంచలనంగా చర్చించుకోవాల్సి రావటం దురదృష్టకరమని లోక్‌సత్తా ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ విజయవాడలో అన్నారు. యువ జనాభా భారీగా ఉందని తెలిసినా, గత ప్రభుత్వం, ప్రస్తుత ప్రభుత్వం ఆ దిశగా యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకోలేదన్నారు. ఉపాధి హామీ పథకాన్ని ఆంధ్రప్రదేశ్‌లోనే ప్రారంభించారని, ఆ సమయంలో ఉత్పాదక ఆస్తుల సృష్టికి వినియోగించాలని ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్.డి.ఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకులు డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ అసెంబ్లీలో చెప్పినా, కాంగ్రెస్ ప్రభుత్వం దుర్వినియోగం చేసిందన్నారు. వ్యవసాయాన్ని బాగు చేసే చట్టాలను కూడా రాజకీయం చేయటంతో చిన్న, సన్నకారు రైతులు ఉపాధిహామీ కూలీలుగా పనులు చేసుకుంటున్నారన్నారు. గత ఉపాధి హామీ చట్టం వల్ల జరిగిన మంచిలో భాగంగా ఉత్తరాంధ్రలోని గిరిజనులు సుమారు లక్షన్నర ఎకరాల్లో పోడు వ్యవసాయానికి వాటర్ షెడ్ పథకాలను అమలు గావించుకోగలిగారన్నారు. గతం కంటే ప్రస్తుత చట్టం ఆస్తుల సృష్టిపరంగా మెరుగ్గా ఉన్నా, రాష్ట్రాలు తమ వాటా 40% చెల్లించటం, హక్కుగా అమలు చేయకపోవటం వంటివి సమస్యలు సృష్టించే అవకాశముందన్నారు. రాష్ట్రాలు సంక్షేమం పేరుతో తాత్కాలిక పథకాలకు నిధుల్ని దుర్వినియోగం చేయకుండా కట్టడి చేసి ఉపాధి ఆధారిత పథకాలకు సద్వినియోగం చేసేలా, సంక్షేమం-అభివృద్ధి మధ్య సమతూకం ఉండేలా యూనియన్ ప్రభుత్వం తనకున్న రాజ్యాంగబద్ధ అవకాశంతో చట్టం చేయాలన్నారు. అప్పుడు రాష్ట్రాల్లో నిధుల కొరత ఉండదన్నారు. వ్యవసాయానికి ఏదో దయదలచినట్లు సీజన్ లో కూలీల కొరతను నివారించేలా 60 రోజులు మినహాయింపు కాకుండా.. రైతుకి లాభసాటి ఆదాయం వచ్చేలా వ్యవసాయ చట్టాల సంస్కరణలను, స్వేచ్ఛామార్కెట్ సంస్కరణలను, రిటైల్ చెయిన్లను అమలు చేయాలన్నారు. వీబీ-జీ-రామ్ జీ అని పేరు పెట్టినంత మాత్రాన ఈ పథకం శాశ్వతం కాదని, కాకూడదని బాబ్జీ స్పష్టం చేశారు. చిన్న పట్టణాలు అభివృద్ధి చేయటం, నాణ్యమైన విద్య, ఆరోగ్యం, నైపుణ్యాలు అందించటం, పరిశోధనల్ని, సొంత ఆవిష్కరణల సంస్కృతిని పెంపొందించటం చేయాలన్నారు. గతిలేక ఉపాధి కాకుండా అర్హతతో నాణ్యమైన ఉపాధి అవకాశాల్ని సాధించుకోగలిగేలా, ఎంట్రప్రెన్యూర్ లను తయారుచేయగలిగేలా, ఉత్పాదకత పెరిగేలా సమగ్ర విధానాల్ని నిపుణులతో కూర్చుని చర్చించి వేగంగా అమలు చేస్తేనే స్వదేశీ ఆర్థిక వ్యవస్థ బలోపేతమవుతుందన్నారు.

# అవినీతి సొమ్ముతో సంతోషంగా ఉండలేరు : కలెక్టర్




ఉద్యోగులకు ఇవ్వాల్సిన జీతం కంటే రాష్ట్ర ప్రభుత్వం ఎక్కువగానే ఇస్తోంది.. అయినా అవినీతికి పాల్పడతామంటే చర్యలు కఠినంగా ఉంటాయి.. అవినీతి సొమ్ము ఎంత సంపాదించినా సంతోషంగా ఉండలేరు అన్న విషయాన్ని గుర్తుంచుకోండి.. ఉన్న దాంట్లో సంతృప్తిగా బతకడం నేర్చుకోండి.. అని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ ప్రభుత్వ ఉద్యోగులను ఉద్దేశిస్తూ పేర్కొన్నారు. నూతన సంవత్సరం సందర్భంగా అవినీతి వ్యతిరేక సంస్థ జ్వాల, లోక్‌సత్తా సంయుక్త ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఆవ రణలోని తెలంగాణ తల్లి విగ్రహం ముందు ప్రభుత్వ ఉద్యో గుల అవినీతి వ్యతిరేక ప్రతిజ్ఞ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన బ్యానర్ పై జిల్లా కలెక్టర్ స్నేహ తొలి సంతకం చేసి అవినీతికి పాల్పడనంటూ ప్రతిజ్ఞ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. అవినీతికి వ్యతిరే కంగా కఠినంగా వ్యవహరిస్తున్నామని, అన్ని కార్యాల యాల్లో సీసీ కెమెరాలు పెట్టామని పేర్కొన్నారు. జ్వాల సంస్థ వ్యవస్థాపక అధ్యక్షడు లోక్‌సత్తా వరంగల్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు సుంకరి ప్రశాంత్ మాట్లాడుతూ.. స్వాతంత్రం వచ్చి 8 దశాబ్దాలు కావస్తున్నా అవినీతి మాత్రం తగ్గటం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్ని కొత్త సంవత్సరాలు వచ్చిన ఏం లాభం క్యాలెండర్లో అంకెలు సంఖ్యలే మారు తున్నాయి ఇప్పటివరకు 79 క్యాలెండర్లు మారాయి కానీ ప్రభుత్వ శాఖలో ప్రతి పనికి లంచం చెల్లించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. అవినీతిపరులకు శిక్షపడేలా పౌరు లను చైతన్యం చేస్తామని, నిజాయితీ గల ఉత్తమ అధికా రులను ప్రతి ఏటా సన్మానిస్తామని ప్రశాంత్ ప్రకటించారు. ఈ కార్యక్రమంలో హన్మకొండ జిల్లా అదనపు కలెక్టర్ రవి, ముండ్రాటి సదానందం శ్రీనివాస్. లోక్‌సత్తా, జ్వాల సభ్యులు. కామిడి సతీష్‌రెడ్డి , కృష్ణమూర్తి. పొట్లపల్లి వీర భద్రరావు, బుద్దే సురేష్. శేషిదర్ రెడ్డి. శంకుమాం, విద్యార్థులు పాల్గొన్నారు.





**అవినీతి వ్యతిరేక దినోత్సవం సందర్భంగా వరంగల్‌లో.. అవినీతిపరులకంటే బిచ్చగాళ్లే నయం అంటూ బిచ్చగాళ్లతో ర్యాలీ నిర్వహించారు. హనుమకొండలో అంబేద్కర్ విగ్రహం దగ్గర ప్రదర్శన నిర్వహించారు. లోక్‌సత్తా ఉద్యమ సంస్థ ఉభయ రాష్ట్రాల సమన్వయకర్త బండారు రామ్మోహనరావు, సుంకరి ప్రశాంత్, వీవీ రావు తదితరులు పాల్గొన్నారు.**

## ప్రలోభాలకు లొంగకండి!..:రామ్మోహనరావు




ఎన్నికలలో డబ్బు మద్యం ఇతర ప్రలోభాలకు లొంగకుండా ఊరికి ఉపకారిని చూసిప్రజలు ఓటేయాలని స్థానిక ప్రభుత్వాల సాధికారత వేదిక తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ బండారు రామ్మోహన్ రావు అన్నారు. స్టేషన్ ఘన్పూర్ నియోజకవర్గంలోని సముద్రాల గ్రామంలో ఎన్నికల నిఘా వేదిక వారు నిర్వహించిన ఓటర్ల అవగాహన సదస్సు లో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. రాష్ట్రంలో మూడు విడతలుగా జరుగుతున్న ఎన్నికలలో ఇప్పటికే ఏకగ్రీవాల పేరిట వేలంపాట రాజకీయాలు కొనసాగాయని బలవంతపు ఏకగ్రీవాలను రద్దు చేయాలని రామ్మోహనరావు డిమాండ్ చేశారు. ఈ అవగాహన సదస్సుకు ఉమ్మడి వరంగల్ జిల్లా ఎన్నికల నిఘా వేదిక సమన్వయకర్త సుంకరి ప్రశాంత్ కుమార్ అధ్యక్షత వహించారు. ఓటును అమ్ముకోకండి చేటు తెచ్చుకోకండి అని ఆయన అన్నారు. మద్యం, సారా తీసుకొని తమ ఐదేళ్ల భవిష్యత్తును తాకట్టు పెట్టవద్దని ఓటును అమ్ముకోవద్దని ఓటర్లు చైతన్యవంతులై ప్రజాకవి కాళోజీ నారాయణరావు అన్నట్లు ఏ పార్టీ వాడని చూడకుండా ఏ పాటివాడని చూసి ఓటు వేయాలని తెలంగాణ రాష్ట్ర ఎన్నికల నిఘా వేదిక సమన్వయకర్త వి వెంకటేశ్వరరావు అన్నారు. పోటీ చేస్తున్న అభ్యర్థుల మధ్య ఎవరు మంచివారు మన గ్రామానికి అభివృద్ధి ఎవరు చేస్తారు అని బేరీజు వేసుకొని ఓటు వేయాలని సామాజికవేత్త శ్రీనివాసరెడ్డి పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సముద్రాల గ్రామస్తులతో పాటు స్టేషన్ ఘన్పూర్ నియోజకవర్గం ఎన్నికల నిఘా వేదిక కన్వీనర్ విజయ్ కో కన్వీనర్ దేశం కోసం ప్రకాష్ హైదరాబాదు నుండి వచ్చిన యువ న్యాయవాదులు శ్రావ్య, నిశ్చిత్ పాల్గొన్నారు.



తెలివితేటలు వికసించటానికి, నైపుణ్యాలు పెరగటానికి అవకాశాలు ఎంత ముఖ్యమో, ప్రతి వ్యక్తీ తన వంతు కష్టపడటం కూడా అంతే ముఖ్యమని ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్.డి.ఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకులు డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ అన్నారు. హైదరాబాద్ గచ్చిబౌలిలోని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా (ఎస్కీ) లో 'వదాన్య' సంస్థ 15వ వార్షికోత్సవంలో జేపీ పాల్గొన్నారు. యువత కెరీర్ లో ఎదుగుతూ సమాజ హితానికి ఉపయోగపడేనిజమైన విద్యను అందిస్తున్నారనిప్రతినిధులను ప్రశంసించారు.మనిషికి జ్ఞానం, నైపుణ్యాలు, వ్యక్తిత్వం, నాణ్యమైన జీవన ప్రమాణాలు విద్య ద్వారానే సాధ్యమని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జి.రామకృష్ణ ప్రసాద్ అన్నారు. ఉక్కు సంకల్పంతో ముందుకెళ్తే జీవితంలో అనుకున్నది సాధించగలమని, జమ్మూకశ్మీర్ వద్ద చినాబ్ నదిపై నిర్మించిన ప్రపంచంలోనే అతి పెద్ద రైల్వే వంతెన నిర్మాణంలో తాను భాగమవటమే ఇందుకు నిదర్శనమని ఇండియన్ ఇన్ స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ (ఐ.ఐ.ఎస్.సి) ప్రొఫెసర్ గాలి మాధవీలత అన్నారు. ఐ.ఎఫ్.ఎస్ అధికారి డాక్టర్ సి.సువర్ణ మాట్లాడుతూ, అత్యున్నత శిఖరాలను అధిరోహించటానికి క్రమశిక్షణ విద్యలో భాగం కావటం ఎంతో ముఖ్యమన్నారు. ప్రతిభావంతులైన నిరుపేద విద్యార్థులకు చదువుకునే అవకాశం అందిస్తూ పదిహేనేళ్లుగా తమ సంస్థ అనేక సేవా కార్యక్రమాలను చేపట్టిందని వదాన్య సంస్థ వ్యవస్థాపకులు అశోక్ పడిపాటి తెలిపారు. ఎస్కీ డైరెక్టర్ రామేశ్వర్‌రావు, సినీ దర్శకుడు హను రాఘవపూడి, రచయిత, దర్శకుడు బీవీఎస్ రవి తదితరులు పాల్గొన్నారు.

# కెరీర్‌తోపాటు సమాజాన్ని, రాజకీయాల్నీ పట్టించుకోండి

రాజకీయాలకు ఈవేళ అర్థం మారిపోవటం వల్ల యువత ఎక్కువగా ప్రజాపాలనకు దూరంగా ఉంటున్నారని, అది సరికాదని ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్.డి.ఆర్), లోక్ సత్తా వ్యవస్థాపకులు డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ అన్నారు. దీనివల్ల కొన్ని తరాలపాటు నష్టపోవాల్సి ఉంటుందన్నారు. చెడుకు బలికాకూడదుగానీ, చెడును సహించకూడదన్నారు. నిజమైన రాజకీయం పవిత్ర వ్యాసంగమని, ఆ దిశగా రాజకీయాన్ని పునర్నిర్వచించటం మనందరి బాధ్యత అన్నారు. హైదరాబాద్ లోని జి.నారాయణమ్మ మహిళా ఇంజినీరింగ్ కళాశాల (జీనిట్స్)లో స్కూల్ ఆఫ్ ఇన్నోవేషన్ అండ్ మేనేజ్ మెంట్ ఆధ్వర్యంలో జరిగిన టెడెక్స్ ఎస్.ఓ.ఐ.ఎం సదస్సులో జేపీ ముఖ్య అతిథిగా ప్రసంగించారు. సమాజంలో రకరకాల ఆలోచనలు, అవసరాలు ఉంటాయని.. అందరి ప్రయోజనాలనూ సమన్వయం చేస్తూ, సంక్షేమం-అభివృద్ధి సమతూకంతో పరిపాలన సాగేలా రాజకీయం ఉండాలన్నారు. అందుకోసం ఎన్నికల్లో పోటీ మాత్రమే మార్గం కాదని, యువత తమ కెరీర్ చూసు కుంటూనే చుట్టూ ఉన్న సమాజం, రాజకీయాల్ని పట్టించుకోవాలన్నారు. రోజువారీ జీవితంలో సమస్యల్ని పరిష్కరించే నాయకత్వ లక్షణాల్ని ప్రదర్శించాలన్నారు. కొందరు నాయకులు, కొన్ని పార్టీలను ఆరాధిస్తూ కూర్చోకుండా మంచి పాలనకు నిర్మొహమాటంగా ప్రజలు మద్దతు ఇవ్వాలన్నారు. సుపరిపాలన రాజధానుల్లో, ఈవెంట్ మేనేజ్‌మెంట్లలో ఉండదని.. మన పంచాయతీ, మునిసిపాలిటీల్లో సమస్యల్ని పరిష్కరించుకోవటంలో ఉంటుందన్నారు. కార్యక్రమంలో ప్రముఖ గైనకాలజిస్ట్ డాక్టర్ శ్రుతి ముvva, సినీ నటుడు బలగం వేణు, నటి, ఇన్ ఫ్లుయెన్సర్ వితిక శేరు, జీనిట్స్ వైస్ చైర్ పర్సన్ శ్రీవిద్యారెడ్డి, ప్రిన్సిపల్ డాక్టర్ కె.రమేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

RNI. Regd No. 69976/98 Postal Reg. No. HCD-913/2024-2026 Published on 10th January 2026 Posting Date 15 &16th of every month
Posted at BPC-IV Patrika Channel, Nampally, HYDERABAD-500 001




చైనాలోని గ్వాంగ్ డాంగ్ ప్రావిన్స్ నమూనాలో తెలంగాణ రైజింగ్ విజన్ డాక్యుమెంట్ 2047ను విడుదల చేసినట్లు ముఖ్యమంత్రి రేవంత్ ప్రకటించారు. మిగతా విషయాలు అలా ఉంచి కేవలం స్థానిక ప్రభుత్వాల సాధికారత వరకూ తీసుకుందాం. చైనాలో స్థానిక ప్రభుత్వాలకు మొత్తం దేశవ్యాప్త ఖర్చులో 51% పైగా కేటాయిస్తారు. తెలంగాణలో రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్నది 'జీరో'. పవర్ లేని స్థానిక ప్రభుత్వాల్లో బీసీలకు 42% రిజర్వేషన్లని డ్రామాలాడారు. చివరికి ఆ రిజర్వేషన్లూ లేవు, పవర్సూ లేవు. పంచాయతీ ఎన్నికలు పూర్తయిపోయాయి. రిజర్వేషన్లు ఎన్ని ఇచ్చినా పవర్ లేని స్థానిక ప్రభుత్వాలతో తెలంగాణ రైజింగ్ ఎలా సాధ్యం?.. ప్రజాస్వామ్యానికి పాఠశాలలైన స్థానిక ప్రభుత్వాల్లో సర్పంచ్ నుండి మేయర్ దాకా ఉత్సవ విగ్రహాలై, అధికారమంతా ప్రధానమంత్రి, ముఖ్యమంత్రి, కలెక్టర్ వద్ద కేంద్రీకృతమవటం వల్ల దేశానికి, ముఖ్యంగా రాజకీయాల్లో నాయకులుగా ఎదగాలనుకుంటున్న యువతకు జరుగుతున్న నష్టంపై జేపీ చెబుతున్న కీలక వాస్తవాలు వినండి.




*If undelivered please return to:*
*LOKSATTA UDYAMA SAMSTHA,*
*H.NO. 6-3-678,B-106,*
*PASHA COURT 71, Somajiguda,*
*Behind TRIBHUVANDAS*
*JEWELLERS (TBZ),*
*Hyderabad - 500 082*

**Edited, Printed and Published by Dr. Jayaprakash Narayan, National Coordinator, Loksatta for and behalf of Foundation for Democratic Reforms, H.NO. 6-3-678,B-106,PASHA COURT 71, Somajiguda, Behind TRIBHUVANDAS JEWELLERS , Hyderabad- 500 082.**
**Printed at Kala Jyothi Process Pvt Ltd, Plot No : CFC-1 and 2, Survey No: 18, E-City, SEZ, General industrial park, Raviryal & Srinagar village, Maheswaram mandal, Rangareddy district-501359, Telangana.**